www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 11-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 223 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: సప్తమి రా.11:09 తదుపరి అష్టమి; నక్షత్రం: పుష్యమి రా.6:18 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.8:36-9:21, రా.9:47-10:37; అమృతఘడియలు: మ.12:02-1:36; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:21, సూర్యాస్తమయం: 5:36 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సిద్దరామయ్యకు అధిష్ఠానం షాక్?

అపాయింట్‌మెంట్ నిరాకరణ 2



ఢిల్లీలో భారీ పేలుడు

ఎర్రకోట సమీపంలో పేలిన కారు

9 మంది మృతి

24 మందికి గాయాలు

ముగ్గురు విషమం.. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం

- ఛిద్రమైన శరీరభాగాలతో ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు
- పేలుడు ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న పలు వాహనాలు, దుకాణాలు
- పేలుడు సమయంలో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా
- ఘటనాస్థలికి హోం మంత్రి షా
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ
- ఉగ్రకుట్ర కోణంలోనూ ఎన్ఐఏ దర్యాప్తు
- కారు కదలికలపై వివరాల కోసం సీసీటీవీ కెమెరాల జల్లెడ



ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో మంటల్లో కాలిపోతున్న వాహనాలు; క్షతగాత్రులను రక్షించడానికి స్థానికుల యత్నం



పేలుడుకు కారణమేంటో ఇప్పటికిప్పుడు చెప్పలేం

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం
వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతాం: అమిత్ షా 2

న్యూఢిల్లీ, నవంబరు 10: దేశ రాజధాని ఢిల్లీ.. భారీ పేలుడుతో దద్దరిల్లింది! దేశంలోని అత్యంత హై ప్రొఫైల్ ప్రాంతాల్లో ఒకటి.. పంద్రాగస్టునాడు దేశ ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించే ఎర్రకోటకు సమీపంలో మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో కారు పేలి 9 మంది మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు! క్షతగాత్రులను హుటాహుటిన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని.. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఢిల్లీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్న రోజునే.. అదీ హరియాణా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కారులో పేలుడు జరగడంతో.. దీని వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు, ఇతర కేంద్ర సంస్థల సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పేలుడు తీవ్రతకు ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు కనిపించాయి. మృతదేహాలు ఛిద్రమై శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపైన, పక్కనే ఉన్న వాహనాలపైనా పడ్డాయి. పేలుడు ధాటికి.. చుట్టూ ఉన్న వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు కార్లు, రెండు ఈ-రిక్షాలు, ఒక ఆటో అగ్నికి ఆహుతైపోయాయి. మొత్తం 22 కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలికి సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. భవనాలు కంపించాయి. ఈ పేలుడు జరిగిన మూడు నిమిషాలకే అగ్నిమాపక శాఖకు ఫోన్ కాల్

మిగతా 2వ పేజీలో...

భారీ ఉగ్రకుట్ర భగ్నం

- 3 రాష్ట్రాల్లో 8 మంది ఉగ్రవాదుల అరెస్టు
- వీరిలో ముగ్గురు వైద్యులు, వారిలో ఒకరు మహిళా డాక్టర్
- 2,900 కేజీల పేలుడు పదార్థాల స్వాధీనం
- ఏకే 47 రైఫిళ్లు, పిస్టోళ్లు, టైమర్లు గుర్తింపు
- మహిళా డాక్టర్ కారులో అసాల్ట్ రైఫిల్
- హైదరాబాద్ డాక్టర్ అరెస్టుతో కలిపి నలుగురు వైద్యులకు ఉగ్రలింకులు
- శ్రీనగర్‌లో వెలసిన పోస్టర్లపై కూపీ లాగితే బయటపడ్డ కుట్ర
- హరియాణా, కశ్మీర్ పోలీసుల ఆపరేషన్ 2


హైదరాబాద్‌లో హై అలర్ట్

బస్టాండ్లు, రైల్వే, మెట్రో స్టేషన్లు, విమానాశ్రయంలో తనిఖీలు

ఢిల్లీ విమానాశ్రయం పరిధిలో జీపీఎస్ స్పూఫింగ్!

10

- విమానాలకు తప్పుడు సంకేతాలు అందినట్లు పైలట్ల ఫిర్యాదు
- దర్యాప్తు చేపట్టిన ఎన్ఎస్ఏ కార్యాలయం



మాయమైపోయిండు..

అందెశ్రీ

హఠాన్మరణం

- సోమవారం ఉదయం ఇంట్లోనే కుప్పకూలిన సహజ కవి
- హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి
- ప్రభుత్వ లాంఛనాలతో నేడు ఘట్‌కేసర్‌లో అంత్యక్రియలు
- అక్కడి ఔటర్ జంక్షన్లో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- లాలాపేట ఇంటి నుంచి ఔటర్ జంక్షన్ వరకూ అంతిమ యాత్ర
- అంత్యక్రియలకు హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రజల సందర్శనార్థం జయశంకర్ స్టేడియంలో మృతదేహం
- తరలివచ్చిన నేతలు, అభిమానులు
- ఘనంగా నివాళులు

అయన ఒకప్పుడు పశువుల కాపరి! పశువుల్లో మంచితనాన్ని చూశాడు! మనుషుల్లో పశుత్వాన్నీ చూశాడు! అందుకే, మారిపోతున్న మనిషి చిత్రాన్ని కళ్లకు కట్టాడు!

ఆయన ఒకప్పుడు భవన నిర్మాణ కార్మికుడు! భవనమైనా.. రాష్ట్రమైనా.. నిర్మాణం విలువ తెలుసు! అందుకే, తెలంగాణకు గుండెల నిండా ఆర్తితో పాడుకునే రాష్ట్ర గీతాన్నే సృజించాడు!

అయన బాల్యమంతా అవమానాలు, ఆకలిదప్పులు! వాటినే ఆలంబనగా చేసుకుని ఆకాశమంత ఎదిగాడు!

ఆయన జీవితమంతా కష్టాలూ కన్నీళ్లు! కానీ, పేదల కష్టాలను, పల్లె కన్నీళ్లను తన పాటల రూపంలో పేర్చి కూర్చాడు! చివరికి, తన కోసం లక్షలాదిమంది కన్నీళ్లు పెట్టే స్థాయికి చేరి మరలిరాని లోకాలకు అందెశ్రీ తరలిపోయాడు! 13

ప్రజల గొంతుకగా అందెశ్రీ!

- ఆయన మరణం.. సాహితీ రంగానికి తీరని లోటు
- 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపిన ప్రధాని మోదీ
- సాహితీ శిఖరం నేలకూలింది: సీఎం రేవంత్ 14
- ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారు: కేసీఆర్



14

తెలంగాణకు దక్కిన ఐఆర్‌సీ సారథ్యం

- అధ్యక్షుడిగా ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్
- రహదారి భద్రతకు పెద్దపీట
- 'ఆంధ్రజ్యోతి'తో మోహన్

ప్రమాణాలు పాటిస్తారా? కంపెనీలు మూసేయాలా?

- 'దగ్గు మందు' మరణాల నేపథ్యంలో ఫార్మా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరిక
- జనవరి1 లోపు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్పులు చేయాలి
- లేదంటే మూసివేతే 10
- తేదీని పొడిగించే ప్రసక్తే లేదు: సీడీఎస్‌సీవో

ఎవరి ధీమా వారిదే

జూబ్లీహిల్స్‌లో గెలుపు తమదంటే తమదంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

- గట్టి పోటీ ఇస్తామంటున్న బీజేపీ
- పార్టీ యంత్రాంగాన్నంతా నియోజకవర్గంలో మోహరించిన అధికార, ప్రతిపక్షాలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్
- వారం రోజులుగా ప్రచారంలోనే మంత్రులు
- ముస్లింలు, బీసీ, ఎస్సీ, సెటిలర్లలో మెజార్టీ తమ వైపేనంటున్న కాంగ్రెస్ నేతలు
- భారీ మెజారిటీతో గెలుస్తామని ధీమా
- సిటింగ్ సీటు మళ్లీ తమదేనన్న బీఆర్ఎస్
- ఉధృతంగా కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారం
- ప్రభుత్వ వైఫల్యాలే గెలిపిస్తాయన్న ఆశాభావం
- ఓటింగ్ శాతం పెంచుకోవడంపై బీజేపీ దృష్టి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై భారం..
- బండి సంజయ్ ప్రచారంతో ఉత్సాహం

నేడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్



పోలింగ్ సమయంలో పర్యవేక్షణకు ఈసీ అధికారులు సిద్ధం చేసిన డ్రోన్లు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. పోటీలో ఉన్న మూడు ప్రధాన పార్టీలకూ ప్రతిష్ఠాత్మకంగా మారింది. దీంతో గత కొద్దిరోజులుగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల యంత్రాంగాలు మొత్తం ఈ నియోజకవర్గంలోనే మోహరించి ప్రచారం చేశాయి. రాజకీయంగా, ఆర్థికంగా తమ శక్తియుక్తులన్నీ ఖర్చు చేసి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేశాయి. ఇప్పుడిక ఓటర్ల వంతు వచ్చింది. మంగళవారం జరగనున్న పోలింగ్‌లో ప్రధాన పార్టీలు, ఆ పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థుల భవితవ్యాన్ని

మిగతా 12వ పేజీలో...

అడుగడుగునా పోలీస్ బందోబస్తు

- 800 సీసీటీవీ కెమెరాలు.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం
- తొలిసారి డ్రోన్లతో పర్యవేక్షణ

80% మంది ఓటర్లకు డబ్బు పంపిణీ

- అందులో సగం మందైనా ఓటేస్తారని రెండు ప్రధాన పార్టీల వ్యూహం

లక్ష చీరలు పంచుతున్నారు!

- సీఈవోకు హరీశ్ రావు ఫిర్యాదు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ హరీశ్‌పై ఈసీకి టీపీసీసీ ఫిర్యాదు 12

జూబ్లీహిల్స్ మనదే!

- ఓటింగ్ శాతం పెరిగేలా చూడండి
- మంత్రులతో సీఎం రేవంత్



బిహార్‌లోని మోతిహారిలో ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న సిబ్బంది

బిహార్‌లో నేడే తుదిపోరు

- 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్
- 3.7 కోట్ల మంది ఓటర్ల చేతిలో 1,302 మంది అభ్యర్థుల భవిత
- 1.75 కోట్ల మంది మహిళా ఓటర్లు
- నవయువ ఓటర్లు 7.69 లక్షలు
- బరిలో పలువురు మంత్రులు
- ఈ నెల 14న ఓట్ల లెక్కింపు
- ఫలితాల వెల్లడి

పట్నా, నవంబరు 10: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకానికి చేరాయి. రెండోది, చివరి విడత ఎన్నికల్లో 122 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది. వివిధ ప్రధాన పార్టీల నేతలు సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.75 కోట్ల మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని ఈవీఎంలతో నిక్షిప్తం చేయనున్నారు. వీరిలో 1.75 కోట్ల మంది మహిళలే. 18-19 ఏళ్ల వయసుగల నవయువ

మిగతా 10వ పేజీలో...



వరుస రోడ్డు ప్రమాదాలు.. అసమర్థతకు పరాకాష్ఠ

- టోల్ వసూలు దేనికి?.. ప్రజల ప్రాణాలు తీయడానికా?
- అనధికార దాబాల వద్ద పార్కింగ్‌తో ప్రమాదాలు.. సుప్రీం ఆగ్రహం
- తెలంగాణ, రాజస్థాన్‌లో జరిగిన ప్రమాదాలపై సుమోటో విచారణ
- ఆ 2 రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఎన్‌హెచ్ఏఐ, కేంద్రానికి నోటీసులు
- రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం 2



స్పీకర్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోండి

- ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణలో కావాలనే తాత్సారం
- సుప్రీంకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేస్తున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోర్టు ధిక్కరణ పిటిషన్ 3
- పది మందిని అనర్హులుగా ప్రకటించాలంటూ రిట్ పిటిషన్
- అత్యవసర విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- నేను రిటైరైతే సుప్రీంకోర్టు బంద్ కాదు కదా?: సీజేఐ



వణికిస్తున్న చలిపులి

- ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో గజగజ
- ఆదిలాబాద్ జిల్లా లోకారిలో అత్యల్పంగా 10.4 డిగ్రీలు నమోదు 14
- ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 10.9 డిగ్రీలు

పేలుడు ఘటనపై మోదీ ఆరా

» పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమీక్ష

న్యూఢిల్లీ, నవంబరు 10: ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోదీ పోస్ట్ పెట్టారు. ఘటనలో మృతిచెందినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హోంమంత్రి షాతో పాటు ఇతర అధికారులతోనూ మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు మోదీ ఎక్స్‌లో తెలిపారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి ఢిల్లీ క్రైం బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ చేరుకున్నాయని చెప్పారు. ఘటనపై ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, ఫోరెన్సిక్ బృందాలు లోతుగా దర్యాప్తు చేస్తున్నాయన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. మంగళవారం ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహిస్తామన్నారు. మరోవైపు పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా పేలుడు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. పుకార్లను నమ్మవద్దని రేఖాగుప్త ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పేలుడు ఘటనలో మరణాలు బాధాకరమంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, కేరళ సీఎం విజయన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తదితరులు పేలుడు ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఢిల్లీలో గతంలో పలు ఉగ్రదాడులు

న్యూఢిల్లీ, నవంబరు 10: దేశ రాజధాని ఢిల్లీలో గతంలోనూ పలుచోట్ల ఉగ్ర దాడులు, బాంబు పేలుళ్లు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. నగరంలోని ప్రసిద్ధ మార్కెట్లు, పబ్లిక్ ప్రదేశాల్లో ఈ పేలుళ్లు చోటు చేసుకున్నాయి. 1996 సంవత్సరం వేసవి కాలంలో అత్యంత రద్దీగా ఉండే లజ్‌పత్ నగర్ మార్కెట్‌లో చోటు చేసుకున్న బాంబు పేలుడులో 13 మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తర్వాతి ఏడాదే సదర్ బజార్, కరోల్ బాగ్, రాణి బాగ్, చాందిని చౌక్‌లలో బాంబు పేలుళ్లు చోటు చేసుకున్నాయి. పంజాబీ బాగ్‌లో బస్సులో పేలుడు సంభవించింది. 2000 సంవత్సరం డిసెంబరులో ఒక ఉగ్రమూక ఎర్రకోట లోపల కాల్పులు జరపగా ఇద్దరు మృతి చెందారు. ఆ తర్వాత 2001 డిసెంబరులోనే పార్లమెంటుపై దాడి జరిగి 9 మంది ప్రాణాలు కోల్పోయారు. 2005లో దీపావళికి రెండు రోజుల ముందు పహర్‌గంజ్, సరోజిని నగర్, గోవింద్‌పురిలో డీటీసీ బస్సులో జరిగిన వరుస పేలుళ్లలో 67 మంది ప్రాణాలు కోల్పోగా 200 మందికి పైగా గాయపడ్డారు. ఆ తర్వాత మూడేళ్లకు అంటే 2008లో కనాట్ ప్లేస్, కరోల్ బాగ్, గ్రేటర్ కైలాష్‌లలో ఐదు చోట్ల ఒకేసారి జరిగిన పేలుళ్లలో 20 మంది ప్రాణాలు కోల్పోగా డజన్ల మంది గాయపడ్డారు. తర్వాత 2011లో ఢిల్లీ హైకోర్టు బయట బ్రీఫ్‌కేస్‌లో పెట్టిన బాంబు పేలి 15 మంది మరణించగా.. 79 మంది గాయపడ్డారు.

సామూహిక విష ప్రయోగానికి కుట్ర!?

» దేశంలో వేలాదిమందిని చంపడానికి మొహియుద్దీన్ ప్లాన్

» రిసిన్‌ను మంచినీళ్లు, ప్రసాదాల్లో కలిపేందుకు పావులు

» ప్రపంచంలోనే అతి పెద్ద విష ప్రయోగానికి ప్రణాళికలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన హైదరాబాదీ డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ సామూహిక విష ప్రయోగానికి ప్రణాళిక రచించినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించినట్లు తెలిసింది. రాజేంద్ర నగర్ సర్కిల్ ఫోర్ట్‌వ్యూ కాలనీలో నివాసం ఉంటున్న మొహియుద్దీన్.. చైనాలో ఎంబీబీఎస్ చదివాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేస్తూనే ఉగ్రవాదులతో పరిచయం పెంచుకున్నాడు. పాకిస్థానీ హ్యాండ్లర్ల నుంచి అందిన ఆదేశాల మేరకు దేశంలో ప్రాణాంతకమైన రిసిన్ కెమికల్ (అత్యంత విషపూరితమైనది)తో దాడులు చేసేందుకు పథకం రచించినట్లు తెలిసింది. రిసిన్‌ను ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన జీవ విషాల్లో ఒకటిగా నిపుణులు చెబుతున్నారు. రుచి, వాసన లేకపోవడం దీని ప్రత్యేకత. గ్లాసు నీటిలో కలిపి ఇస్తే ఎవరూ అనుమానించలేరని నిపుణులు చెబుతున్నారని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. సులభంగా దొరికే ఆముదం గింజల నుంచి దీనిని తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దేశంలోని ప్రధాన నగరాల్లో మంచినీళ్లు, గుడి ప్రసాదాల్లో ఈ విషాన్ని కలిపి, ప్రపంచంలోనే అతి పెద్ద సామూహిక విష ప్రయోగానికి పాల్పడి వేలాదిమంది మృత్యువాత పడేలా ప్రణాళికలు తయారు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

భారత్ సహకారంతో మాల్దీవుల్లో ఎయిర్‌పోర్టు

» ప్రారంభించిన ముయిజ్జు.. పాల్గొన్న రామ్మోహన్ నాయుడు

మాలే, నవంబరు 10: భారత్ అందించిన ఆర్థిక సహకారంతో మాల్దీవుల్లో హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయింది. దీన్ని ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ఆదివారం భారత పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముయిజ్జు మాట్లాడుతూ ప్రపంచంతో ఉత్తర మాల్దీవులను మరింత అనుసంధానించే మార్గంగా, మాల్దీవుల అభివృద్ధి, శ్రేయస్సుకు గేట్‌వేగా ఈ ఎయిర్‌పోర్టు పనిచేస్తుందన్నారు. భారత్, మాల్దీవుల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. ఈ విమానాశ్రయం రెండు దేశాల బలమైన సంబంధాలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ విమానాశ్రయం 'పొరుగు దేశాలే ముందు, మహాసాగర్ విజన్' విషయాల్లో భారత్ కట్టుబాటుకు నిదర్శనమని మాల్దీవులలోని భారత హైకమిషన్ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. హనిమాధూ విమానాశ్రయం అభివృద్ధికి భారత్‌కు చెందిన ఎగ్జిమ్ బ్యాంక్ సుమారు రూ.7 వేల కోట్లు రుణ సహకారం అందించింది.

సిద్దరామయ్యకు అధిష్ఠానం షాక్?

» అపాయింట్‌మెంట్ నిరాకరణ

బెంగళూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానం సీఎం సిద్దరామయ్యకు అపాయింట్‌మెంట్ నిరాకరించింది. రాష్ట్రంలో రెండున్నరేళ్ల పాలన ముగుస్తున్న తరుణంలోనే ఆయనకు షాక్ ఇచ్చినట్టు తెలుస్తోంది. నవంబరులో సీఎం మార్పు అంశం రాష్ట్ర రాజకీయాల్లో దాదాపు నెలరోజులుగా హల్‌చల్ చేస్తోంది. బిహార్ ఎన్నికల ఫలితాలు ఈ నెల 14న వెలువడతాయని, అదే రోజు ఢిల్లీ వెళతానని సీఎం సిద్దరామయ్య ఇటీవల ప్రకటించారు. కనీసం రెండుమూడు రోజులు అక్కడే ఉండి మంత్రివర్గ మార్పుపై స్పష్టమైన నిర్ణయంతో వస్తానని తెలిపారు. బిహార్‌లో రెండో విడత ఎన్నికలు మంగళవారం జరుగనున్నాయి. ఫలితాలు వెలువడేందుకు మరో నాలుగురోజులు మాత్రమే గడువు ఉండటంతో అధిష్ఠానం పెద్దలతో చర్చించేందుకు సిద్దరామయ్య అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినట్టు తెలుస్తోంది. దీనికి హైకమాండ్ ఒప్పుకోలేదని సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో కర్ణాటకకు చెందిన ఏ నాయకులనూ కలవబోమని తేల్చి చెప్పినట్టు తెలిసింది.

కొట్టివేసిన నిబంధనలతో కొత్త చట్టం తెస్తారా?

» కేంద్రానికి సుప్రీం ప్రశ్న.. ట్రైబ్యునళ్ల చట్టంపై విచారణ

న్యూఢిల్లీ, నవంబరు 10: న్యాయస్థానాలు కొట్టివేసిన నిబంధనలతో కొత్త చట్టం ఎలా తీసుకొస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏవో చిన్న చిన్న మార్పులు చేసి, తీర్పును ఏ మాత్రం పట్టించుకోకుండా పాత నిబంధనలతోనే కొత్త చట్టాన్ని రూపొందించడం ఏమిటని అడిగింది. ట్రైబ్యునళ్ల సంస్కరణలు, హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల చట్టం-2021ని సవాలు చేస్తూ మద్రాసు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ప్రశ్నలు వేసింది. స్వల్ప మార్పులతో పాత చట్టాన్నే తిరిగి ఎలా ఆమోదిస్తారన్నదే అసలు ప్రశ్న అని తెలిపింది. పార్లమెంటుకు చట్టాలు చేసే అధికారం ఉందని, కానీ న్యాయవ్యవస్థ లేవనెత్తిన సమస్యలను పరిష్కరించకుండా చట్టాలు చేయకూడదని పేర్కొంది.

ఢిల్లీలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)


పేలుడు ధాటికి కాలిపోతున్న పలు వాహనాలు

వెళ్లింది. వెంటనే ఏడు యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది 20 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు రంగంలోకి దిగి.. 7.29 గంటలకల్లా.. అంటే పేలుడు జరిగిన 40 నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పేలుడుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చా వెల్లడించారు. "సాయంత్రం 6.52 గంటలకు.. రెడ్‌ఫోర్ట్ మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో నిదానంగా వచ్చిన ఒక కారు అక్కడ ఆగీ ఆగగానే పేలిపోయింది. ఆ సమయంలో ఆ కారులో ప్రయాణికులున్నారు. పేలుడు ధాటికి దాని చుట్టుపక్కలున్న వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని ఆయన తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలతోపాటు.. జాతీయ దర్యాప్తు సంస్థ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, సీఆర్పీఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు ఏజెన్సీల అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తెలుపుతున్నట్లు వెల్లడించారు. పేలిపోయిన కారులో ముగ్గురు ఉన్నట్లు మరో సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. "పేలుడు జరిగిన చోట ఎలాంటి గుంతా పడలేదు. పేలుడు ధాటికి గాయపడ్డవారి శరీరాల్లో ఎలాంటి పెల్లెట్లూ కనిపించలేదు. బాంబు పేలుడు అయితే ఇలా జరగడం అసాధారణం. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. అందులో భాగంగా.. ఆ కారు ఏయే ప్రాంతాల్లో తిరిగిందో తెలుసుకోవడానికి నగరంలోని అన్ని సీసీటీవీ కెమెరాలనూ జల్లెడపడుతున్నారు. పేలుడుకు ముందు ఏదైనా అనుమానాస్పదంగా కనిపించిందా? అని స్థానికులను, ప్రత్యక్షసాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో పేలుడుకు ముందు నమోదైన ఫోన్‌కాల్స్ డేటాను విశ్లేషిస్తున్నారు.


పేలుడు తీవ్రతకు ఎగిరి దూరంగా పడ్డ ఓ వ్యక్తి మృతదేహం

కారెవరిది?

హరియాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న హ్యూండాయ్ ఐ20 కారులో పేలుడు జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ కారు నదీం అనే వ్యక్తి పేరిట ఉన్నట్టు సమాచారం. కారు యజమానిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి ఈ కారును ఏడాదిన్నర క్రితం సలీం అనే వ్యక్తి- దేవేంద్ర అనే వ్యక్తికి విక్రయించాడని సమాచారం. గురుగ్రామ్ పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవేంద్ర ఆ తర్వాత ఆ కారును హరియాణాలోని అంబాలకు చెందిన వ్యక్తికి అమ్మినట్టు తెలిసింది.

భయంతో పరుగులు..

"అంత పెద్ద భారీ పేలుడు శబ్దాన్ని మా జీవితంలో ఎప్పుడూ వినలేదు" అని ఘటనాస్థలికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు పలువురు తెలిపారు. "పేలుడు జరిగిన సమయంలో నేను నా దుకాణంలో ఉన్నాను. పేలుడు ధాటికి నా కుర్చీలోంచి కింద పడిపోయాను. వెంటనే లేచి బయటకు పరుగెత్తాను. చాలామంది ఆ సమయంలో తలోదిక్కుకూ పరుగులు తీయడం కనిపించింది" అని అక్కడి ఒక దుకాణదారు చెప్పారు. "నేను మా ఇంటి టెర్రస్ మీద ఉండగా.. పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. చూస్తే దూరంగా అగ్ని జ్వాలలు. పేలుడు ధాటికి భవనాల కిటికీలు కదిలిపోయాయి" అని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు. పేలుడు ఘటనతో ఢిల్లీని అనుకుని ఉన్న యూపీ జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మతపరంగా, ఇతరత్రా సున్నితమైన ప్రార్థన మందిరాలు, ఢిల్లీ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు.

మా వాళ్లని చూడనివ్వట్లేదు..

ఈ పేలుడులో గాయపడ్డవారి కుటుంబసభ్యులు, బంధువులు.. విషయం తెలియగానే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి చేరుకుని తమవారి కోసం ఆందోళనతో ఆరా తీశారు. గాయపడ్డ తమవారిని చూడ్డానికి ఆస్పత్రి సిబ్బంది తమను అనుమతించట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పేలిన కారు కదలికల కోసం సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. ఆ కారు దరియాగంజ్ మార్కెట్ నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటల సమయానికి సునెహ్రీ మసీదు పార్కింగ్ ఏరియా వద్దకు చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం ఆ కారు మళ్లీ ఛత్తా రైల్‌చౌక్ వద్ద యూటర్న్ తీసుకుని.. లోయర్ సుభాష్ మార్గ్ దిశగా వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. అక్కడ ఆ కారు సిగ్నల్ వద్దకు చేరుకుంటూ నెమ్మదించిందని.. అప్పుడు పేలుడు జరిగిందని ఓ అధికారి తెలిపారు. పేలుడు దెబ్బకు కారులో ఉన్న ముగ్గురూ ఛిద్రమైపోయారని తెలిపారు.


ఘటనా స్థలంలో అమిత్ షా

పేలుడుకు కారణం ఇప్పుడే చెప్పలేం..

పేలుడు ఘటనపై కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్‌తో, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఐఏ చీఫ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేలుడుకు కారణం ఏంటి అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. అనంతరం ఆయన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అక్కణ్నుంచీ నేరుగా ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇక.. సోమవారం రాత్రి 12 గంటల సమయానికి.. మృతుల్లో.. అశోక్, అమర్ అనే ఇద్దరిని మాత్రమే పోలీసులు గుర్తించారు. మిగతా మృతదేహాలు ఎవరివో ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ పేలుడు తమ పనేనని ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించలేదు.

లోకం తీరు



హైదరాబాద్‌లో హై అలర్ట్

హైదరాబాద్ సిటీ, శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో భారీ పేలుళ్లు జరగడంతో కేంద్ర హోం శాఖ ఢిల్లీతోపాటు ముంబై, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్‌ల్లో హైఅలర్ట్ ప్రకటించింది. దాంతో, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాలతో పాతబస్తీతోపాటు నగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఇతర బస్టాండ్లు, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లలో సోదాలు నిర్వహించారు. ఆర్పీఎఫ్ పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఎప్పుడు ఉగ్రవాద కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా.. ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టయినా హైదరాబాద్‌తో వారికి లింకు ఉంటోంది. ఆదివారం గుజరాత్‌లో ఏటీఎస్ పోలీసులు ముగ్గురు ఉగ్రవాదులను అరెస్టు చేయగా.. వారిలో ఒకరు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ అని తేలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, హైదరాబాద్ నగరంలోనూ హై అలర్ట్ ప్రకటించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

శంషాబాద్ ఎయిర్ పోర్టులో తనిఖీలు

ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు ఎయిర్ పోర్టులోకి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ప్రవేశ పాసులను రద్దు చేశారు.

వైట్‌కాలర్ ఉగ్రభూతం

మూడు రాష్ట్రాల్లో 8 మంది టెర్రరిస్టుల అరెస్టు

» వీరిలో ముగ్గురు వైద్యులు, వారిలో ఒకరు మహిళా డాక్టర్

» 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం


ఫరీదాబాద్‌లో పోలీసుల తనిఖీలు

శ్రీనగర్/ఫరీదాబాద్, నవంబరు 10: అత్యంత ప్రమాదకరంగా దేశంలో కొత్త రూపంలో వేళ్లూనుకుంటున్న వైట్ కాలర్ ఉగ్రవాదానికి కేంద్ర నిఘా, దర్యాప్తు సంస్థలతో కలిసి జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్ పోలీసులు చెక్ పెట్టారు. దేశ చరిత్రలోనే అత్యంత భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 15 రోజుల పాటు అత్యంత పకడ్బందీగా నిర్వహించిన ఆపరేషన్‌లో జైషే మహ్మద్, అన్సార్ ఘజవత్ ఉల్ హింద్ (ఏజీయూహెచ్) సంస్థలకు చెందిన 8 మంది ఉగ్రదులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు వైద్యులు ఉండటం, వారిలో ఒక మహిళ కూడా ఉండటం కలకలం రేపుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో అరెస్టు చేసిన డాక్టర్‌తో కలుపుకుంటే ఈ ఉగ్రనెట్‌వర్క్‌లో అరెస్టు అయిన వైద్యుల సంఖ్య నాలుగుకు పెరిగింది. అరెస్టయిన వారిలో ఏడుగురు జమ్మూకశ్మీర్‌కు చెందినవారే ఉన్నారు. వీరి నుంచి మొత్తం 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు సోమవారం వెల్లడించారు. ఇందులో అమోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ వంటి పదార్థాలు ఉన్నాయి. ఒక ఏకే 56, ఒక ఏకే క్రింకోవ్ తుపాకితో పాటు చైనీస్ స్టార్, బెరెట్టా పిస్తోళ్లు, బాంబుల తయారీలో ఉపయోగించే బ్యాటరీలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

పోస్టర్లపై కూపీ లాగితే..

జమ్మూకశ్మీర్ పోలీసుల కథనం ప్రకారం శ్రీనగర్‌లో అక్టోబర్ 19న జైషే మహ్మద్‌కు మద్దతుగా వెలసిన పోస్టర్లపై కూపీ లాగడంతో ఈ భారీ ఉగ్ర నెట్‌వర్క్ బట్టబయలైంది. ఈ పోస్టర్ల వెనుక జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన డాక్టర్ అదీల్ రాథర్, హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉంటున్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ముజమ్మిల్ గనయి ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 6న అదీల్‌ను అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారంతో ఆదివారం ముజమ్మిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఉంటున్న అదీల్‌ను, హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉంటున్న ముజమ్మిల్‌ను విమానంలో శ్రీనగర్‌కు తరలించారు. ముజమ్మిల్ అద్దెకు తీసుకున్న రెండు ఇళ్లలో కనిపించిన పేలుడు పదార్థాలు, ఆయుధాలు చూసి పోలీసులే నివ్వెరపోయారు. ముజమ్మిల్ వద్దనే ఏకంగా 360 కిలోల పేలుడు పదార్థాలు, ఏకే తుపాకీ లభించాయి. ముజమ్మిల్, అదీల్ ఫోన్లలో పాకిస్థాన్‌కు చెందిన నంబర్లను గుర్తించారు. ముజమ్మిల్‌కు ఇంటిని అద్దెకు ఇచ్చిన ఒక మౌలానాను కూడా సోమవారం అరెస్టు చేశారు.

అరెస్టయిన ఉగ్రవాదులు

ఉగ్రవాది పేరు	ప్రాంతం
అరిఫ్ నసార్ దార్ అలియాస్ సాహిల్	నౌగావ్, జమ్మూకశ్మీర్
యాసిర్ ఉల్ అష్రఫ్	నౌగావ్, జమ్మూకశ్మీర్
మఖ్సూద్ అహ్మద్ దార్ అలియాస్ షహీద్	నౌగావ్, జమ్మూకశ్మీర్
మహ్మద్ ఇర్ఫాన్ అహ్మద్	షోపియాన్, జమ్మూకశ్మీర్
జమీర్ అహ్మద్ అహంగర్	గందర్‌బల్, జమ్మూకశ్మీర్
డాక్టర్ ముజమ్మిల్ గనయి	పుల్వామా, జమ్మూకశ్మీర్
డాక్టర్ అదీల్	కుల్గామ్, జమ్మూకశ్మీర్
డాక్టర్ షహీన్	లఖ్‌నవూ, యూపీ

చారిటీల ముసుగులో ఉగ్ర ప్రచారం

దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై నిఘా పెరగటంతో పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్‌తోపాటు, భారత్‌లో ఐఎస్ఐఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థ ఏజీయూహెచ్‌లు కొత్త మార్గాలను అనుసరిస్తున్నట్లు ఈ కేసు తేటతెల్లం చేసింది. సమాజంలో మంచి పేరున్నవారు, ఉన్నత విద్యావంతులను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు తేలింది. అరెస్టయిన ఉగ్రవాదులు చారిటీలు, విద్యా సంస్థలకు నిధుల సేకరణ ముసుగులో ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నారని జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించారు. 'దేశంలో వైట్‌కాలర్ ఉగ్రవాద వ్యవస్థ క్రమంగా వేళ్లూనుకుంటున్నట్లు ఈ దర్యాప్తులో తేలింది. ఉగ్రవాదం వైపు ఆకర్షితులైన ప్రొఫెసర్లు, విద్యార్థులు పాకిస్థాన్, ఇత విదేశీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఏర్పరుచుకుంటున్నారు. ప్రొఫెషనల్, విద్యా సంస్థల ద్వారా నిధులు సమీకరిస్తున్నారు. ఉగ్రవాద సంస్థలకు ఆయుధాలు, ఐఈడీ బాంబులు తయారు చేసే పేలుడు పదార్థాలు, ఇతర మౌలిక వసతులు సమకూరుస్తున్నారు' అని పోలీసులు వెల్లడించారు.

అరెస్టయిన ఉగ్ర డాక్టర్లు

డాక్టర్ అదీల్ రాథర్: ఇతడి స్వస్థలం జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజీగుండ్. అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గత ఏడాది అక్టోబర్ 24 వరకు ఇతడు రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేశాడు. ఇతడికి జైషే మహ్మద్‌తో పాటు ఏజీయూహెచ్‌తోనూ సంబంధాలున్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఈ నెల 6న అతన్ని అరెస్టు చేశారు.

డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి: ఇతడు కూడా జమ్మూకశ్మీర్‌కు చెందినవాడే. హర్యానాలోని ధౌజ్‌లో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ అక్కడే రెండు వేర్వేరు ఇళ్లను అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఇతడి వద్దనే బాంబుల తయారీకి ఉపయోగించే సామగ్రి భారీ మొత్తంలో పట్టుబడింది. రాథర్ ఇచ్చిన సమాచారంతో ఇతడిని ఆదివారం అరెస్టు చేశారు. శ్రీనగర్‌లో జైషే మహ్మద్ పోస్టర్లు వేయటంతో ఇతడి హస్తం కూడా ఉంది.

మహిళా డాక్టర్: అల్ ఫలాహ్ యూనివర్సిటీలోనే పనిచేస్తున్న మరో మహిళా డాక్టర్‌ను కూడా ఈ నెల 7న అరెస్టు చేశారు. ఆమె కారులో ఒక కారన్ అసాల్ట్ రైఫిల్ లభించటం గమనార్హం. ఆమె పేరు ఇతర వివరాలను పోలీసులు బయట పెట్టలేదు.

డాక్టర్ అహ్మద్ సయేద్ మొహియుద్దీన్: హైదరాబాద్‌కు చెందిన ఈ డాక్టర్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు ఇంట్లో సొంతంగానే రెసిన్ అనే విషపదార్థం తయారుచేస్తున్నట్లు గుర్తించారు.

ధర్మేంద్ర ఆరోగ్యం కోసం ప్రార్థించండి

» అభిమానులకు హేమమాలిని వినతి



ముంబై, నవంబరు 10: అలనాటి సినీహీరో ధర్మేంద్ర (89) అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజులుగా ముంబయిలోని బ్రీచ్ కాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆయన కోలుకోవాలంటూ ప్రార్థించాలని ప్రముఖ నటి, భార్య హేమమాలిని అభిమానులను కోరారు. సోమవారం ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ధరంజీ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఆయన ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. వైద్యులు నిరంతరం ఆయనను గమనిస్తున్నారు. మేమంతా ఆయన పక్కనే ఉన్నాం. ఆయన సత్వరమే కోలుకోవాలని, సుఖంగా ఉండాలంటూ ప్రార్థించాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు. ధర్మేంద్ర పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతానికయితే నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయన వెంటిలేటర్‌పై ఏమీ లేరని పేర్కొన్నాయి. క్రమేణా కోలుకుంటున్నారని తెలిపాయి.

వరుస రోడ్డు ప్రమాదాలు అసమర్థతకు పరాకాష్ఠ

» వ్యవస్థ వైఫల్యం కాదా?

» టోల్ వసూలు దేనికి? ప్రజల ప్రాణాలు తీయడానికా?

» సుప్రీంకోర్టు ఆగ్రహం

» తెలంగాణ, రాజస్థాన్‌ల్లో జరిగిన ప్రమాదాలపై సుమోటో విచారణ

న్యూఢిల్లీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి వ్యవస్థలోని వైఫల్యాలకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించింది. టోల్ వసూలు దేనికి, ప్రజల ప్రాణాలు తీయడానికా? అంటూ అసహనం వ్యక్తం చేసింది. ప్రమాదాలపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ), కేంద్రంతో పాటు తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ, రాజస్థాన్‌లలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రోడ్ల నిర్వహణపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. నిర్వహణ లోపంతో రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. రెండు ప్రమాదాల్లో నలభై మంది చనిపోయారు. ఇది ముమ్మాటికీ అసమర్థకు పరాకాష్ఠ కాకపోతే మరేమిటి? ఇది సహించరాని, భరించలేని దారుణం' అని వ్యాఖ్యానించింది. తెలంగాణలో నవంబర్ 3న హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -163)పై 20 మంది మరణించిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. 'పత్రికల కథనాల ప్రకారం హైవేపై ఉన్న ఓ పెద్ద గుంతను తప్పించే ప్రయత్నంలోనే లారీ అదుపు తప్పి బస్సును ఢీకొట్టింది. ఇది వ్యవస్థ వైఫల్యం కాదా?' అని ప్రశ్నించింది. ఆ జాతీయ రహదారికి సంబంధించిన భద్రతా ప్రమాణాలు, నిర్వహణ, కాంట్రాక్టర్ల పనితీరుపై తక్షణమే ఆరా తీయాలని ఆదేశించింది. రాజస్థాన్‌లోని ఫలోడి వద్ద 18 మంది మృతికి అక్రమ దాబాలే కారణమని ధర్మాసనం అభిప్రాయపడింది. 'జాతీయ రహదారుల పక్కన గుర్తింపులేని అక్రమ దాబాలు వెలుస్తున్నాయి. ట్రక్కులు ప్రమాదకర రీతిలో వాటి పక్కనే నిలిపివేస్తున్నారు. దీనివల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని ఎలా నియంత్రిస్తారు?' అని ప్రశ్నించింది. ఈ రెండు జాతీయ రహదారులు విస్తరించి ఉన్న అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. వాటి పరిధిలోని అక్రమ దాబాలు, రోడ్ల వాస్తవ పరిస్థితి, కాంట్రాక్టర్ల నిర్వహణ నిబంధనలపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించింది.



ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్

- 3 వేల మంది కూర్చునే వెయిటింగ్ హాల్
- 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, 2 ట్రావలేటర్లు సహా నేరుగా మెట్రోతో అనుసంధానించేలా వంతెనలు
- 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేస్తాం
- ఇది హైదరాబాద్‌కు మరో మణిహారం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అధునాతన సౌకర్యాలతో ఎయిర్‌పోర్టు తరహాలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మరో 18 నెలల్లో పునర్నిర్మాణ పనులు పూర్తవుతాయని, ప్రధాని మోదీ చేతుల మీదుగా స్టేషన్‌ను రూ.715కోట్లతో మొదట దశ పునర్నిర్మాణ పనులు రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులను సోమవారం కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం రైల్వే ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ప్రస్తుతం రోజూ 1.97 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో రైల్వే స్టేషన్‌ను రీ డిజైన్ చేశామని తెలిపారు. చేపట్టినట్టు తెలిపారు. హైదరాబాద్‌కు ఒక మణిహారంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నిలవనుందని పేర్కొన్నారు. 3 వేల మంది ప్రయాణికులు కూర్చునే విధంగా వెయిటింగ్ హాలు, క్యాంటీన్ స్టాళ్లు, 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, విమానాశ్రయాల్లో మాదిరిగా 2 ట్రావలేటర్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు. మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా రైల్వే స్టేషన్‌లోకి వచ్చి వెళ్లేలా, స్టేషన్ నుంచి బస్టాప్‌ల వరకు కాలినడక వంతెనలు నిర్మిస్తున్నామని వెల్లడించారు. పనులు పూర్తయితే రైల్వే స్టేషన్ నుంచి రోజూ 2.70 లక్షల మంది రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుందని, ప్రతీ గంటకు 32,500 మంది ప్రయాణికుల రద్దీని తట్టుకునేలా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జీఎం సంజయ్ కుమార్ , సికింద్రాబాద్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ నవీన్ కుమార్, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

8 గంటల డ్యూటీ తప్పనిసరి

- ఉత్పాదక వ్యయం తగ్గాలంటే కార్మికులు పూర్తి పనిగంటలు పనిచేయాలి: సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని ప్రతి కార్మికుడు తనకు కేటాయించిన షిఫ్ట్‌లో రోజుకు 8 గంటలు పనిచేయాలని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ సూచించారు. సోమవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గుర్తింపు కార్మిక సంఘం అయిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌తో జరిగిన 39వ నిర్మాణాత్మక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్పత్తి ఖర్చు తగ్గించాలంటే కార్మికుల పూర్తి పని గంటలు సద్వినియోగం చేస్తూ, యంత్రాలను పూర్తిగా వినియోగించాలని అన్నారు. రానున్న రోజుల్లో దేశంలోని 10 రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహించేలా విస్తరణ ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బొగ్గు రంగానికే పరిమితమైన సింగరేణిని 5 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సంస్థగా మార్చేందుకు సింగరేణి గ్రీన్ ఎనర్జీతోపాటు కీలక ఖనిజ అన్వేషణ, మైనింగ్ కోసం సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగులకు విశాలమైన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లకు పైగా వెచ్చించి, గోదావరిఖని, శ్రీరాంపూర్, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లో 1,000 క్వార్టర్ల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే అత్యాధునిక వైద్య సేవలు అందించడానికి గోదావరిఖనిలో వచ్చే రెండు నెలల్లో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, కార్మికులకు సొంత ఇంటి పథకాన్ని రూపొందించాలని, కొత్తగూడెంలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు.

దేవాదుల నిర్మాణ అంచనా వ్యయం మళ్లీ సవరణ

- రూ.18,400 కోట్లకు ఎస్ఎల్ఎస్‌సీ ఆమోదం
- ఈనెల 13న గట్టు నల సోమనాద్రి రిజర్వాయర్ పరిశీలన

హైదరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు సాగునీటిని అందించడానికి ఉద్దేశించిన జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్మాణ అంచనా వ్యయాన్ని మూడోసారి సవరించడానికి రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ(ఎస్ఎల్ఎస్‌సీ) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ అంచనా తొలుత రూ.6016 కోట్లకు, రెండోసారి రూ.13,445.44 కోట్లకు తాజాగా రూ.18,400 కోట్లకు సవరించడానికి అంగీకారం తెలిపింది. నీటి పారుదలశాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో జరిగిన ఎస్ఎల్ఎస్‌సీ సమావేశంలో దేవాదుల ఎత్తిపోతల పథకంపై చర్చించారు. 38.16 టీఎంసీల నీటిని తరలించి 3దశల్లో 6.14 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో 58వేల ఎకరాలను స్థిరీకరించడానికి వీలుగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. తాజాగా ఈ ప్రాజెక్టును 2027 డిసెంబరు 31వ తేదీకల్లా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టిన గట్టు నల సోమనాద్రి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.32 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనలపై కూడా కమిటీ చర్చించింది. ఈనెల 13న రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ రిజర్వాయర్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, అనుమానాలను నివృత్తి చేసుకోనుంది. క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరమే దీన్ని ఆమోదించాలని కమిటీ నిర్ణయించింది.

'కామినేని' ఆసుపత్రికి రూ.1 కోటి జరిమానా

- 2018లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రిలో బాలింత మృతి
- వినియోగదారుల ఫోరంను ఆశ్రయించిన బంధువులు
- కోటి జరిమానా విధిస్తూ ఫోరం తీర్పు

నల్లగొండ క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో బాలింత మృతిచెందిన ఘటనలో బాధిత కుటుంబానికి రూ.1 కోటి పరిహారం చెల్లించాలని నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రి యాజమాన్యాన్ని నల్లగొండ జిల్లా వినియోగదారుల ఫోరం ఆదేశించింది. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన స్వాతిని ప్రసూతి నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులు 2018 సంవత్సరం జూలై 13న నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రిలో చేర్పించారు. అదే రోజు రాత్రి 10గంటల సమయంలో వైద్యులు శస్త్రచికిత్స చేసి డెలివరీ చేయడంతో బాబు జన్మించాడు. 14వ తేదీ వరకు ఆమెకు మెలకువ రాకపోవటంతో కుటుంబ సభ్యులు వైద్యుడిని నిలదీశారు. శస్త్రచికిత్సకు ముందు మత్తు మందు ఇచ్చామని, డోస్ సరిపోకపోవడంతో రెండోసారి మత్తు మందు ఇవ్వటంతో మెలకువ రాలేదని చెప్పారు. అనంతరం ఆమెకు అధికంగా రక్తస్రావం కావటంతో ఐసీయూకు తరలించగా, పరిస్థితి విషమించి మృతిచెందారు. 'కామినేని' వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఉమ్మడి నల్లగొండ జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేశారు. విచారణ చేసిన ఫోరం బాధిత కుటుంబానికి రూ.1 కోటి పరిహారం చెల్లించాలని, నెల రోజుల్లో డబ్బులు చెల్లించకపోతే 9% వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. బాధితుల తరపున న్యాయవాది మేరెడ్డి నర్సింహారెడ్డి కేసును వాదించారు.

స్పీకర్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోండి

ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణలో కావాలనే తాత్సారం చేస్తున్నారు.. 100 రోజులైనా చర్యల్లేవు

- సుప్రీంకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేస్తున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కోర్టు ధిక్కరణ పిటిషన్
- పది మందిని అనర్హులుగా ప్రకటించాలంటూ రిట్ పిటిషన్
- అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ
- నేను రిటైరైతే కోర్టు బంద్ కాదు కదా?: సీజేఐ

న్యూఢిల్లీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 10 మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు అంశంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారని, ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో జూలై 31న సీజేఐ ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ కార్యాలయం అమలు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద్, కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్ సహా ఇతరులు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల అమలులో జాప్యం చేసినందుకు స్పీకర్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలోనూ ఒక్క అడుగు ముందుకు వేయలేదని తెలిపారు. 100 రోజులు గడిచినప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడం సుప్రీంకోర్టు తీర్పును నిర్లక్ష్యం చేయడమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, స్పీకర్ కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు ఆ పదిమంది ఎమ్మెల్యేలను సుప్రీంకోర్టే అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ నేతల కోర్టు ధిక్కరణ, రిట్ పిటిషన్ల గురించి మోహిత్‌రావు సోమవారం సీజేఐ ధర్మాసనం ఎదుట ప్రస్తావించారు. ఈ పిటిషన్లపై అత్యవసరంగా విచారణ జరపాలని జస్టిస్ బీఆర్ గవాయ్ దృష్టికి తీసుకెళ్లారు. 'సాధ్యమైనంత త్వరగా లేక మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. ఎమ్మెల్యేలు విచారణను ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, తీవ్రంగా పరిగణించాలని స్పీకర్‌కు సూచించింది. కానీ, ఈ వ్యవహారంలో స్పీకర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆ పది మంది ఇప్పటికీ ఎమ్మెల్యేలుగా కొనసాగుతూనే ఉన్నారు. ఫిరాయింపు అంశంలో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న దానం నాగేందర్, కడియం శ్రీహరిల విషయంలోనూ స్పీకర్ స్పందించలేదు. ఇది ఉద్దేశపూర్వంగా చేస్తున్న ఆలస్యమే' అని మోహిత్‌రావు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

సుప్రీంకోర్టేమీ బంద్ కాదు కదా?

సీజేఐ ఈ నెల 24న పదవీ విరమణ చేస్తున్నందున అప్పటి వరకు ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశం విచారణకు రాకుండా ఉద్దేశపూర్వకంగానే తాత్సారం చేస్తున్నారని మోహిత్‌రావు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా, సీజేఐ అసహనం వ్యక్తం చేశారు. 'నేను రిటైర్డ్ అయితే ఏంటి? ఈ నెల 24 తర్వాత సుప్రీంకోర్టేమీ బంద్ కాదు కదా?' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. అత్యవసర విచారణకు నిరాకరించారు. రెండు పిటిషన్లపై వచ్చేవారం విచారణ చేపడతామని స్పష్టం చేశారు. మరోవైపు ఎమ్మెల్యేల ఫిరాయింపు ఆరోపణలపై విచారణకు మరో 8 వారాల సమయం ఇవ్వాలని స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. 'నలుగురు ఎమ్మెల్యేల విచారణ పూర్తయింది. నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరో నలుగురి విచారణ చివరి దశకు చేరింది. ఇద్దరి విచారణ ప్రారంభమైంది. అంతర్జాతీయ సదస్సులు, విదేశీ పర్యటనలు.. వంటి కార్యక్రమాలతో స్పీకర్ తీరిక లేకుండా ఉన్నందున సుప్రీంకోర్టు విధించిన గడువులోగా విచారించడం సాధ్యం కాలేదు. ఎమ్మెల్యేలు సైతం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, అకాల వర్షాలు తదితర కారణాలతో నియోజకవర్గాల్లోనే ఉండాల్సి వస్తోంది. స్పీకర్ షెడ్యూల్, ఎమ్మెల్యేల కార్యక్రమాల నేపథ్యంలో సమయం సరిపోలేదు' అని స్పీకర్ కార్యాలయం అక్టోబరు 31న అప్లికేషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై ఈ నెల 14న విచారణ జరగనుంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ దాఖలు చేసిన రెండు పిటిషన్లపైనా అదే రోజు విచారణ జరిగే అవకాశం ఉంది.



రోడ్డు పక్కన బోల్తా పడిన లారీ నుంచి ఉల్లిగడ్డలను తీసుకెళ్తున్న స్థానికులు

ఉల్లి లారీ బోల్తా.. బస్తాలు ఎత్తుకెళ్లిన స్థానికులు!

- పాఠశాల బస్సును తప్పించే క్రమంలో ఘటన
- విద్యార్థులకు తప్పిన ప్రమాదం.. నల్లగొండ జిల్లా లో ఘటన

నార్కట్‌పల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా అడ్డుగా వచ్చిన పాఠశాల బస్సును తప్పించే క్రమంలో ఉల్లిగడ్డల లోడు లారీ బోల్తా పడడంతో స్థానికులు కొన్ని బస్తాలను ఎత్తుకెళ్లిపోయారు. సోమవారం ఉదయం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం శివారులో ఈ ఘటన జరిగింది. మహారాష్ట్ర నుంచి 30 టన్నుల ఉల్లిగడ్డ లోడుతో ఓ లారీ ఏపీలోని కృష్ణాజిల్లా విజయవాడకు వెళ్తోంది. ఏపీలింగోటం శివారుకు చేరుకోగానే నార్కట్‌పల్లి శ్రీ విద్యాపీఠ్ పాఠశాలకు చెందిన బస్సు లారీని గమనించకుండా హైవేపై యూటర్న్ చేసుకుంటోంది. అప్రమత్తమైన లారీ డ్రైవర్ వెంటనే ఎడమ వైపు తిప్పడంతో అదుపుతప్పి హైవే కిందకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. బోల్తా పడిన లారీ నుంచి కొన్ని ఉల్లిగడ్డ బస్తాలను బాటసారులు లూటీ చేశారు. రోడ్డు కింద నుంచి రోడ్డుపైకి బస్తాలను మోసుకుని వచ్చి వాహనాల్లోకి వేసుకుని తరలించారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో స్కూలు బస్సులో 12 మంది విద్యార్థులు ఉండగా, ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

జమ్మికుంట ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- మధ్యాహ్న భోజనం తిని 26 మంది విద్యార్థులకు అస్వస్థత

జమ్మికుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని 26 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. ఈ పాఠశాలలో మొత్తం 140మంది విద్యార్థులకు గాను, సోమవారం 71మంది హాజరయ్యారు. రోజూలాగే మధ్యాహ్నం భోజనానికి వెళ్లిన వారికి.. పచ్చి పులుసు, కోడిగుడ్డు, అలసంద, ఆలుగడ్డ, టమాట కూరలతో సిబ్బంది భోజనం వడ్డించారు. తిన్న తర్వాత కొద్దిసేపటికే కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఉపాధ్యాయులు వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉందని, నాసిరకం కోడిగుడ్ల వల్లే ఫుడ్ పాయిజన్ అయ్యిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

రోజుకు రూ.5వేలు చెల్లించండి

- ఎస్‌బీఐకి కన్స్యూమర్ కోర్టు జరిమానా
- ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వనందుకు బాధితుడి ఫిర్యాదు

వరంగల్ చౌరస్తా, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణం చెల్లించిన తర్వాత బాధితుడికి ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వనందుకు కన్స్యూమర్ కోర్టు.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు జరిమానా విధించింది. పత్రాలు ఇచ్చేవరకు రోజుకు రూ.5వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. వరంగల్ నగరానికి చెందిన న్యాయవాది ఆర్. నాగేంద్రాచారి కథనం ప్రకారం వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన డి. మల్లేశం అనే వ్యక్తి తన ఆస్తిపత్రాలను తాకట్టు పెట్టి పోచమ్మ మైదాన్‌లోని ఎస్‌బీఐ బ్రాంచి నుంచి రుణం తీసుకున్నారు. రుణం తీరిపోయాక తన ఆస్తి పత్రాలను ఇవ్వాలని కోరడంతో అవి పోయాయని, తిరిగి ఇవ్వలేమని బ్యాంకు అధికారులు చెప్పారు. దీంతో బాధితుడు వరంగల్ కన్స్యూమర్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై ఈనెల 7న విచారణ జరిపిన కోర్టు ఎస్‌బీఐకి జరిమానా విధించింది. బాధితుడికి ఆస్తి పత్రాలు ఇచ్చే వరకు రోజుకు రూ.5వేల చొప్పున నష్టపరిహారంతో పాటు మానసిక వ్యథ కింద రూ.లక్ష, కోర్టు ఖర్చుల కింద మరో రూ.25 వేలు చెల్లించాలని బ్యాంకువారిని ఆదేశించింది.

'కేసీపీ ప్రాజెక్ట్స్'లో జీఎస్టీ సోదాలు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కేసీపీ ప్రాజెక్ట్స్ కార్యాలయంలో సోమవారం జీఎస్టీ అధికారులు సోదాలు నిర్వహించారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 5 బృందాలు ఈ తనిఖీలు చేపట్టాయి. జీఎస్టీ చెల్లింపుల్లో వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారని సమాచారం. సంస్థ దాఖలు చేసిన రిటర్నులు, పన్ను చెల్లింపు రశీదులు, ఇతర డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది.

ప్రైవేటులో వైద్య సేవలకు యూనిఫాం రేట్లపై కసరత్తు

- మార్గదర్శకాల రూపకల్పనపై సీఈఏ స్టేట్ కౌన్సిల్ భేటీ
- చట్టం అమలు, ప్రైవేటు ఆస్పత్రుల విధానాలపై చర్చ

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలకు ఒకే రకమైన రేట్ల (యూనిఫాం రేట్లు)కు సంబంధించి మార్గదర్శకాల రూపకల్పనపై కసరత్తు మొదలైంది. యూనిఫాం రేట్లపై అన్ని రాష్ట్రాలు మార్గదర్శకాలు రూపొందించి పంపాలని సుప్రీంకోర్టు కోరిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల క్రితం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ స్టేట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు (సీఈఏ) స్టేట్ కౌన్సిల్ తొలి సమావేశం సోమవారం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్, డీహెచ్ రవీంద్రనాయక్, మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితురాలిగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీతా సత్యనారాయణ పాల్గొన్నారు. రాష్ట్రంలో చట్టం అమలు, ప్రైవేటు ఆస్పత్రుల విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై చర్చించారు. ఐసీయూ, స్పెషాలిటీ సేవలు, మరణాల రేటు, బయోమెడికల్, ఫైర్‌సేఫ్టీ, రిజిస్ట్రేషన్, ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతులు వంటి అంశాలపై కౌన్సిల్ సమగ్రంగా చర్చించింది. తదుపరి సమావేశంలో ఈ అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలనుకుంటున్న ప్రభుత్వం.. చిన్న క్లినిక్‌లకు నిబంధనల నుంచి కొంత మినహాయింపు ఇవ్వాలనుకుంటోంది. 20 పడకలలోపున్న దవాఖానాలను ఈ యాక్ట్ నుంచి మినహాయింపుపై ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. బిహార్, హరియాణా, పంజాబ్, ఏపీలలో ఇలాంటి మినహాయింపులున్నాయి. సీఈఏ ప్రకారం అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు స్టాండర్డ్ ట్రీట్‌మెంట్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)ను తప్పనిసరి పాటించాలి. కానీ, మెజారిటీ ఆస్పత్రులు ఈ నిబంధనలను పాటించడం లేదు. రోగుల నుంచి భారీగా బిల్లుల వసూలుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. దీనిని నివారించేందుకే యూనిఫాం రేట్లపై మార్గదర్శకాలు రూపొందించి సుప్రీంకోర్టుకు పంపనున్నారు. అన్ని రాష్ట్రాల నుంచి అందిన వివరాలను సుప్రీంకోర్టు కేంద్రానికి పంపనుంది. అనంతరం కేంద్రం పకడ్బందీగా సీఈఏను అమలుపరచనుందని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఆర్ఎంపీ, పీఎంపీ, నకిలీ వైద్యుల వ్యవస్థపై కఠినంగా ఉండాల్సిందేనని మెడికల్ కౌన్సిల్ సమావేశంలో గట్టిగా ప్రస్తావించింది. కాగా యూనిఫాం రేట్ల అమలు సాధ్యంకాదని ప్రైవేటు కార్పొరేట్ ఆస్పత్రులు తేల్చి చెప్పినట్లు సమాచారం. సేవల నాణ్యత, వైద్యుల అనుభవం, ఇతర సౌకర్యాలను బట్టి అదనపు చార్జీలు విధించే వెసులుబాటు కల్పించాలని అవి కోరుతున్నాయి. ఈమేరకు 'ప్రామాణిక రేట్లు' ఉండేలా తమవైపు నుంచి మార్గదర్శకాలను సర్కారుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నాయి.

మంత్రిని అవుతాననుకోలేదు.. సీఎంకు థ్యాంక్స్!

- మైనార్టీ సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల మంత్రిగా అజారుద్దీన్ బాధ్యతల స్వీకరణ



అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంత్రిగా అజారుద్దీన్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. పది రోజుల క్రితం మంత్రిగా ప్రమాణం చేసిన ఆయన.. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో మైనార్టీ సంక్షేమం, ప్రభుత్వరంగ సంస్థల మంత్రిత్వ శాఖల బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు హాజరై ఆయన్ను ఆశీర్వదించారు. అనంతరం అజారుద్దీన్ మీడియాతో మాట్లాడారు. 'క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత కోచ్‌గా వెళ్దామని అనుకున్నా. కానీ రాజకీయాల్లో చేరాక జీవితం మలుపు తిరిగింది. మంత్రిని అవుతానని ఊహించలేదు. సీఎం రేవంత్ రెడ్డికి థ్యాంక్స్. అమ్మానాన్నల ఆశీర్వాదంతోనే ఈ ఉన్నత స్థానం సాధ్యమైంది. మైనార్టీల అభివృద్ధికి సంబంధించి చాలా ప్రణాళికలున్నాయి. అధికారులతో చర్చించాలి. మైనార్టీ వర్గాలు విద్యలో మరింత మెరుగైన స్థానంలో ఉండాలన్నది నా లక్ష్యం' అని వ్యాఖ్యానించారు. జిల్లాల్లో పర్యటించి క్షేత్ర స్థాయి సమస్యలు తెలుసుకుంటానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీఎం సలహాదారు షబ్బీర్ అలీ అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంట్లో పైలట్.. విమానంలో ప్రయాణికులు!

- గంటకుపైగా నిరీక్షణ.. సిబ్బందితో వాగ్వాదం
- మరో విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విమానంలో ప్రయాణికులంతా ఎక్కి కూర్చోగా.. పైలట్ మాత్రం ఎంచక్కా ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ ఉండిపోయాడు. గంటకుపైగా వేచి చూసినా పైలట్ రాకపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగింది. 6ఈ 6467 ఇండిగో విమానం 178 మంది ప్రయాణికులతో ఉదయం 6.45 గంటలకు మధురై బయలుదేరాల్సి ఉంది. ప్రయాణికులతోపాటు సిబ్బంది కూడా అందరూ విమానంలో రెడీగా ఉన్నారు. పైలట్ కోసం గంటకు పైగా వేచిచూసిన ప్రయాణికులు చివరకు విసుగెత్తి ఆందోళనకు దిగారు. సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎయిర్‌లైన్స్ అధికారులు మరో పైలట్‌ను రప్పించి విమానాన్ని పంపించారు. ఇదిలా ఉండగా.. ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి విశాఖపట్నం వెళ్లిన 6ఈ 618 ఇండిగో విమానం ఏడుగురు ప్రయాణికులను ఎక్కించుకోకుండానే వెళ్లిపోయింది. అధికారులు ఆ ఏడుగురిని మరో విమానంలో పంపేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా, లండన్ నుంచి 200మంది ప్రయాణికులతో సోమవారం తెల్లవారుజామున శంషాబాద్‌కు చేరుకున్న బీఏ 277 బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానంలో ఈ బాంబు ఉందంటూ ఆగంతకులు జీఎంఆర్ మెయిల్‌కు సందేశం పంపారు. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు.. విమానాన్ని తనిఖీ చేసి ఎలాంటి బాంబు లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆచరణకు సంకల్పం

వాతావరణ మార్పుపై మానవ పోరాటానికి ఉద్దేశించిన సభ్యదేశాల మహాసదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–కాప్) సోమవారం బ్రెజిల్‌లో ఆరంభమైంది. ఈ ఏడాది సదస్సును 'ఇంప్లిమెంటేషన్ కాప్' అంటున్నారు. అంటే హామీలకు పరిమితం కాకుండా, ఈ 30వ సదస్సులో ఆచరణకు కట్టుబడాలన్నది సంకల్పం. దేశాధినేతలు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణప్రేమికులు, ఉద్యమకారులు, చమురు లాబీయిస్టులు, మరోపక్క మండుటెండలకు మాడి, వర్షాలూ వరదలకు మునిగిపోతున్న దేశాలనుంచి వచ్చే నిరసనకారులతో రాబోయే పదిరోజులూ బ్రెజిల్ కళకళలాడబోతోంది. ముప్పై కీలకమైన అంశాల్లో ముందడుగువేయాలని ఈ సదస్సు సంకల్పించింది.

వేడెక్కుతున్న ధరిత్రిని 'కాప్' కాపాడుతుందని, మనిషి పట్ల ప్రేమతో అతని మనుగడకోసం నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆశ నిజానికి గత ఏడాది మరింత తగ్గిపోయింది. అజర్‌బైజాన్ రాజధానిలో 29వ సదస్సు ఆరంభానికి కొద్దిరోజుల ముందే అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు ఇత్యాది పదజాలానికి బద్ధవ్యతిరేకి అయిన ట్రంప్ అధికారంలో ఉన్నన్నాళ్ళూ ధరిత్రికి రక్షణ ఉండదని అందరికీ అర్థమైపోయింది. డ్రిల్ బేబీ డ్రిల్ అన్న ఒక్క మాటతో శిలాజ ఇంధనాలు తవ్విపోయడమే తన ఎజెండా అని స్పష్టంచేసిన ట్రంప్ ఏలుబడిలో ఈ ఏడాది సదస్సుకు అమెరికా ఏకంగా గైర్హాజరైంది. గతంలో మాదిరిగా మాటమార్చడమో, తప్పడమో కాదు, ఏకంగా సదస్సునే కాదనడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. గత ఏడాది సదస్సుకు 'ఫైనాన్స్ కాప్' అని నామకరణం చేసుకోవడంలో ప్రధానోద్దేశం, వాతావరణంలో ప్రతికూల మార్పులమీద పోరాడేందుకు వర్ధమానదేశాలకు ధనికదేశాలు అందించే ఆర్థికసాయాన్ని అధికం చేయడం. ఇప్పుడు ట్రంప్ బాయ్‌కాట్‌తో ఆ మొత్తానికి పెద్ద ఎత్తున గండం వచ్చిపడినట్టు లెక్క.

ఈ సదస్సులో కొత్త తీర్మానాలు, హామీలు వద్దనీ, అనుకున్నదానిని అమలు చేయడం గురించి మాత్రమే ఆలోచించాలని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా అంటున్నారు. ఈ సదస్సు పరిష్కారాల గురించి మాత్రమే మాట్లాడుతుందని ఆయన నమ్మకం. గ్లోబల్ వార్మింగ్ ఒకటిన్నర డిగ్రీలు దాటనివ్వకూడదని పారిస్ ఒప్పందంలో దేశాలన్నీ నిర్దేశించుకున్నాయి. అయినా కూడా, ఇప్పుడది రెండున్నర డిగ్రీల సెల్సియస్ వరకూ రికార్డవుతోంది. కర్బన ఉద్గారాలను తగ్గించుకుంటామని ఇచ్చిన హామీని ప్రపంచదేశాలు నిలబెట్టుకోకపోతే, లక్ష్మణరేఖంటూ దాటిన తరువాత కాలువెనక్కుతీసుకోవడం కూడా కష్టమైపోతుందని ప్రపంచస్థాయి సంస్థలు, నివేదికలు అనేకం హెచ్చరిస్తున్నాయి. ఈ కారణంగానే, ఐక్యరాజ్యసమితి అధినేత కూడా ముమ్మారు 'ఆచరణ...ఆచరణ..ఆచరణ' అంటూ సదస్సు లక్ష్యాన్ని నొక్కిచెబుతున్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూర్చడం, నష్టాలను భర్తీచేయడం, ఉద్గారాలను నియంత్రించుకోవడం వంటి పలు అంశాల్లో 2023దుబాయ్ సదస్సులో అడుగులు బాగాపడ్డాయి. మూడుదశాబ్దాల కాప్ సదస్సుల చరిత్రలో శిలాజ ఇంధనాలు అన్న పదం సంయుక్త ప్రకటనలో చేరడం అదే తొలిసారి. భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడానికి వీలుగా కర్బన ఉద్గారాలను వేగంగా తగ్గించుకొని, 2050కల్లా తటస్థత సాధించాలని ఆ సదస్సు నిర్ణయించింది. ఆ లక్ష్యానికి అనుగుణంగా విధానాలు రాసుకుంటానని అమెరికా కూడా హామీ ఇచ్చింది. ఇక, వాతావరణమార్పుపై సమర్థ పోరాటానికి వీలుగా ఎదుగుతున్నదేశాలకు ధనికదేశాలు అందించాల్సిన సాయం 1.3 ట్రిలియన్ డాలర్లు ఉండాలన్నది అంచనా. దీనికి భిన్నంగా, పదేళ్ళపాటు ఏటా మూడువందల బిలియన్ డాలర్లు ఇవ్వడానికి మాత్రమే ధనికదేశాలు గత ఏడాది సిద్ధపడ్డాయి. ఉద్గారాల్లో డెబ్బయ్‌ఐదుశాతం వాటాతో ప్రకృతిని నాశనంచేస్తున్న సంపన్నదేశాలు విపత్తులనూ, పర్యవసానాలను మాత్రం పేదదేశాలమీద రుద్దుతున్నాయి. అధిక పారిశ్రామికీకరణతో, అవధులులేని ఉత్పత్తితో లాభపడుతున్న సంపన్నదేశాల నుంచి ఆర్థికసాయంతో పాటు, పర్యావరణ అనుకూల సాంకేతిపరిజ్ఞానాలను కూడా ఉచితంగానో, చవుకగానో వర్ధమానదేశాలు పొందవలసి ఉంటుంది. అయితే, ప్రపంచంలో అత్యంత ధనికదేశం, రెండవ అతిపెద్ద కాలుష్యకారక దేశమైన అమెరికా ఈ సదస్సుకు గైర్హాజరై మానవాళి సంఘటిత పోరాటాన్ని దెబ్బతీసింది. అమెరికాను వదిలిపెట్టి, ఈయూ, చైనా, భారత్ వంటివి 'కాప్' ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషిచేయాలి.

గూగుల్ హబ్‌తో గ్లోబల్ మ్యాప్‌పై విశాఖ!

విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో దేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా హబ్‌ను స్థాపించడానికి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిన తరుణంలో సర్వత్రా హర్షాతిరేకాలతోపాటు కొన్ని సహజమైన సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇంతటి భారీ సౌకర్యం స్థానిక పవర్ గ్రిడ్‌పై భారం మోపదా? నీటి వనరులను హరించివేయదా? అసలు ఈ స్థాయి పెట్టుబడికి తగినన్ని ఉద్యోగాలను సృష్టించగలదా? వంటి ప్రశ్నలు సామాన్యులలోనూ నిపుణులలోనూ రేకెత్తాయి. కానీ వాస్తవాలను, సాంకేతిక అంశాలను, అంతర్జాతీయ నమూనాలను నిశితంగా పరిశీలిస్తే ఈ ఏఐ హబ్ ఒక భారం కాదనీ భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేసే ఒక సుస్థిర ప్రగతి నమూనా అనీ స్పష్టమవుతుంది.

అందరి మదిలో మెదిలే తొలి ప్రశ్న విద్యుత్. కానీ ఈ ప్రాజెక్టు రూపకల్పనే 'స్వయం సమృద్ధి' లక్ష్యంగా జరిగింది. గూగుల్ సంస్థ ఈ హబ్ కోసం అవసరమైన విద్యుత్‌లో 80శాతాన్ని సహజ ఇంధన వనరుల ద్వారా సమకూర్చుకోనున్నది. దీనికోసం ప్రత్యేకంగా ఒక గిగావాట్ సామర్థ్యంతో ఒక సోలార్ పార్క్‌ను నిర్మిస్తోంది. ఇది మామూలు విషయం కాదు. ప్రజల అవసరాలకోసం ఉద్దేశించిన గ్రిడ్‌పై భారం మోపకుండా, ఒక పారిశ్రామిక దిగ్గజం తన సొంత హరిత ఇంధన వనరులను సృష్టించుకోవడం ఇదే ప్రప్రథమం. దీని వల్ల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రిడ్‌పై ఈ ప్రాజెక్టు కారణంగా పడే భారం సున్న! ఇక సాంకేతిక సామర్థ్యం విషయానికి వస్తే గూగుల్ డేటా సెంటర్లు అద్భుతమైన పనితీరుకు మారుపేరు. విద్యుత్ వినియోగ సామర్థ్యానికి కొలమానమైన 'పవర్ యూసేజ్ ఎఫెక్టివ్‌నెస్' (పీయూఈ) గూగుల్ సెంటర్లలో సగటున 1.10శాతం. అంటే కంప్యూటింగ్ శక్తికి 10శాతం మాత్రమే అదనపు విద్యుత్ అవసరం. అదే సగటు పరిశ్రమ పీయూఈ 1.58గా ఉంది. అంటే అక్కడ కంప్యూటింగ్‌కు వాడినంత శక్తిలో 58శాతం అదనంగా వృథా అవుతోందన్నమాట. గూగుల్ సాంకేతికత ఎంత శక్తిని ఆదా చేస్తుందో, ఎంత పర్యావరణ భారాన్ని తగ్గిస్తోందో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 1 గిగావాట్ సోలార్ పార్క్ డేటా సెంటర్‌కు మాత్రమే కాదు. రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ లక్ష్యాలకు కూడా భారీ ఊతం ఇస్తున్నది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ బాధ్యత కలిసే సాగగలవని నిరూపిస్తోంది.

నీటి వినియోగంపై కూడా ఆందోళనలు సహజం. కానీ వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే ఈ భయాలు నిరాధరమైనవని అర్థమవుతుంది. ఉదాహరణకు విశాఖ ఉక్కు కర్మాగారం రోజువారీ నీటి వినియోగం సుమారు 38 మిలియన్ గ్యాలన్‌లు (ఎంజీడీ). దీనితో పోల్చినప్పుడు, ఈ భారీ ఒక గిగావాట్ డేటా సెంటర్ మొత్తం వినియోగ అంచనా కేవలం 5 ఎంజీడీ మాత్రమే. అంటే ఇది స్టీల్ ప్లాంట్ వాడకంలో 15శాతం కంటే తక్కువ. ఇది కూడా గరిష్ఠ అంచనా మాత్రమే. అంతేకాకుండా విశాఖకు ఉన్న తీరప్రాంతం ఒక సహజవరంగా ఉపయోగపడనున్నది. ఈ ప్రాజెక్టులో మంచినీటి వాడకాన్ని దాదాపు సున్నాకు తగ్గించే సాంకేతికత అందుబాటులో ఉంది. ఆధునిక సముద్రపు నీటి ఆధారిత శీతలీకరణ వ్యవస్థ (సీ వాటర్ కూలింగ్)ను ఇక్కడ వినియోగిస్తారు. సముద్రపు నీటిని నేరుగా కాకుండా హీట్ ఎక్స్‌చేంజర్‌ల ద్వారా వేడిని చల్లార్చడానికి ఉపయోగిస్తారు. దీనివల్ల అమూల్యమైన మంచినీటి వనరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. హైదరాబాద్ లేదా బెంగళూరు వంటి లోతట్టు నగరాలలో ఇలాంటి ప్రాజెక్టు వస్తే వారు ఖచ్చితంగా తాగునీటి వనరులపైనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ విశాఖతీరం మనకు వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఇచ్చింది. ఇవి క్లోజ్డ్ లూప్ వ్యవస్థలు, అంటే నీటిని ఒకసారివాడి వదిలేయకుండా దాన్నే శుద్ధి చేసి చల్లార్చి పదే పదే అంతర్గతంగా వినియోగిస్తారు. దీనివల్ల నీటి వృథాకు ఆస్కారం ఉండదు. ఇది స్థానిక జలవనరులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపని ప్రణాళిక.

> గూగుల్ ఏఐ హబ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రూ.22వేల కోట్ల ప్రోత్సాహకాలను కొందరు ఉచితాలుగా తప్పుగా అన్వయించుకుంటున్నారు. ఇది ఉచితం కాదు. రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టిన వ్యూహాత్మక పెట్టుబడి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అంచనాల ప్రకారమే ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తికి (జీఎస్‌డీపీ) ఏటా రూ.10,518 కోట్లు అదనంగా సమకూరనుంది. అంటే కొన్ని సంవత్సరాలలోనే ప్రోత్సాహకాల విలువ తిరిగి రాబడుతుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన నమూనా.



కేవలం నిర్మాణ సమయంలోనే ఉద్యోగాలు లభిస్తాయనేది ఒక అపోహ మాత్రమే. అమెరికా డేటా సెంటర్ పరిశ్రమపై 2025 పీడబ్ల్యూసీ అధ్యయనం దీనికి సంబంధించిన వాస్తవాలను కళ్లకు కట్టేలా చూపింది. ఈ అధ్యయనం ప్రకారం ప్రత్యక్ష ఉపాధి 2017లో 4,00,100 నుంచి 2023 నాటికి 6,03,900 ఉద్యోగాలకు పెరిగింది. కానీ అసలు కథ ఇక్కడే ఉంది. పరోక్ష, ఉపాధిని కూడా కలిపితే ఈ పరిశ్రమ ద్వారా పొందిన ఉద్యోగాలు అదే కాలంలో 2.9 మిలియన్ల నుంచి 4.7 మిలియన్లకు పెరిగాయి. ఇది ఏడు రెట్ల ప్రభావాన్ని సూచిస్తుంది. ఈ లెక్కన విజన్ ఏఐ హబ్ ద్వారా లభించే 25వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు మొత్తం ఉపాధి వ్యవస్థపై చూపే ప్రభావం 2లక్షలకు పైమాటే. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే– ఈ ఉద్యోగాలు తాత్కాలికం కావు. ఇక్కడ లభించే నైపుణ్యాలు (హైటెక్ నిర్మాణం, ఫైబర్ ఆప్టిక్స్, నెట్‌వర్క్ నిర్వహణ) కేవలం ఒక ప్రాజెక్టుకే పరిమితం కావు. ఇవి మొత్తం డిజిటల్ పరిశ్రమలకు అవసరం. 2030 నాటికి భారతదేశ డేటా సెంటర్ సామర్థ్యం 5–6 గిగా వాట్‌లకు చేరనుంది. ఈ దూకుడుగల పైప్‌లైన్‌కు, ఇక్కడ శిక్షణ పొందిన నిపుణులకు నిరంతరంగా జాతీయ డిమాండ్ ఉంటుంది. ఇక ఒక ప్రాజెక్టు కాదు. ఒక నైపుణ్యభరిత పారిశ్రామిక శక్తికి పునాది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రూ.22వేల కోట్ల ప్రోత్సాహకాలను కొందరు ఉచితాలుగా తప్పుగా అన్వయించుకుంటున్నారు. ఇది ఉచితం కాదు. రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టిన వ్యూహాత్మక పెట్టుబడి. దీని ద్వారా రాబోయే ప్రతిఫలం అపారమైనది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అంచనాల ప్రకారమే ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తికి (జీఎస్‌డీపీ) ఏటా రూ.10,518 కోట్లు అదనంగా సమకూరనుంది. అంటే కొన్ని సంవత్సరాలలోనే ప్రోత్సాహకాల విలువ తిరిగి రాబడుతుంది. ఇది కేవలం సిద్ధాంతం కాదు. ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన నమూనా. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వ్యూహాత్మక ప్రోత్సాహకాలను ఇచ్చి దీర్ఘకాలిక, అధిక విలువగల రాబడిని పొందుతున్నాయి. మన రాష్ట్రం అనుసరిస్తున్నదీ అదే విజయవంతమైన మార్గం.

డేటా సెంటర్ల రాక కేవలం సాంకేతిక పెట్టుబడి కాదు. అది ఒక సంపూర్ణ ప్రాంతీయ పరివర్తనకు నాంది పలుకుతుంది. ప్రపంచవ్యాప్త ఉదాహరణలే ఇందుకు సాక్ష్యం. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో యాష్‌బర్న్ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్ని డేటా సెంటర్ అల్లీ (డేటా సెంటర్ల వీధి) అని పిలుస్తారు. యూరప్‌లోని డబ్లిన్ (ఐర్లాండ్) వంటి ప్రాంతాలలో ఈ హైపర్‌స్కేల్ సౌకర్యాలు వచ్చిన ఐదేళ్లలోనే రియల్‌ఎస్టేట్ విలువ 25శాతం నుంచి 40శాతం వరకు పెరిగాయి. ఇది కేవలం నివాస గృహాలకు పరిమితం కాదు. దానికి అనుబంధంగా కొత్త లాజిస్టిక్ పార్క్‌లు, సేవారంగ సంస్థలు, హాస్పిటాలిటీ (హోటళ్ళు), మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరించాయి. విశాఖపట్నం కూడా ఇదే తరహా పరివర్తనకు సిద్ధమవుతోంది. ఈ ఏఐ హబ్, దానికి అనుబంధంగా వస్తున్న సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో కలిసి వాణిజ్య, నివాస విస్తరణకు, పర్యాటక రంగానికి, మౌలిక సదుపాయాల ఆధునీకీకరణకు భారీ ఊతం లభిస్తుంది. ఇది తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిస్థాయిలో పట్టణ, ఆర్థిక ఉన్నతిని అందిస్తుంది.


80శాతం సంప్రదాయేతర ఇంధనం (రెన్యూవబుల్ ఎనర్జీ), ఉక్కు కర్మాగారం వాడకంలో 15శాతంకన్నా తక్కువ నీటి వినియోగం, ఏటా రూ.10,500 కోట్లకుపైగా జీఎస్‌డీపీకి ఆదాయం, లక్షలాదిమందికి నిరంతర నైపుణ్య ఉపాధి, పూర్తిస్థాయిలో రియల్ ఎస్టేట్ పరివర్తన... ఇవన్నీ చూశాక కూడా ఇది వనరుల హరణం అని చెప్పగలమా? దీనిని విజయవంతంగా అమలుచేస్తే విశాఖపట్నం కేవలం ఒక డేటా సెంటర్‌కు ఆతిథ్యం ఇవ్వడమే కాదు, ప్రపంచానికి భారతదేశ డిజిటల్ ముఖద్వారంగా సగర్వంగా నిలుస్తుందని చెప్పవచ్చు.

■ రవికుమార్ ఈటంశెట్టి
సీఈఓ, టైర్ ఎక్స్ డేటా సెంటర్ సొల్యూషన్స్, బెంగళూరు

అజ్ఞాన చీకటిలో.. విజ్ఞాన జ్యోతి

'ప్రపంచంలో అణుబాంబు లాంటి శక్తిమంతమైన ఆయుధం ఏదైనా ఉందంటే అది కేవలం విద్య మాత్రమే.' ప్రపంచాన్ని జయించాలన్నా, చంద్రునిపైకి ఎగరాలన్నా, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలన్నా, దేశ జీడీపీ పెరగాలన్నా, కుటుంబ సంక్షేమం, జ్ఞాన సముపార్జన, మానవ సంబంధాలు, శాంతి స్థాపన... తదితరాలన్నిటికీ మూలం విద్య మాత్రమే. భారతదేశాన్ని విద్యావంతుల దేశంగా మార్చడానికి ఎన్నో ప్రముఖ విద్యాలయాలను నెలకొల్పిన 'భారత విద్యా వ్యవస్థ' సృష్టికర్త, విద్యా వైతాళికుడు, దేశ ప్రథమ విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతినే నేడు 'జాతీయ విద్యా దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మౌలానా ఆజాద్ కీలక పాత్ర పోషించారు. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి తోడుగా నిలిచారు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించారు. ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్లు జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం తొలి విద్యామంత్రిగా పదకొండేళ్లపాటు విశిష్ట సేవలందించారు. ఆజాద్ విద్యా సంస్కరణలు నేటికీ ఆదర్శనీయం. దేశంలో సంస్కృతీ సంప్రదాయాలు, కళలు, సంగీతం, సాహిత్య వికాసానికి తోడ్పడ్డారు. ప్రాథమిక, ఉన్నత విద్య కోసం 1948లో, సెకండరీ విద్య కోసం 1952లో ప్రత్యేక కమిషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత కూడా



ఆయనదే. బాలికల, గ్రామీణ విద్య కోసం ఎంతగానో కృషి చేశారు. వయోజన విద్య, సార్వత్రిక ప్రాథమిక విద్య కోసం అనేక విద్యాలయాలు నిర్మింపజేశారు. యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్)ను స్థాపించిన ఘనతా ఆయనదే. దేశంలోనే ప్రప్రథమంగా ఖరగ్‌పూర్‌లో ఐఐటీ నిర్మింపజేసి, సాంకేతిక విద్యకు బీజం వేశారు. ICCR, AICTE.. వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను ప్రారంభించారు. ఢిల్లీలో 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్', సాహిత్య అకాడమి, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ & ప్లానింగ్ వంటి సంస్థలను స్థాపించిన మహనీయుడు అబుల్ కలాం. ఆయన విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు, మేధో సంపన్నుడు మాత్రమే కాదు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు. అంతేకాదు కవి, రచయిత, తత్వవేత్త కూడా.

నేడు చదువు అంగడి సరుకుగా మారిపోయింది. ప్రైమరీ పాఠశాలల్లో ఫీజులు వేలల్లో, లక్షల్లో ఉంటున్నాయి. ఇంటర్, డిగ్రీ, మెడికల్ సీటు, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య సీట్లు డబ్బున్నవాళ్లే కొనగలుగుతున్నారు. పేద విద్యార్థులు విద్యా దోపిడీకి గురవుతున్నారు. 'నూతన విద్యా విధానాల రూపకల్పన, నూతన ప్రణాళికలు, విద్య అభివృద్ధి' వంటివాటిలో ప్రభుత్వాలు, అధికారులు కొంతమేరకు విఫలమైనట్లు కన్పిస్తోంది. విద్యా సంబంధిత విషయాలపై నేటి విద్యావేత్తలు, మేధావులు చేసే విమర్శలే దీనికి నిదర్శనం. మరోవైపు, విద్య కోసం తల్లిదండ్రులు ఫీజుల భారాన్ని మోస్తున్నప్పటికీ వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదు. కార్పొరేట్ విద్యాసంస్థల రాకతో 'ధనవంతులకో విద్య, పేదలకో విద్య' అన్నట్టుగా మారిపోయింది నేటి విద్యారంగం పరిస్థితి.


విద్యా సంబంధిత ప్రవేశాల్లో కూడా జ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వకుండా కుల, మత రిజర్వేషన్లు ఉంటుండడంతో ఎంతోమంది చురుకైన, మేధోశక్తి గల విద్యార్థులు ఉన్నత విద్యా ప్రవేశాలకు దూరమవుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ విద్యాలయాలకు అవసరమైన నిధులు లేక, సరైన మౌలిక సదుపాయాలు లేక అనేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూతపడే పరిస్థితి ఉంది. విద్యాలయాల్లో ఉపాధ్యాయుల నియామకాలు అవసరమైన మేరకు ఉండడం లేదు. 70 ఏళ్ల క్రితం మన దేశంలో మౌలానా అబుల్ కలాం అజాద్ తెచ్చిన విద్యా సంస్కరణలను నేటి ప్రభుత్వాలు, విద్యాధికారులు ఆదర్శంగా తీసుకోవాలి. మౌలానా అజాద్ లాంటి ఆలోచనాపరులు, మేధావులు మన విద్యా వ్యవస్థను చక్కదిద్దడానికి పుట్టుకురావాలని ఆశిద్దాం.

○ సయ్యద్ జబీ

(నేడు జాతీయ విద్యా దినోత్సవం)

కాలం మలచిన కవి

కవీ! నీ గురించి నివాళి రాయాలంటే అక్షరాలు కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నాయి. అందెశ్రీ! నిన్ను తలంచుకోవాలంటే కలం గద్గద స్వరమై రాయలేక నిలువెల్లా వణికిపోతుంది. మొన్న నాతో మాట్లాడిన అందెశ్రీ ఇలా అర్థాంతరంగా అకస్మాత్తుగా మాట మాత్రంగానైనా చెప్పా పెట్టకుండా వెళ్లిపోతాడని అనుకోలేదు. ఒకప్పటి వరంగల్ జిల్లా జనగాం తాలూకాలోని రేబర్తి గ్రామం అందెశ్రీ స్వంత గ్రామం. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో ఉంది. చిన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. ఆ గ్రామంలో మల్లారెడ్డి పటేల్ వద్ద పెరిగాడు. బడికి పోవాల్సిన వయసులో పశువుల కాపరిగా పనిచేశాడు. చిన్నప్పటినుండి దైవభక్తి మిక్కిలిగా ఉండేడిది. ఊరిలోని అన్ని కులాల ప్రజల నోటిలో పండుగా మెదిలాడు.



జీవితంలో సంభవించిన అనేక పరిణామాల కారణంగా నిజామాబాద్ జిల్లాలోను హైదరాబాద్‌లోను కూడా మేస్త్రిగా పనికి కుదిరాడు. బతుకు పాఠశాలలో అనేక పాఠాలు నేర్చుకున్నాడు. నాలుగో తరగతి చదువుకున్నారని ఆయన చెప్పాడు. ప్రారంభంలో అందెశ్రీ వివిధ పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలను చూస్తే సంభ్రమాశ్చర్యాలు కలుగక మానవు. కొత్త పాట రాసిన ప్రతిసారి తాపీ పని నుంచి సరాసరి పత్రిక ఆఫీసులకు వచ్చేవాడు. మిత్రులైన వారిని కలిసేవాడు. వారి కోరికపై కొత్త పాటను వినిపించేవాడు. మొదట్లో బిరుదురాజు రామరాజు దగ్గర ఎక్కువగా కనిపించేవాడు. తర్వాత తర్వాత ఆయన సాహితీ ప్రపంచం విస్తృతమైన కొద్దీ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండేవాడు. "నెత్తి మీద సుట్ట బట్ట ఆపైన పండ్ల బుట్ట తెనుగోల్ల ఎల్లవ్వా ఏది" – తెలంగాణ అస్తిత్వంలో కింది కులాల పైన రాసిన గొప్ప పాట ఇది. "మాదిగయ్యల మేద నుండి పురుడు పోసుకున్నది మానవ జాతులను ఎప్పుడు మేలుకొలుపుతున్నది" వంటి పాటలను రాసి పాడిన అద్భుతమైన జానపద వాగ్గేయకారుడు. "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం లేని వాడు" అంటూ ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి ఎలా చిరునామా కోల్పోతున్నాడో వివరంగా తన కలం ద్వారా, గళం ద్వారా గొంతెత్తి వినిపించాడు.

ఇకపోతే తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవిగా, వాగ్గేయకారుడుగా ఆయన పాత్ర అమోఘమైనది, అద్వితీయమైనది. ఆయన సాహితీ ప్రస్థానం అంతా ఒక ఎత్తు, తెలంగాణ ప్రజల రాష్ట్ర గీతం 'జయ జయ జయహే తెలంగాణ' ఒక ఎత్తు. ఈ గీతంలో తెలంగాణ ఖ్యాతిని చరిత్రను నిక్షిప్తం చేసి ప్రజల నాలికల పైన అజరామరమయ్యాడు అందెశ్రీ, అతని లాంటి కవి ఇక ముందు తెలంగాణలో జన్మిస్తాడనుకోవడం అసాధ్యమైన అంశం. ఆయన పాటల, మాటల సారాంశం అంతా తెలంగాణ అస్తిత్వంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి అందులో తెలంగాణ సాహిత్యానికి ఒక తీరని లోటు.

– జూకంటి జగన్నాథం

రైతుని దెబ్బతీస్తున్న దిగుమతి సుంకాల మాఫీ!

కేంద్ర ప్రభుత్వం 2025 ఆగస్టు 19న రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి మరీ ముడి పత్తిపై 11 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేసింది. "వస్త్ర పరిశ్రమకు ముడి పదార్థం సులభంగా అందుబాటులో ఉంచి, ఎగుమతి పోటీ సామర్థ్యాన్ని పెంచడం," ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం భారతదేశంలోని పత్తి మిల్లులకు ఊరట కలిగించే చర్యగా మారింది. కానీ తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల లక్షలాది చిన్న, మధ్య తరహా పత్తి రైతులకు, మార్కెట్ ధరలలో పతనం ద్వారా, మరోసారి నిరాశను మిగిల్చింది.

ప్రకటన వెలువడిన రెండు రోజుల్లోనే పత్తి ధరలు పడిపోయాయి. యవత్మాల్, జల్గావ్, వరంగల్ వంటి ప్రధాన మార్కెట్లలో జిన్నింగ్ పత్తి ధరలు కాండీపై రూ.1,000–1,200 దాకా తగ్గిపోయాయి. చౌక దిగుమతి పత్తితో పోటీపడలేక, భారత పత్తి సంస్థ (సీసీఐ) కూడా తన అమ్మకపు ధరను కాండీపై రూ.1,000 తగ్గించింది.

మంచి వర్షాల తరువాత లాభదాయకమైన ధర కోసం ఎదురు చూసిన రైతులకు ఇది కోలుకోలేని దెబ్బ. "మేము క్వింటాల్‌కు రూ.8,000 వస్తుందని అనుకున్నాం. ఇప్పుడు వ్యాపారులు రూ.6,600–6,700 కంటే ఇవ్వడం లేదు. మన కాళ్ల కింద నేల లాగేసినట్టుంది," అన్నాడు ఖమ్మం జిల్లాకు చెందిన ఒక సన్నకారు రైతు రాములు. ఇది ఖమ్మం జిల్లాకే పరిమితం కాదు, తెలంగాణ వ్యాప్తంగా పత్తి రైతుల వ్యథ.

పత్తి ఒక్కటే కాదు, ఈ దిగుమతి సుంకాల ఎత్తివేత నమూనా ఇప్పుడు ప్రతి పంటకూ పునరావృతం అవుతున్నది. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం పత్తితోపాటు నూనె గింజలు, పప్పులు వంటి పలు పంటలపై దిగుమతి సుంకాలను తగ్గించింది. దీని లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం లేదా పరిశ్రమలకు మద్దతు ఇవ్వడం. కానీ ప్రతిసారీ లాభం పొందేది వినియోగదారులు లేదా పరిశ్రమలు మాత్రమే; రైతులు నష్టాన్ని భరిస్తున్నారు.

ఈ సందర్భంలో– గతంలో ఎడిబిల్ ఆయిల్స్ ఉదంతాన్ని ఒక హెచ్చరికగా తీసుకోవాలి. పామ్ ఆయిల్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై సుంకాలు సడలించిన దిగుమతి విధానాల వల్ల భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద నూనె దిగుమతిదారుగా మారింది. దానితో వేరుశనగ, సోయాబీన్ రైతులు చౌక దిగుమతి నూనెలతో పోటీపడలేక వెనుకబడ్డారు. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ (SEA) ప్రకారం, 2024–25లో భారతదేశం నూనెల దిగుమతులకే రూ.1.5లక్షల కోట్లు ఖర్చు చేసింది. అది దేశం వ్యవసాయ మద్దతు పథకాలకు ఖర్చు చేసే మొత్తానికి దాదాపు రెట్టింపు. అయినప్పటికీ, సోయాబీన్, వేరుశనగ ధరలు కనీస మద్దతు ధర (MSP) కంటే తక్కువగానే ఉన్నాయి.

వ్యవసాయ ఆర్థికవేత్తల అభిప్రాయం ప్రకారం: 'వినియోగదారులకు సహాయం చేయడానికి చేసిన సుంకాల సడలింపులు చివరికి నూనెగింజల వ్యవసాయాన్ని బలహీనపర్చాయి. మన దేశం శాశ్వతంగా దిగుమతులపై ఆధారపడే పరిస్థితికి చేరుకుంది; చిన్న రైతులు నూనె గింజల సాగు మానేశారు.'

2016–17లో కూడా ఇలాగే వరుస కరువుల తరువాత, ప్రభుత్వం కంది పప్పు మొదలైన పప్పుల దిగుమతిపై సుంకాన్ని ఎత్తివేసింది. కానీ 2018–19లో దేశీయ ఉత్పత్తి పెరిగినపుడు మార్కెట్ చౌక విదేశీ పప్పులతో నిండిపోయింది. ఫలితంగా, మధ్యప్రదేశ్‌లోను, తెలంగాణలోను కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరలకు పప్పు దినుసులు అమ్ముకొనే దుస్థితిలోకి రైతులు నెట్టివేయబడ్డారు. దీని ఫలితంగా 'నేషనల్ అగ్రికల్చరల్ కార్పొరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' (NAFED) అత్యవసర కొనుగోలు కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. ఫలితంగా వేల కోట్ల రూపాయల ప్రభుత్వ వ్యయం జరిగింది. అనిశ్చితమైన దిగుమతి విధానాల వల్లే ఈ పరిస్థితి కలిగింది.

ఇక్కడ ప్రభుత్వ ప్రాధాన్యతల్లో అసమానత స్పష్టంగా కనిపిస్తున్నది.

> కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న దిగుమతి సుంకాల మాఫీ వంటి నిర్ణయాలు వ్యవసాయం ప్రధాన ఉపాధిగా ఉన్న తెలంగాణ వంటి రాష్ట్రాలపై ప్రత్యక్షంగా ఆర్థిక ప్రభావాన్ని చూపిస్తాయి. 2024–25లోనే తెలంగాణ ప్రభుత్వం కేంద్ర పరిమితిని మించి రూ.574కోట్లు వెచ్చించి పంటలను కొనుగోలు చేసింది. కేంద్రం మిల్లులను కాపాడుతుంటే, రాష్ట్రం రైతులను కాపాడటానికి తన నిధులను ఖర్చు చేయాల్సి వస్తున్నది.



పరిశ్రమలకు రక్షణ కల్పిస్తూ, రైతులకు ప్రమాదం కలిగించేదిగా ఈ విధానాలు ఉన్నాయి. వస్త్ర, ఆహార ప్రాసెసింగ్ రంగాల సంస్థలకు ప్రభుత్వ స్థాయిలో తమ ప్రయోజనాల కోసం ఒత్తిడి చేయగల శక్తి ఉంది. కానీ రైతులు చిన్నచిన్న సమూహాలుగా ఉండటం వల్ల ధరలు పడిపోయినప్పుడు నిల్వచేయడం, లేదా మార్కెట్‌లో రక్షణాత్మక చర్యలు తీసుకోవడం వారికి వీలు కాదు. ప్రస్తుత దిగుమతి సుంకాల మాఫీలు వ్యవసాయానికి కాకుండా పరిశ్రమలకు మద్దతుగా మారాయి. ప్రపంచ పత్తి చౌకగా ఉంటే మిల్లులు దిగుమతి చేసుకుంటాయి; ఖరీదయితే సుంకం ఎత్తివేయమని ఒత్తిడి చేస్తాయి. కానీ రైతుకు లభించే ధర మాత్రం ఎల్లప్పుడూ తగ్గుతూనే ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న దిగుమతి సుంకాల మాఫీ వంటి నిర్ణయాలు వ్యవసాయం ప్రధాన ఉపాధిగా ఉన్న తెలంగాణ వంటి రాష్ట్రాలపై ప్రత్యక్షంగా ఆర్థిక ప్రభావాన్ని చూపిస్తాయి. ప్రతిసారి సోయాబీన్, వేరుశనగ ధరలు పడిపోయినప్పుడు రాష్ట్రం అదనపు కొనుగోలు లేదా బోనస్ పథకాలతో ముందుకు రావాల్సి వస్తున్నది. 2024–25లోనే తెలంగాణ ప్రభుత్వం కేంద్ర పరిమితిని మించి రూ.574 కోట్లు వెచ్చించి పంటలను కొనుగోలు చేసింది. కేంద్రం మిల్లులను కాపాడుతుంటే, రాష్ట్రం రైతులను కాపాడటానికి తన నిధులను వెచ్చించాల్సి వస్తున్నది. ఈ విధంగా కేంద్రం నిశ్శబ్దంగా ఆర్థిక భారాన్ని రాష్ట్రాలపై మోపుతున్నది.

ఇలాంటి నిర్ణయాల వల్ల ప్రధాన నష్టం చిన్న, అణగారిన రైతులకే! భారతదేశంలో 86శాతం రైతులు ఐదు ఎకరాలకు తక్కువ భూమిపై వ్యవసాయం చేస్తున్నారు. వీరికి పంట నిల్వ చేసే సదుపాయం లేదు. ధరలు పడిపోయిన వెంటనే అమ్మకాలు చేయాల్సిందే. ఎరువులు, కూలి చెల్లింపులు, మందులు వంటి ఖర్చులు పెరిగిన ఈ రోజుల్లో 10శాతం ధర తగ్గితేనే రైతుల లాభం మాయం అవుతుంది. పత్తి రైతుల విషయంలో కాండీపై రూ.1,000 ధర తగ్గితే, ఎకరాకు రూ.7,000–10,000 వరకు నష్టం వస్తుంది. అది అప్పు తీర్చగల స్థితి నుంచి అప్పుల్లో కూరుకుపోయే స్థితికి మార్పు.

ఏ పంట పైనైనా దిగుమతి సుంకం మార్చే ముందు 'రైతులపై అవి చూపే ప్రభావాన్ని అంచనా వేయడం (Farmer Impact Assessment) తప్పనిసరిగా చేయాలని ఆర్థికవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. ఇది ధరలలోని హెచ్చుతగ్గులు, ఎమ్ఎస్‌పి స్థాయిలు, కొనసాగుతున్న కొనుగోలు కార్యక్రమాలు వంటి అంశాలను పరిశీలించాలి. ఇంకో ప్రతిపాదన ఏమిటంటే "వేరియబుల్ టారిఫ్ మెకానిజం" – అంటే ప్రపంచ ధరలు కనీస మద్దతు ధర కంటే తగ్గితే సుంకం స్వయంచాలకంగా పెరిగే విధానం. దీని ద్వారా రైతులు దిగుమతుల ప్రభావం నుంచి రక్షించబడతారు. "ఇవి పరిశ్రమల అవసరాలు, గ్రామీణ సంక్షేమం మధ్య సమతౌల్యం కోసం అవసరమైన స్థిరత్వ విధానాలు," అంటున్నారు హైదరాబాద్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌కి చెందిన వ్యవసాయ విధాన నిపుణులు.

భారతదేశంలో వాణిజ్య విధానం వ్యవసాయ విధానం కంటే వేగంగా మారుతున్నది. దాని ఫలితం: ఢిల్లీలో తీసుకునే నిర్ణయాలు తెలంగాణ, విదర్భ రైతుల వాస్తవ జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయి. సుంకాలలో రాయితీలు పరిశ్రమలకు తాత్కాలికంగా మేలు చేసినా, రక్షణలేని విధంగా అమలు చేస్తే రైతులకు వచ్చే ధరలలో స్థిరత్వం కానరాకుండా పోతుంది. కొత్త పత్తి పంట మార్కెట్‌లోకి వస్తున్న ఈ సమయంలో, తెలంగాణ రైతులకు ఉన్న ఒకేఒక్క కోరిక – కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతుల శ్రమను మరొకరి లాభాలకు బలి చేసే విధంగా ఉండకూడదు అని.



• తుమ్మల నాగేశ్వరరావు
రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి




- అన్ని కొనుగోలు కేంద్రాలు తెరిచేలా చర్యలు
- 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

6

ముక్కోటి గొంతుకలు శోకతప్తం



జిల్లా కోర్టులో అందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



పాటతో పోటెత్తి, ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన అందెశ్రీ అస్తమయం

- ఆకస్మిక మరణంతో విషాదంలో తెలంగాణ సాహిత్య లోకం
- పూర్వ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మద్దూరులో జన్మించిన అందెశ్రీ
- తెలంగాణ ఉద్యమంలో ఓరుగల్లుతో మమేకం
- 'ధూం..ధాం..' సభల్లో తనదైన ముద్ర
- గౌరవ డాక్టరేట్‌తో సత్కరించిన కేయూ
- సంతాపం తెలిపిన భిన్నరంగాల ప్రముఖులు

హనుమకొండ/హనుమకొండ కల్చరల్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాహిత్య శిఖరం అందెశ్రీ అనంత తీరాలకు తరలివెళ్లడంతో ఓరుగల్లులో విషాదం నెలకొంది. 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' అంటూ తెలంగాణను వేనోళ్ల పొగిడిన ప్రజా వాగ్గేయకారుడు కన్నుమూయడంతో అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. రచయితగా, కళాకారుడుగా చెరగని ముద్రవేసిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో సాహితీ ప్రపంచం ఒక్కసారి దిగ్భ్రాంతికి లోనైంది. అందెశ్రీ హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు. అందెశ్రీ అనేది కలంపేరు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జూలై 18న జన్మించారు. అందెశ్రీకి వరంగల్‌తో విడదీయరాని అనుబంధం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో (ప్రస్తుతం సిద్దిపేట జిల్లా) నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఉమ్మడి జిల్లాలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అందెశ్రీ తన మాటలు, పాటలతో జనాన్ని ఎంతగానో కదిలించారు. సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని, రాష్ట్రం ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పారు. 'ధూం ధాం' కార్యక్రమ రూపశిల్పిగా తెలంగాణలోని 10 జిల్లాల్లోని ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' పాట ప్రభంజనం సృష్టించింది. పల్లె నీకు వందనాలమ్మో, మాయమై పోతున్నడమ్మో మనిషన్న వాడు, గలగల గజ్జెల బండి, కొమ్మ చెక్కితే బొమ్మరా, జన జాతరలో మన గీతం, యెల్లిపోతున్నావా తల్లి... అందెశ్రీ రాసిన (మిగతా 7వ పేజీలో)

పరేషాన్‌లో పంచాయతీలు

- నిధులు లేక నిర్వీర్యం...రెండేళ్ల నుంచి రాని గ్రాంట్లు
- పాలకవర్గాలు లేనందున నిధులు ఇవ్వని కేంద్రం
- స్టేట్ ఫైనాన్స్ కమిషను మొండి చేయి
- జనరల్ ఫండ్స్ వినియోగానికి అడ్డంకులు
- చెక్కులు పాస్‌కాక పంచాయతీ కార్యదర్శుల అవస్థలు
- పంచాయతీ ఎన్నికలపై కొనసాగుతున్న అనిశ్చితి
- గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధి పనులు



గ్రామ పంచాయతీ కార్యాలయం

హనుమకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామ పంచాయతీలు నిధుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా పంచాయతీలకు ఇవ్వడం లేదు. పంచాయతీలకు సకాలంలో ఎన్నికలు జరగక పాలకవర్గాలు లేక పోవడంతో కేంద్ర ప్రభుత్వం కూడా నిధులకు బ్రేక్ వేసింది. పంచాయతీలకు ప్రధాన ఆర్థిక వనరు అయిన పన్నులు కూడా వసూలు కాక ఆదాయం కూడా సమకూరడం లేదు. పంచాయతీ అధికారులు పట్టించుకోక పోవడంతో పంచాయతీల పరిధిలోని పరిశ్రమలు, గనులు, ఇతర ప్రైవేటు, కార్పొరేట్ సెక్టార్ సంస్థల నుంచిరాయల్టీ రూపంలో రావలసిన డబ్బులు సైతం జమ కావడం లేదు. పాలకవర్గాలు లేక, అడిగేవారు లేక, పట్టించుకునేవారు అంతకన్నా లేక పంచాయతీలు దిక్కులేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. దీనావస్థను ఎదుర్కొంటున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 75 మండలాలు, 1708 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 11 మండలాలు, 317, హనుమకొండ జిల్లాలో 12మండలాలు 210 గ్రామ పంచాయతీలు, జనగామ జిల్లాలో 12 మండలాలు, 280 గ్రామ పంచాయతీలు, మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలు 482 గ్రామ పంచాయతీలు, ములుగు జిల్లాలో 10 మండలాలు, 171గ్రామ పంచాయతీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 12 మండలాలు 248 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలు పరిధిలో 28 లక్షల జనాభా ఉంది.

పేరుకుపోతున్న సమస్యలు

పంచాయతీల భారమంతా కార్యదర్శులపైనే పడుతుంది. నిధులు లేకపోవడంతో వారు కూడా పంచాయతీల నిర్వహణ తమ వల్లకాదని చేతులెత్తేస్తున్నారు. ఇంతకాలం చిన్న చిన్న ఖర్చులకు జేబుల్లో నుంచి వెచ్చించిన పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి తిప్పలు పడుతున్నామని వాపోతున్నారు. ఫలితంగా గ్రామ పంచాయతీల్లో సమస్యలు కుప్పలు, తెప్పలుగా పేరుకుపోతున్నాయి. గ్రామాల్లో వీధి దీపాలు వెలగకపోయినా, బోరు పనిచేయకపోయినా, ట్రాక్టర్ల డీజిల్ లేకపోయినా వాటి ఫలితం ప్రజలు అనుభవించక తప్పని పరిస్థితులు ప్రస్తుతం నెలకొని ఉన్నాయి. ఇంత కాలం కార్యదర్శులు సొంతంగా వెచ్చించ్చిన ఖర్చులు తిరిగా రాకపోగా, నగదు చెల్లించకుండా సామాగ్రిని ఇచ్చేందుకు షాపుల నిర్వాహకులు నిరాకరిస్తుండడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోతున్నాయి.

ఆర్థిక సంఘ నిధులకు బ్రేక్

గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేనందున నిధులు విడుదల చేయలేమంటూ కేంద్రం చేతులెత్తేసింది. సకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఉంటే కేంద్రం నిధులు సక్రమంగా విడుదలై ఉండేవి. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేకపోయింది. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తేనే 15వ ఆర్థిక సంఘం ద్వారా నిధులను విడుదల చేస్తామని కేంద్రం లంకె పెట్టడంతో ఆ నిధులపై ఆశలు వదులుకోవాల్సి వచ్చింది, మరో వైపు రాష్ట్ర ప్రభుత్వ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సి) కింద నిధులను విడుదల చేయలేకపోవడంతో గ్రామాల్లో నిధుల కొరత తీవ్ర రూపం దాల్చింది. సొంతంగా గ్రామపంచాయతీలు జమ చేసుకున్న ఫండ్‌ను కూడా (మిగతా 6వ పేజీలో)

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్



అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీఎస్ఎఫ్ నాయకులు

వడ్డెపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సునిల్ మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు, విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో టీఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు నాగారం మణితేజ, నాయకులు వంశీ, అనిల్, మణిదీప్, వినయ్, అఖిల్, అబి, భరత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శబరీష్

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ షురూ

- నగరంలో తెల్లవారుజామున ప్రారంభించిన కలెక్టర్
- 20 వరకు ప్రతిరోజూ 800 అభ్యర్థులకు ఫిజికల్ పరీక్షలు

వరంగల్ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్మీలో ఉద్యోగాల భర్తీ కోసం హనుమకొండలోని జేఎన్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం తెల్లవారు జామున 2.30 ప్రాంతంలో సైన్యాధికారుల సమక్షంలో జెండా ఊపి ప్రారంభించారు. సైన్యాధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం... రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణలోని 33 జిల్లాల అభ్యర్థులకు ఈ నెల 10 నుంచి 22 వరకు ఫిజికల్, మెడికల్ పరీక్షలు నిర్వహించడానికి జేఎన్ స్టేడియంలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

మొదటి రోజు 794 మంది అభ్యర్థులకు గానూ అదిలాబాద్, వనపర్తి 624 మంది హాజరయ్యారన్నారు. 11న నిజామాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్ నుంచి 800, 12న కుమరం భీం, ఆసీఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్, 794, 13న జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, సూర్యాపేట 786, నవంబర్ 14 జోగులాంబ గద్వాల్, యాదాద్రి భువనగిరి, మలుగు, నారాయణపేట, ఖమ్మం 791, నవంబర్ 16న వికారాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ 793, 17న నిర్మల్, రాజన్న సిరిసిల్ల 800, 18న మంచిర్యాల, పెద్దపల్లి, హైదరాబాద్ 781, 19న సిద్దిపేట, కరీంనగర్, జనగాం, మహబూబాబాద్ 817, 20న జగిత్యాల, నల్గొండ, వరంగల్, హనుమకొండ 800మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు.

అన్ని దశలు పూర్తయిన తర్వాత ఫైనల్ మెరిట్ లిస్టు సిద్ధం చేసి విజేతలకు ఈ మెయిల్ ద్వారా సమాచారం అందజేస్తామన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా మొబైల్ టాయిలెట్లు, తాగు నీరు ఏర్పాటుతో పాటు అత్యవసర వైద్య సేవల కోసం 28 మంది వైద్యులు, 108 పారా మెడికల్ సిబ్బంది షిష్టల వారీగా విధులు నిర్వహిస్తారన్నారు.



జీడికల్ సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



మంగళసూత్రాన్ని చూపుతున్న వేద పండితులు

పులకించిన జీడికల్

- కార్తీకమాస పునర్వసు నక్షత్రాన ఘనంగా సీతారాముల కల్యాణం
- పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే కడియం
- మార్మోగిన రామనామ స్మరణం
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తజనం
- భారీ బందోబస్తు ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన ఘట్టం

7

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



- ప్రజావాణి కార్యక్రమంలో
- కలెక్టర్లు సత్య శారద, స్నేహాశబరీష్

6

సమస్యలు తెలుసుకుంటున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

ప్రథమ విజేత సమర తేజ, ద్వితీయ స్థానంలో రాజు



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీలో కరీంనగర్ జిల్లాకు చెందిన సమర తేజ ప్రథమ స్థానంలో నిలువగా వరంగల్ జిల్లాకు చెందిన టి. రాజు ద్వితీయ స్థానంలో నిలిచాడు. గత రెండు రోజులుగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ టూ ఆల్ చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. క్రీడాకారుల మధ్య రెండు రోజులుగా హోరాహోరీగా జరిగిన పోరులో తమ ప్రత్యర్థులపై ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ, మెదడకు మేత పెట్టి విజయం వైపు దూసుకెళ్లారు. ఈ ముగింపు వేడుకలకు చెస్ క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి, చీఫ్ అర్బిటర్ కన్నా హాజరై మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఓపెన్ టూ ఆల్ చెస్ టోర్నీలో వివిధ జిల్లాల నుంచి 180 విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కాగా ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సమర తేజ ప్రథమ స్థానంలో నిలువగా వరంగల్‌కు చెందిన టి. రాజు ద్వితీయ స్థానం, పెద్దపల్లికి చెందిన విన్సెంట్ తృతీయ స్థానంలో నిలిచారని కన్నా తెలిపారు. ఈ మేరకు విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు సిహెచ్. శ్రీనివాస్, డి. రియాజ్, టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

జానకికి మహిళా లెజండరీ పురస్కారం



పురస్కారాన్ని అందజేస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ

వడ్డెపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రజా నాట్య మండలి ద్వారా ప్రజల్ని చైతన్యపర్చిన కళాకారిణి పుట్ట జానకికి మహిళా లెజండరీ పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీప్రగతి ఫౌండేషన్ ఎంపిక చేసింది. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రగతి ఫౌండేషన్ సంస్థ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించింది. హనుమకొండకు చెందిన ప్రముఖ కళాకారిణి పుట్ట జానకికి మహిళా లెజండరీ - 2025 అవార్డుతో పాటు పురస్కారాన్ని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీసీఎస్ ఫౌండేషన్ సంస్థ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణం దగ్ధం

నర్సంపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం అర్ధ రాత్రి షార్ట్ సర్క్యూట్ సంభవించి ఓ వస్త్ర దుకాణం దగ్ధమైంది. బట్టల షాపు యజమాని రాజు కథ నం ప్రకారం.. పట్టణానికి చెందిన బొప్పతి రాజు జయశ్రీ టాకీస్ సమీపంలో శివరామ క్లాత్ స్టోర్స్ నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగా ఆదివారం రాత్రి షాపు మూసివేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించి బట్టల షాపు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో షాపులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ప్రాణాలతో బయటపడడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటలో విలువైన దుస్తులు దగ్ధం కావడంతో సుమారు రూ.80లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని తెలిపాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అండర్-17 కబడ్డీ పోటీలు

పినపాక/మణుగూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాలల క్రీడా సమాఖ్య రాష్ట్ర స్థాయి 69వ అండర్ 17బాల బాలికల కబడ్డీ క్రీడా పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో బాలికల విభాగంలో ఖమ్మం, నల్లగొండ జట్లు తలపడగా ఖమ్మం బాలికల జట్టు విజేతగా నిలిచింది. రన్నరప్‌గా నల్లగొండ జట్టు, మూడోస్థానంలో మహబూబాబాద్ జిల్లా జట్టు ఇక బాలుర విభాగంలో ఖమ్మం, హైదరాబాద్ జట్లు తలపడగా హైదరాబాద్ జట్టు విజయాన్ని కైవసం చేసుకోగా.. ఖమ్మం బాలురజట్టు రన్నరప్‌గా నిలిచింది. మూడో విజేతగా వరంగల్ జట్టు నిలిచింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ విజేతలకు బహుమతులు అందజేశారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

90 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్ ద్వారా వచ్చే ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారనిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. మలేరియా విభాగం సిబ్బంది నగరంతో పాటు విలీన గ్రామాలలో దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 90 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనా రాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మన రాజారెడ్డి, హార్టికల్చర్ అధికారి రమేష్, ఇంచార్జీ సీపీ రవీందర్, డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల అధికారి రామకృష్ణతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇలా ఉన్నాయి ఇంజనీరింగ్ - 33, హెల్త్, శానిటేషన్ - 5, ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ - 7, టౌన్‌ప్లానింగ్ - 41, మంచి నీటి సరాఫరా - 2, హార్టికల్చర్ - 2 ఇలా మొత్తం 90 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రజల నుంచి ఫిర్యాదులు ఇలా..

- వరంగల్ పోతననగర్‌కు చెందిన జీడబ్ల్యూఎంసీ ఔట్‌సోర్సింగ్ జవాన్ కుమ్మరి ఈశ్వర్ అనే వ్యక్తి తనకు మునిసిపాలిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.80 లక్షలు తీసుకుని మోసం చేశాడని వరంగల్ కరీమాబాద్‌కు చెందిన మాదాసి భిక్షపతి అనే వ్యక్తి కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇతడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తన డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశాడు.
- గ్రేటర్ 40వ డివిజన్ ఉప్పరోనికుంట వద్ద గల బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి, వెంటనే పనులు పునరుద్ధరించాలని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
- గ్రేటర్ 1వ డివిజన్ ఎర్రగుట్ట ప్రాంతంలోని శ్రీనివాసకాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం కురిసిన సమయంలో డ్రైయినేజీ నీరు రోడ్లపైకి వస్తోందనీ ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు.
- గ్రేటర్ పరిధిలోని 55వ డివిజన్ కోమటిపల్లి, భీమారం గ్రామంలో చాలా కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్లు సత్య శారద, స్నేహశబరీష్

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన వినతులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులకు సూచించరు. సోమవారం ఆమె కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఇక్కడ పరిష్కారం కానివి ఉంటే అందుకు గల కారణాలను దరఖాస్తుదారులకు లిఖితపూర్వకంగా తెలుపుతూ సరైన సూచనలు అందించాలన్నారు. అధికారులు నిత్యం ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించాలన్నారు. ఈ నెల 13వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించాన్నారు. ప్రజావాణిలో మొత్తం 165 వినతులు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 45 వినతులు, గృహ నిర్మాణ శాఖకు 15, కలెక్టరేట్‌కు 15, జీడబ్ల్యూఎంసీకి 8, పోలీసు శాఖకు 6, ఇతర శాఖలకు 76 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జిల్లా పరిషత్ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్‌డీవో రామిరెడ్డి, డీడబ్ల్యూవో రాజమణి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో...

హనుమకొండ కలెక్టరేట్ : హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ సమస్యలపై 158 ఫిర్యా దులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా హనుమకొండ ఆర్డీవో కార్యాలయానికి 18, హౌసింగ్ పీడీకి 18, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 17 ఫిర్యాదులు రాగా మిగతా ఫిర్యాదులు వివిధ సమస్యలపై వచ్చాయి. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బాధితుల నుండి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు సమస్యపై ఎంక్వైరీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే బాధితుల సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలకు ప్రజావాణిపై, ప్రభుత్వంపై నమ్మకం ఉంటుందని, అధికారులు పారదర్శకంగా వ్యవహరించి సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, డీఆర్‌డీవో మేన శ్రీను, పరకాల, హనుమకొండ ఆర్‌డీఓలు డాక్టర్ కె.నారాయణ పాల్గొన్నారు.

గుట్కాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మచ్చిక రాజుగౌడ్, యువజన సంఘాల సమాఖ్య వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు

గుట్కాలను విక్రయిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. పల్లె నుంచి పట్నం దాకా కిరాణా షాపులు, పాన్‌షాపుల్లో విచ్చల విడిగా అంబర్, గుట్కా, జేకే రత్న ప్యాకెట్లు అమ్ముతున్నారు. దీంతో యువత వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వెంటనే పోలీసులు తనిఖీలు చేపట్టి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

'శాశ్వత పరిష్కారం చూపండి'

హసన్‌పర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం ముంపు ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు సోమవారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల కురసిన భారీ వర్షాల కారణంగా శ్యామల చెరువు మత్తడి పడి బొడ్రాయి ప్రాంత ప్రజల ఇండ్లలోకి వరదనీరు చేరి నానా ఇబ్బందులు పడ్డారని వినతి పత్రంలో పేర్కొన్నారు. భవిష్యత్తులో భారీ వర్షాల కారణంగా శ్యామల చెరువు మత్తడి పడి వరదనీరు ఇండ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడకుండా మత్తడి నీరు సాఫీగా వెళ్లడానికి శాశ్వత పరిష్కారం చూపించాలని కమిషనర్‌తో పాటు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా వారి వెంట ఈఈ, డీఈలు ఉన్నారు.

పట్టించుకోని పేషంట్ కేర్

ఎంజీఎం క్యాజువాలిటీలో రోగి అవస్థలు



నడుచుకుంటూ వెళుతున్న రోగి

వరంగల్ మెడికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎం ఆస్పత్రిలో దిగువస్థాయి సిబ్బం ది నిర్లక్ష్యం వల్ల ఎంజీఎం అబాసుపాలవుతోంది. సోమవారం సాయంత్రం ఓ మహిళా రోగి అత్య వసర చికిత్స కోసం ఎంజీఎంకు వచ్చింది. వైద్యు లు చికిత్స అందించి సెలైన్ బాటిల్ పెట్టారు. వార్డుకు తరలించాల్సిన పేషంట్ కేర్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో రోగి నడుస్తూ ఉండగా పక్కన సెలెన్ బాటిల్ పట్టుకొని మరో వ్యక్తి వెళుతున్న దృశ్యం కనిపించింది. పైసలిస్తేనే పేషంట్ కేర్ ముం దుకు వస్తున్నారంటూ రోగులు వాపోతున్నారు. సూపర్ వైజర్స్ సైతం మౌనంగా ఉంటూ పరోక్షంగా సహరిస్తున్నట్లు తెలుస్తోంది.

అటవీ గ్రామంలో ట్రెయినీ ఐఏఎస్‌లు

లెంకలగడ్డలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలల సందర్శన



లెంకలగడ్డ గ్రామంలో పర్యటిస్తున్న ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

కాటారం(మహదేవపూర్ రూరల్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి):అఖిల భారత సర్వీస్ శిక్షణ అధికారుల(ట్రెయినీ ఐఏఎస్‌లు)బృందం సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల మండలానికి చేరుకుంది. ముస్సోరి లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ తీసుకుంటున్న ఐఏఎస్ అధికారులు ఎఫ్ఎస్ఆర్‌పీ(ఫీల్డ్ స్టడీ రీసెర్చ్ ప్రోగ్రా ం)లో భాగంగా నీతిఆయోగ్ అస్పిరేషన్ బ్లాక్ మండలమైన పలిమెలలో పర్యటన కోసం వచ్చారు. వారికి అధికారులు లెంకలగడ్డ గ్రామ పంచాయతీ శివారులో ఘనంగా స్వాగతం పలికారు. ఆదిత్యసింగ్, మయాంక్ ఖండేల్‌వాల్, మణిమాల, వాల్‌సింగ్, పవార్‌అక్షయ్‌విలాస్, రితికరాయ్‌లతో కూడిన శిక్షణ ఐఏఎస్ అధికారుల బృందం లెంకలగడ్డలో పర్యటించి గ్రామస్థులతో కలిసి పలు వాడల్లో తిరిగి పరిసరాలను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను, సేవలందుతున్న తీరును పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థాయి అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పలు శాఖలకు చెందిన వివరా లు అడిగి తెలుసుకున్నారు. ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం గ్రామంలో బ స చేసి మంగళవారం శ్రమదానం, సబ్‌సెంటర్ తనిఖీ, కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన తదితర అంశాల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

రోజుకు రూ.5వేలు చెల్లించండి

ఎస్‌బీఐకి కన్స్యూమర్ కోర్టు జరిమానా

ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వనందుకు బాధితుడి ఫిర్యాదు

వరంగల్ చౌరస్తా, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న రుణం చెల్లించిన తర్వాత బాధితుడికి ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వనందుకు కన్స్యూమర్ కోర్టు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు జరిమానా విధించింది. పత్రాలు ఇచ్చేవరకు రోజుకు రూ.5వేల చొప్పున పరిహారం చెల్లించాలని ఆదేశించింది. వరంగల్ నగరానికి చెందిన న్యాయవాది ఆర్. నాగేంద్రాచారి కథనం ప్రకారం..వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన డి. మల్లేశం అనే వ్యక్తి తన ఆస్తిపత్రాలను తాకట్టు పెట్టి పోచమ్మ మైదాన్‌లోని ఎస్‌బీఐ బ్రాంచి నుంచి రుణం తీసుకున్నాడు. తిరిగి చెల్లించిన తర్వాత తన ఆస్తి పత్రాలను ఇవ్వాలని కోరడంతో అవి పోయాయని.. తిరిగి ఇవ్వలేమని చెప్పారు. దీంతో బాధితుడు వరంగల్ కన్స్యూమర్ కోర్టులో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఈనెల 7న విచారణ జరిపిన కోర్టు సదరు బ్యాంకు వారికి జరిమానా విధించింది. ఇప్పటినుంచి ఆస్తి పత్రాలు ఇచ్చే వరకు రోజుకు రూ.5 వేల చొప్పున నష్టపరిహారంతో పాటు మానసిక వ్యధకింద రూ. లక్ష, కోర్టు ఖర్చుల కింద మరో రూ.25 వేలు చెల్లించాలని బ్యాంకువారిని ఆదేశించింది.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, స్నేహశబరీష్

హనుమకొండ/వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం పంట సీజన్‌కు సంబంధించి రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనాతో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం వానా కాలం పంట కొనుగోలుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్‌కే రామక్రిష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 1640 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా తెరవలేదని, వీటిని తక్షణమే ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం రైతులకు మాట ఇచ్చిందని, దీనికి అనుగుణంగా వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు సిద్ధం చేసుకో వాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగే శ్వర రావు మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా లక్షా పది వేల ఎకరాల పంట నష్టం జరిగిందనిఅన్నారు. జిల్లా కలెక్టర్ అధ్య క్షతన ధాన్యం కొనుగోలు కట్టుదిట్టంగా జరుపుతూ, రైతులకు కొంత మేర ఉపశమనం లభించేలా ప ని చేయాలని అన్నారు. ప త్తి, ధాన్యం పంటలను ఆర బెట్టుకుని నిర్ణీత తేమ శా తం వచ్చిన తర్వాత కొను గోలు కేంద్రాలకు తీసుకొని వెళితే రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని మంత్రి సూచించారు. సీఎస్‌కే రామ క్రిష్ణారావు మాట్లాడుతూ నవంబర్‌లో అధికంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు సకాలంతో అందించాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పీడీ డీఆర్‌డీవో మేన శ్రీను, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఎండీ వాజిద్ అలీ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ జిల్లా నుంచి కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, మార్కెటింగ్ అధికారి సురేఖ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, లీగల్ మెట్రాలజీ అధికారి మనోహర్, జిల్లా రవాణా అధికారి శోభన్‌బాబు పాల్గొన్నారు.

పరేషాన్‌లో పంచాయతీలు

(5వ పేజీ తరువాయి)

వినియోగించుకోలేని దీనమైన పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర గ్రాంట్ 2024 ఆగస్టు నుంచి నిలిచిపోగా, రాష్ట్ర ప్రభుత్వ నిధులు 2023 ఆగస్టు నుంచి ఆగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామ జనాభాను బట్టి తలా ఒక్కంటికి రూ. 108 చొప్పున విడుదల చేయాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం నుంచే స్టేట్ ఫైనాన్స్ నిధులు నిలిచిపోగా, కాంగ్రెస్ అదే దారిలో పయనిస్తోంది.

జనరల్ ఫండ్ విడుదలకు కూడా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. గ్రామ పంచాయతీలు సొంతంగా జమ చేసుకున్న ఫండ్‌ను కూడా ఉపయోగించుకోలేక పోతున్నాయి. గ్రామాల్లో వసూలు చేసే ఇంటి పన్నుల ద్వారా సమకూరే నిధులను కార్యదర్శులు ట్రెజరీ కార్యాలయాల ద్వారా ప్రభుత్వ ఖజానాకు జమ చేస్తారు. ఆ నిధులను అవసరమైనప్పుడు కార్యదర్శులు చెక్కులు డిపాజిట్ చేయడం ద్వారా తిరిగి డ్రా చేస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1708 గ్రామ పంచాయతీలు ఉండగా ట్రెజరీలలో పంచాయతీ కార్యదర్శులు జమ చేసిన నిధులు సుమారు రూ. 70 కోట్ల వరకు ఉంటాయని అంచనా. ఆ నిధులను కార్యదర్శులు డ్రా చేసి గ్రామాల్లో అవసరమైన వాటికి ఉపయోగిస్తారు. 15 నెలలుగా అంటే ఆగస్టు 2024 నుంచి జనరల్ ఫండ్ నిధులు కూడా విడుదల కావడం లేదని పలువురు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. గ్రామాల్లో వివిధ పనుల చేపట్టేందుకు అవసరమైన డబ్బుల కోసం చెక్కులు డిపాజిట్ చేస్తే పాస్ కావడం లేదని చెబుతున్నారు.

పంచాయతీల్లో పాలకవర్గాల కాలపరిమితి ముగిసిన నాటి నుంచి రోజువారి పారిశుద్ధ్యం, ట్రాక్టర్లలో డీజిల్ పోయించడం, వాటికి మరమ్మతులు, బ్లీచింగ్, బయోటెక్స్, ఫాగింగ్ తదితర సామాగ్రి కోసం దుకాణాల్లో ఖాతాలు పెట్టామని, సకాలంలో బిల్లులు చెల్లించపోవడంతో మళ్లీ సామాగ్రి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను వెంటనే క్లియర్ చేయించడంతో పాటు ట్రెజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లింపులు జరిపేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా మండల అభివృద్ధి అధికారులకు పంచాయతీ కార్యదర్శులు మొరపెట్టుకుంటున్నారు. వినతి పత్రాలను అందజేస్తున్నారు. అయినా ఫలితం కనిపించడం లేదు.

భారీ వర్షాలతో కుదేలు

ఇటీవల మొంథా తుఫాను ప్రభావం వల్ల కురిసిన భారీ, అతి భారీ వర్షాలతో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. సహాయక చర్యలు చేపట్టేందుకు డబ్బులు లేక పంచాయతీలు చేతులెత్తేశాయి.

పంచాయతీలకు నిధులు ప్రధానంగా ప్రజలు పన్నుల, ఇతర ఆదాయాల నుంచి సమకూరుతాయి. ఎంపీలు, ఎమ్మెల్యేల కోటా నుంచి కూడా పంచాయతీలకు నిధుల కేటాయింపు జరుగుతుంది. పంచాయతీలకు ఈ నిధులే ఆధారం. పంచాయతీలోని ఆవాసాలను బట్టి ఆయా పంచాయతీలకు ఈ నిధులు సమకూరుతాయి. రాక కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు విడుదల అవుతాయి. ఆర్థిక సంఘం నుంచి ఆయా గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన సరాసరి రూ. 10 నుంచి రూ. 15 లక్షల వరకు నిధులు అందుతాయి. ఈ నిధులు నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాలో జమవుతాయి. పరిశ్రమలు, గనులు ఉన్న గ్రామ పంచాయతీలకు వాటి నుంచి రాయల్టీ రూపంలో కూడా నిధులు వస్తాయి. రైస్ మిల్లులు, కంకరమిల్లులు, ప్రైవేటు సెక్టార్, కార్పొరేట్ కంపెనీలు ఇతర సంస్థల నుంచి ఈ నిధులు సమకూరుతాయి.

జల్లెడలా జిల్లా..



- వరంగల్ జిల్లాలో విచ్చలవిడిగా బోరు బావుల తవ్వకాలు
- నిబంధనలు పాటించని యజమానులు
- పట్టించుకోని అధికారులు
- అభాసుపాలవుతున్న వాల్టా చట్టం

మామునూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో విచ్చలవిడిగా బోరుబావులు తవ్వుతున్నారు. భూమిని జల్లెడలా మార్చేస్తున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి రోజుకు 100 నుంచి 130 బోర్లు వేస్తున్నారు. ఇంటింటికీ బోర్లు ఉన్నా రికార్డుల్లో మాత్రం 10 శాతం కుడా నమోదు కావడం లేదు. అనుమతి లేకుండా ఇష్టారీతిన బోర్ల తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు పంటపొలాలకు పరిమితమైన బోర్లు ఇప్పుడు ఇళ్లలో వేస్తున్నారు. బోర్లు తవ్వాలంటే సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలి. కాని ఈ నిబంధనను ఎవరూ పాటించడంలేదు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవనే మాటలు ఆచరణకు నోచుకోవడం లేదు.



బోర్లకు డిజిటల్ మీటర్లు తప్పనిసరి..

పరిశ్రమలు, అపార్ట్‌మెంట్లు, ఇతర పెద్ద ప్రాజెక్టులకు సంబంధించిన బోరుబావులకు విధిగా డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్లు ఉండాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. ఆ మీటర్లు భూగర్భ జలాల వాడకాన్ని లెక్కించడానికి సహాయపడతాయి. దీన్ని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ (సీజీడబ్ల్యూఏ) లేదా రాష్ట్రస్థాయి అధికారులు పర్యవేక్షించాలి.

పన్నులు వసూలు చేయడంలో విఫలం..

వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు ఎన్ని బోర్లు ఉన్నాయో అధికారుల వద్ద లెక్కలు లేవు. 2023 జీవో ప్రకారం కమర్శియల్ బోర్లకు ప్రభుత్వం పన్ను విధించింది. ఈ ఏడాది 50 లక్షలు వసూలు చేయాలని టార్గెట్ విధించింది. కాని రూ.12 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ- నగర పరిధిలో మునిసిపల్ అధికారులు పన్నులు వసూలు చేయాలి. కాని కమర్షియల్ బోర్లు భూగర్భజలశాఖకు సంబంధించినవని చెప్పి పై రెండు శాఖల అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

పరిమితికి మించి వాడితే ఫీజులు కట్టాల్సిందే..

కమర్షియల్ బోరు బావులకు ప్రభుత్వం పన్ను విధించింది. పరిమితికి మించి నీటిని వాడితే ప్రాంతాన్ని బట్టి అదనంగా తోడే నీటికి ఫీజులు కట్టాల్సిందేనని జీవో జారీ చేసింది.

అధికారుల చర్యలు శూన్యం..

బోరు వేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. వాల్టాచట్టం ప్రకారం బోరుకు పర్మిషన్, ఇంకుడు గుంతలు, నిర్ణీత దూరం వంటి నిబంధనలు పాటించాలి. లేదంటే కఠిన చర్యలు ఉంటాయి. అవసరమైతే బోరుబావిని సీజ్ చేసే అధికారాన్ని వాల్టాచట్టం కల్పించింది. కాని అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. నామమాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

శాఖల మధ్య సమన్వయం లేదు..

మేరు అశోక్, భూగర్భ జలశాఖ అధికారి



జిల్లా పరిధిలో ఇప్పటివరకు 116 కమర్షియల్ బోరుబావులకు మాత్రమే ఎన్‌వోసీలు ఇచ్చాం. ఇంకా ఐదు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా వారికి నోటీసులు ఇస్తే చాంబర్ ఆఫ్ కామర్స్ వారు అడ్డుపడుతున్నారు. ఇందులో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకనే టార్గట్ రీచ్ కాలేకపోతున్నాం. దానికి తోడు సిబ్బంది తక్కువ ఉండటంతో ఫీల్డ్ వర్క్ నెమ్మదిగా కొనసాగుతోంది.



ఇంకా నిర్మాణం పూర్తి కాని ఆర్చి

కాళేశ్వరా.. మన్నించు..

- సరస్వతి పుష్కరాల పనులు ఇప్పటివరకు పూర్తికాని వైనం
- నిద్రావస్థలో ఎండోమెంట్ అధికారులు, కాంట్రాక్టర్లు
- పట్టించుకోని పాలకులు

మహదేవపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరమశివుడి సన్నిధిగా పేరొంది.. భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతున్న కాళేశ్వరాలయానికి నిత్యం భక్తుల రాక పెద్ద ఎత్తున ఉంటుంది.. విజయవంతంగా సరస్వతి పుష్కరాలు సైతం ముగిశాయి. అతిశయోక్తి ఏమిటంటే సరస్వతి పుష్కరాలకు మొదలైన అభివృద్ధి పనులు ఇంతవరకు పూర్తికాకపోవడం విడ్డూరం. ఎండోమెంట్ ఆధ్వర్యం లో చేపట్టిన రూ.3 కోట్ల పనులు ఇంకా నత్త నడకన సాగుతూనే ఉన్నాయి. 2027 గోదావరి పుష్కరాల వరకైనా ఈ ప నులు పూర్తయ్యేనా అని ప లువురు విమర్శిస్తున్నారు. అన్ని ఉన్నా అల్లుడి నోట్ల శని ఉన్నట్లు నిధులు మంజూరైనా ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉంది.

ఇంకా పూర్తి కాని ఆర్చి పనులు

పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చి పనులు ఇంకా పూర్తి కాలేదు.. అంతేగాకుండా ఆర్చి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్ర రహదారికి అడ్డంగా ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.40 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఆర్చి నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కల్యాణ మండపం షెడ్డు , శారద మండపం కల్యాణ కట్ట పనులు, కల్యాణం రేకుల షెడ్డు, ప్రసాద కౌంటర్ నిర్మాణ పనులు ఇంకా అలాగే ఉండిపో యాయి. అధికారులు, కాంట్రాక్టర్లు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో ఎవరికి అర్థం కాని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకుని సరస్వతి పుష్కరాల పనులు పూర్తి చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ముక్కోటి గొంతుకలు శోకతప్తం

(5వ పేజీ తరువాయి)

పాటల్లో కొన్ని. తనను ఆదరించి అక్కున చేర్చుకున్న ఓ తల్లి మరణించిన సందర్భంలో రాసిన ఎచూడ చక్కని తల్లి.. చుక్కల్లో జాబిల్లి' పాట గుండెల్ని పిండేస్తుంది. అందెశ్రీని కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

పలువురు సాహిత్యకారుల సంతాపం

అందెశ్రీ మృతి పట్ల ఓరుగల్లు సాహితీ లోక దిగ్భ్రాంతికి లోనయింది. ఆయన మృతి పట్ల పలువురు కవులు, రచయితలు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మరణ వార్త తెలియగానే హైదరాబాద్‌కు హుటాహుటిన తరలి వెళ్లారు. కడసారి కన్నీటితో వీడ్కోలు పలికారు. అం దెశ్రీతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వరంగల్‌లో జరిగిన పలు సాహితీ కార్యక్రమాల్లో ఆయనతో వేదిక పంచుకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనల పట్ల స్పందించి ఆశువుగా కవిత్వం చెప్పిన కవి పండితుడు అందెశ్రీ అని కాళోజి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిళ్ల రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి అన్నారు. ఆయన సాహిత్యానికి చేసిన కృషికి గుర్తింపుగా కాళోజీ ఫౌండేషన్ ప్రజాకవి పురస్కారాన్ని ప్రదానం చేసిందని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ మృతి పట్ల ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్, కవులు పొట్లపల్లి శ్రీనివాస రావు, గంటా రామిరెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, పందిళ్ల అశోక్ కుమార్, ఆగపాటి రాజ్ కుమార్ తదితరులు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ రాసిన అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ మృతి పట్ల సహృదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గిరిజన మనోహర్ బాబు, పోతన విజ్ఞాన పీఠం, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య హనుమకొండ అధ్యక్షుడు ఓడపల్లి చక్రపాణి, వరంగల్ అధ్యక్షుడు మాడిశెట్టి రమేష్, తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఉపేంద్ర శర్మ, ఆర్య వైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు గట్టు మహేష్‌బాబు సంతాపం ప్రకటించారు. అందెశ్రీ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మహనీయుడని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి కవులు, కళాకారులకే కాదు యావత్ తెలంగాణకు తీరని లోటని పేర్కొన్నారు.

మానుకోటతో అనుబంధం

మహబూబాబాద్ టౌన్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజా కవి అందెశ్రీ మానుకోట జిల్లాకు అనేక మార్లు వచ్చి సభల్లో తన పాటల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి ఉద్యమం వైపు నడిపించారు. 2008, 2009లో రెండు పర్యాయాలు స్థానిక సమైక్య జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో జరిగిన పలు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2009 సంవత్సరంలో జిల్లాకు వచ్చిన సమయంలో కురవి వీరభద్రస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. చిన్న గూడూరుకు వెళ్లి ప్రముఖ కవి దాశరధి కృష్ణమాచార్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పులకించిన జీడికల్

- కనులపండువగా సీతారాముల కల్యాణం
- మార్మోగిన రామనామ స్మరణ
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శ్రీహరి
- పెద్ద సంఖ్యతో తరలి వచ్చిన భక్తులు

లింగాలఘణపురం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండో భద్రాద్రిగా పేరుగాంచిన వీరాచల జీడికల్ పుణ్యక్షేత్రం.. సోమవారం కార్తీక మాస తిరుక్కల్యాణ మహోత్సవ వేళ 'భక్త'గిరిగా పోటెత్తింది. కార్తీకమాస పునర్వసు నక్షత్రాన జీడికల్‌లో బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా తిరుక్కల్యాణం కమనీయంగా సాగింది.. మంగళవాయిద్యాలు మార్మోగుతుండగా స్వామివారిని పల్లకిలో మాడవీధుల గుండా ఊరేగింపుగా తీసుకొచ్చారు. తిరుక్కల్యాణానికి ఉభయ వేదాంత ప్రవచకులు విజయసారథి ఆచార్య, శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో వేదపండితులు సంకల్పం చేసి సర్వ విఘ్నశాంతికోసం విశ్వక్సేన పూజలు, పుణ్యాహవచనం తంతును నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా సీతారామచంద్రులకు రక్షసూత్రాలను తొడిగి జగత్కల్యాణార్థం మంత్రధార పూర్వకంగా కన్యాదానం చేశారు. దేవతామూర్తులకు జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని శిరస్సుపై పెట్టిన పండితులు మాంగళ్యపూజల నడుమ అమ్మవారికి స్వామివారి చేత మాంగళ్య ధారణ చేయించి శుభలగ్న కైంకర్యాలను కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో 58 జంటల పుణ్యదంపతులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే..

ఆలయ సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ పర్యవేక్షణలో భారీ ఏర్పాట్ల నడుమ వేడుకలు జరిగాయి. కల్యాణం అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి జీడికల్ ఆలయాభివృద్ధికి రూ.2లక్షల విరాళం అందజేశారు.



తలంబ్రాలు, పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే కడియం

కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీమ్ శర్మ, దేవస్థానం చైర్మన్ ఏలె మూర్తి, తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వ్యయసాయ మార్కె ట్ కమిటీ వైస్‌చైర్మన్ కొల్లూరు శివకుమార్, చిల్పూరు గుట్ట దేవస్థా నం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పోరెడ్డి మల్లారెడ్డి, ఆలయ సిబ్బంది భరత్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

భారీ ఏర్పాట్లు..

జనగామ జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, ఖమ్మం, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రిభువనగిరి, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి హాజరైన అశేష భక్తజనుల నడుమ రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈవో చిందం వంశీ భారీ ఏర్పాట్లను చేపట్టారు. భక్తులు గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్టు దర్శనం కోసం బారులు తీరిన క్రమంలో ఎలాంటి తోపులాటలు జరగకుండా బారీకేడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, అత్యవసర వైద్య సదుపాయాలు, ఫైరింజన్, పోలీస్‌కంట్రోల్ రూమ్, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డీసీపీతో సహా ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి సహా నలుగురు సీఐలు, ఎస్సై శ్రవణ్‌కుమార్ సహా ఎనిమిది మంది ఎస్సైలు, నలుగురు ఏఎస్సైలు, 50 మంది కానిస్టేబుళ్లు, 25 మంది హోంగార్డులు, 25 మంది ఎన్‌సీసీ వలంటీర్లు విధుల్లో పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆధునిక సాధనాలతోనే పరిశోధనలు సాధ్యం

ఎన్ఐటీ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి



ఆధునిక సాంకేతిక పరికరాల వివరాలు తెలుసుకుంటున్న బిద్యాధర్ సుబుధి, తదితరులు

హనుమకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పరిశోధనలను ప్రోత్సహించడంలో, సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ఆవిష్కరణలను పెంపొందించడంలో ఆధునిక విశ్లేషణాత్మక సాధనాలు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటాయని వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అన్నారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్ నిట్‌లో ప్రపంచ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం యాక్సెసబుల్ అనలిటకల్ టెక్నాలజీ (ఏఏటీ-25)పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నిట్ క్యాంపస్‌లో సాంకేతిక ప్రదర్శనను కూడా నిర్వహించారు. సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్), థర్మోఫిషర్ సైంటిఫిక్, కీసైటీ టెక్నాలజీస్, నెట్‌వెబ్ టెక్నాలజీస్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించాయి. శాస్త్రీయ పరికరాల రంగంలో ప్రముఖ కంపెనీలు అయిన థర్మోఫిషర్ సైంటిఫిక్, కీసైట్ టెక్నాలజీస్, నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఈ కంపెనీలు తమ అత్యాధునిక, విశ్లేషణాత్మక సాంకేతికలతో తాజా పురోగతులను ప్రదర్శించాయి. వరంగల్ ఎన్ఐటీ, సమీప కళాశాలల నుండి అధ్యాపకులు, విద్యార్థులు సహా 150 మంది కిపైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సీఆర్ఐఎఫ్ హెడ్ ప్రొఫెసర్ వీరేష్ బాబు, కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కాశీనాథ్, ఈసీ విభాగం ప్రొఫెసర్ ఆంజనేయులు, సాంకేతిక అధికారులు గొల్లపల్లి రామ సంజీవిని, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి భూములు ఇవ్వలేం..

మేడారం రైతుల నిరసన



తమ భూముల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

తాడ్వాయి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాలయ అభివృద్ధికి అధికారులు అడుగుతున్న భూమిని తాము ఇవ్వలేమని ఆదివాసీ రైతులు సోమవారం తేల్చిచెప్పారు. దేవస్థానం వెనకాలగల 19ఎకరాల 27గుంటల భూమిని మాస్టర్ ప్లాన్ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. అయితే గతంలోనే రైతులతో మేడారంలో సమావేశమైన అధికారులు రైతులతో చర్చించినప్పటికీ సఫలం కాలేదు. మొత్తం 43 మంది రైతులు ఉండగా ప్రభుత్వ భూములు కలిగిన 16మంది రైతులను అధికారులు ఒప్పించి మిగతా వారిని కూడా ఒప్పుకునేలా ఇబ్బంది పెడుతున్నారని నిరసనకు దిగడం జరిగిందన్నారు. తాతలముత్తాత నుంచి జ్ఞాపకార్థంగా వస్తున్న భూములు కోల్పోవడం తమకు ఇష్టం లేదని వాపోతున్నారు. భూ సేకరణ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మేడారం పంట నష్ట పరిహార సాధన సమితి అధ్యక్షుడు కృష్ణార్జున్, రైతులు రమేష్, జనార్దన్, యాదగిరి, దీపక్, పాపారావు, లక్ష్మణ్‌రావు, రామేశ్వరావు, సుధీర్, వినోద్, లక్ష్మణ్ తదితర రైతులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో
దీపోత్సవం

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా నగరంలోని శివాలయా ల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, వ్రతాలు, ఆచరించారు. సాయంత్రం దేవాలయాల్లో కార్తీక మాసం దీపోత్సవాలను నిర్వహించారు. చారిత్రక భద్రకాళి దేవాలయంలో పూజలు, దీపారాధనలు జరిపించారు. భద్రేశ్వరుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, బిల్వార్చన, పుష్పార్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. -ఆంధ్రజ్యోతి, వరంగల్ కల్చరల్



పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

హనుమకొండ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రాలు తిరుపతి, శ్రీశైలంకు వెళ్లే భక్తుల కోసం వరంగల్ -1 డిపోకు చెందిన హనుమకొండ బస్టాండ్ నుంచి ఏసీ రాజధాని బస్సులను ఏర్పాటు చేసినట్లు సోమవారం వరంగల్ ఆర్ఎం డి. విజయభాను ఒక ప్రకటనలో తెలి పారు. నవంబరు 14 నుంచి ఆర్టీసీ ఏసీ బస్సులు ప్రత్యేక సర్వీసులు హనుమకొండ బస్టాండ్ నుంచి ఉదయం 8 .40 గంటలకు బయల్దేరి తిరు పతికి రాత్రి 11 గంటలకు చేరుకుంటుంది. అలాగే శ్రీశైలంకు హనుమకొండ బస్టాండ్ నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి ఏసీ రాజధాని బస్సు శ్రీశైలంకు సాయంత్రం 6 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రేటర్ వరంగల్ ప్రయాణికులు, భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపు నిచ్చారు.

రుద్రేశ్వరుడికి భస్మ ధూళికాభిషేకం

- కార్తీక మాస మూడో సోమవారం విశేష పూజలు
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



హనుమకొండ కల్చరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిలో కార్తీకమాసం మూడవ సోమవారం ప్రాతఃకాల ఉత్తిష్ఠ గణపతికి నవరసాలతో అభిషేకం నిర్వహించారు. రుద్రేశ్వర స్వామివారికి అంగన్యాస, కరన్యాసములతో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం 51 కిలోల భస్మంతో భస్మోధూలికాభిషేకం జరిపారు. 200 మంది దంపతులు సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. గజమాలతో రుద్రేశ్వరుడిని అలంకరించారు. సాయంత్రం భజన కార్యక్రమం, చతుర్వేద పారాయణం, నీరాజన మంత్ర పుష్పం, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్ర శర్మ, సందీప్ శర్మ, ప్రణవ్ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో డి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించబోం'

కేయూ క్యాంపస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని ఉమ్మడి వరంగల్‌జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ వద్దకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం కేయూ దూరవిద్యకేంద్రం వద్ద బీసీ జేఏసీ కేయూ చైర్మన్ ఆరెగంటి నాగరాజుగౌడ్ నేతృత్వంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ధర్మ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాల్, చిర్రా రాజుగౌడ్ దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లోచేర్చాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమం సాగుతోందని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఉద్యమం చేపడుతామని చెప్పారు. పోరాటం ఉగ్రరూపం దాల్చక ముందే కేంద్రం స్పందించి రిజర్వేషన్లను చేపట్టాలన్నారు. కాగా దీక్షలను కేయూతెలుగు విభాగాధిపతి డాక్టర్ మామిడి లింగయ్య నిమ్మరసాన్నిఇ చ్చి విరమింపచేశారు. ఈకార్యక్రమంలో బీజీ జేఏసీ వైస్ చైర్మన్ బొనగాని యాదగిరిగౌడ్, దాడి మల్లయ్య యాదవ్, దొడ్డపల్లి రఘుపతి, బక్కిఅవినాశ్, బచ్చు ఆనందం, భీమగాని యాదగిరిగౌడ్, మంద సారంగపాణి, శ్రీనివాసరావు, ఆకుతోట శ్రీవాఆసులు, సంగాని మల్లేశ్వర్, కృష్ణయాదవ్, సంకినేని వెంకన్న, రమేశ్, సుమన్, అజయ్, నాగరాజు, రాజశేఖర్, రాజ్‌కుమార్, నితిన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జనసంచార ప్రాంతాల్లో వీధి కుక్కలు లేకుండా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో వీధి కుక్కల నియంత్రణపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జనసమూహ ప్రాంతాలైన పాఠశాలలు, రైల్వే, బస్‌స్టేషన్లు, ఆస్పత్రులు, పార్కులు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు సం చరించకుండా కోర్టు నిబంధనల ప్రకారం తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఏడబ్ల్యూబీఐ) సూచనల మేరకు 66 డివిజన్‌ల పరిధిలో వీధి కుక్కల నియంత్రణ కోసం మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్నారు. టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల సిబ్బం ది సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్ఈ సత్యనారాయణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్‌వో రమేష్, ఇన్‌చార్జి సీపీ రవీందర్, డిప్యూటి కమిషనర్ ప్రసన్న రాణితో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల భూమిని కాపాడాలి

కలెక్టరేట్ ఎదుట బాధితులు ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధిత మహిళలు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండలం మునిపల్లి గ్రామంలోని డ్వాక్రా సంఘాల 18 గ్రూపులకు చెందిన ప్రభుత్వ భూమిని నద్దునూరి నాగరాజు అనే వ్యక్తి కబ్జా చేశాడని, మహిళా సంఘాలకు కేటాయించిన భూమిని కాపాడాలని మునిపల్లికి చెందిన శ్రీ మహాలక్ష్మి గ్రామ ఐక్య సంఘం సభ్యులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. 20 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని, అప్పటి నుండి పట్టా చేయాలని కోరుతున్నా చేయడం లేదని, ఇప్పటికైనా ఈ భూమిని తమపేరు మీద పట్టా చేసి చూడాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

తైక్వాండోలో సత్తా చాటిన ఓరుగల్లు క్రీడాకారులు



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఓరుగల్లు జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో ఉత్తమ ప్రతిభతో స్వర్ణ, రజత పతకాలను కొల్లగొట్టి జిల్లా కీర్తి, ప్రతిష్ఠలను చాటారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 41వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఓరుగల్లుకు చెందిన పలువురు క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి స్వర్ణ, రజత పతకాలను సాధించారు. అండర్-73 కేజీల బరువు విభాగంలో స్నేహ అత్యుత్తమ ప్రతిభతో మెరిసి ప్రథమ స్థానంతో పసిడి పతకాన్ని సాధించి డిసెంబరు 2వ వారంలో హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఎంఏ తైక్వాండో అకాడమీ చీఫ్ కోచ్ ఎల్లావుల గౌతమ్‌యాదవ్ తెలిపారు. అదే విధంగా అండర్-87కేజీల విభాగంలో శ్రీయాంశ్ రజత పతకం, అండర్-80కేజీల విభాగంలో పి. తరుణ్ రజత పతకం,అండర్-58కేజీల విభాగంలో రిషిత రజత పతకం సాధించినట్లు గౌతమ్‌యాదవ్ వెల్లడించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్, సీనియర్ తైక్వాండో క్రీడాకారులు అభినందించారు.

పరీక్ష ఫీజుల చెక్కులు అందజేత

రాంనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మోదీ గిఫ్ట్‌లో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన వేతనంతో పరీక్ష ఫీజును చెల్లించారు. ఈ మేరకు హనుమకొండ, కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, గంగిడి కృష్ణారెడ్డిలు సోమవారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీషకు పరీక్ష ఫీజుల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సంద్ర మధు, ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు శ్రీకాంత్, రుత్విక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి సమాజానికి తీరని లోటు

- భారత్ బచావో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వెంగళ్‌రెడ్డి
- ప్రజాకవి, ప్రముఖ గేయ రచయితకు ఘన నివాళి

వడ్డేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా కవి, తెలంగాణ ఉద్యమ గొంతుక, ప్రముఖ గేయ రచయిత డాక్టర్ అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని భారత్ బచావో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంగళ్ రెడ్డి, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత డాక్టర్ మార్క శంకర్‌నారాయణ అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అందెశ్రీ సంతాప సభను సోమవారం నిర్వహించారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు బూర భిక్షపతి, పల్లేరు వీరస్వామి, డాక్టర్ సంజీవయ్య, ఎండి రాజ్‌మహ్మద్, ఉదయ్‌సింగ్, బి. రమాదేవి, కుమారస్వామి, ప్రవీణ్, వెంకట్రాజం, వెంకన్న, గజ్జెల స్వరూప, గోపు సోమయ్య, సుమ తదితరులు పాల్గొన్నారు.

- ప్రజాకవి అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సమాజం దిగ్భ్రాంతికి గురైందని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కార్పెంటర్స్ అసోసియేషన్ జిల్లా నేతలు అలుగోజు కృష్ణమూర్తి, వీణవంక సదానందచారి పేర్కొన్నారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- అందెశ్రీ ఆకస్మిక మృతి సాహిత్య లోకానికి తీరని లోటని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో అందెశ్రీ సంతాప సభను మెపా జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో..

బాలసముద్రం : న్యూ డెమొక్రసీ పార్టీ నాయకులు సోమవారం కాళోజీ సెంటర్‌లో అందెశ్రీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదని నివాళులర్పిస్తూ అందెశ్రీ కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగుల దయాకర్, ఎలకంటి రాజేందర్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, మహ్మద్‌ఖాన్, కమలాకర్ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

న్యూశాయంపేట : అందెశ్రీ అకాల మరణం తీరనిలోటని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం అందెశ్రీ చిత్రపటానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మద్దెల ఎల్లేష్, అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టెపాక రవి, అశోక్‌స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి, గుంటి రాజేందర్, నర్సయ్య, అలువాల రాజు పాల్గొన్నారు.

జైభీం అక్షర నివాళి

వడ్డేపల్లి (ఆంధ్రజ్యోతి): జయజయహే తెలంగాణ గేయ రచయిత డాక్టర్ అందెశ్రీకి జైభీం జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్ ఆధ్వర్యంలో హనుమకొండ వడ్డేపల్లిలోని జైభీం కార్యాలయంలో సంతాప సభను సోమవారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సమాజానికి, సాహిత్య లోకానికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో జైభీం జిల్లా నాయకులు ఇల్లందుల భాస్కర్, దుప్పటి కోటి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరసం నాయకులు

టీడీపీ ఆధ్వర్యంలో..

కవి, రచయిత అందెశ్రీ మృతి సమాజానికి తీరని లోటని తెలుగుదేశం పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ ప్రతినిధి అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, జిల్లా నాయకులు ఎండి రహీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో..

కేయూ క్యాంపస్ : ప్రపంచ వ్యాప్తంగా గొప్పపేరొందిన తెలంగాణ ఆశుకవి డాక్టర్ అందెశ్రీ గొప్పవారని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మందశ్రీకాంత్ కొనియాడారు. సోమవారం కేయూ మొదటి గేటు వద్ద ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో అందెశ్రీ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి కొవ్వత్తులతో ఘనంగాఅందెశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ కీలకమన్నారు.తెలంగాణ గీతం జయ జయహే తెలంగాణను రచించి గొప్పతనాన్ని చాటారని అన్నారు.

ఎంజీఎంలో సౌకర్యాలు మెరుగుపర్చండి

వరంగల్ మెడికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదలకు వైద్య సేవలు అందించే ఎంజీఎం ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు సోమవారం ఎంజీఎం సూపరింటెండెంట్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో పేద రోగులకు సరైన వైద్య సదుపాయాలు అందటం లేదని వస్తున్న వార్త కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ కొరతగా ఉండటం ల్యాబ్ సౌకర్యాలు, టెక్నీషియన్లు, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎంజీఎం ఆస్పత్రిపై కలెక్టర్, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ పాలడుగుల సురేందర్, విజయ్ కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న శేషు తదితరులు

ఏఆర్‌ల పదోన్నతుల ప్రక్రియకు శ్రీకారం

సీనియార్టీ లిస్టును ప్రకటించిన కేయూ అధికారులు

కేయూ క్యాంపస్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ల ప్రమోషన్ల ప్రక్రియకు వర్సిటీ ఉన్నతాధికారులు సోమవారం శ్రీకారం చుట్టారు. గత కొన్నేళ్లుగా వర్సిటీలో ఏఆర్‌ల ప్రమోషన్లు చేపట్టకపోవడంతో సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను సోమవారం ఆంధ్రజ్యోతి మినిలో 'కేయూ ఏఆర్‌ల ప్రమోషన్లలో మీనమేషాలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది.

దీంతో సోమవారం వర్సిటీ ఉన్నతాధికారులు ఏఆర్‌ల ప్రమోషన్ల లిస్టును ప్రకటించారు. వా రం రోజుల్లో అభ్యంతరాలను స్వీకరించి ప్రమోషన్ల షెడ్యూ ల్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఎట్టకేలకు ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టనుండటంతో వర్సిటీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత

కాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హౌస్ ఆఫ్ జాయ్ అనాథాశ్రమం నుంచి తప్పిపోయిన మిత్రుడిని వెతికి పట్టుకుని పోలీసులకు అప్పగించి స్నేహబంధాన్ని చాటుకున్నాడు ఓ వ్యక్తి.. కాజీపేట ఎస్సై లవణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం బిల్ట్ కమలాపురానికి చెందిన రుద్రోజు నటరాజు తల్లిదండ్రులు గతంలో చనిపోయారు. దీంతో ఫాతిమానగర్‌లోని అనాథాశ్రమంలో కాజీపేటకు చెందిన అతడి మిత్రుడు పర్యావరణ ఉద్యమకారుడు ప్రకాశ్ చేర్పాడు. అయితే నటరాజు అక్కడ నుంచి ఆరు నెలల క్రితం తప్పిపోయాడు. అప్పటినుంచి ప్రకాశ్ తన స్నేహితుడి కోసం వెతుకుతున్నాడు. సోమవారం నటరాజు కేయూ, భీమారం ప్రాంతాల్లో సంచరిస్తున్నాడన్న సమాచారం తెలుసుకుని ఆయనను కాజీపేట ఎస్సైకి, ఫాతిమానగర్‌లోని హౌస్ ఆఫ్ జాయ్ ప్రతినిధి సునద్‌కు అప్పగించారు. ప్రకాశ్‌ను పోలీసులు అభినందించారు.

స్థలాన్ని కాపాడండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎన్‌జీవోస్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ టీఎన్‌జీవోస్ కాలనీ 100ఫీట్ల రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి గుడి ఎదురుగా ఉన్న టీఎన్‌జీవోస్ యూనియన్‌కు సంబంధించిన కమ్యూనిటీ స్థలాన్ని కాపాడాలని టీఎన్‌జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓస్ నాయకులు సోమవారం కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఉన్న టీఎన్‌జీఓస్ యూనియన్‌కు సంబంధించిన భూమిని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కబ్జాచేసే వారి నుండి భూమిని కాపాడి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేషన్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రామునాయక్, జిల్లా నాయకులు బింగి సురేష్, గౌతమ్‌లు ఉన్నారు.

సంబురంగా ఆర్యవైశ్యుల

కార్తీక వన భోజనాలు

హసన్‌పర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సోమవారం భీమారం సమీపంలోని మామిడి తోటలో జరిగిన జిల్లా ప్రథమ వార్షికోత్సవం, కార్తీక వనభోజనాలు సంబురంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు తోట సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ హాజరై వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ముందుగా శివలింగం, ఉసిరి చెట్టు, గోమాతను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆటపాటలతో, దాండియా, తంబోలాతో పాటు వివిద సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను కేరింతలతో ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దొడ్డ మోహన్‌రావు, కోశాధికారి శ్రీరాం రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెనిశెట్టి రగు, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, యూత్ అధ్యక్షులు సతీష్, సేవాదళ్ అధ్యక్షులు నాగభూషణం, యూత్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్రకౌన్సిల్ మెంబర్లు, తదతరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిని

భీమారం విద్యార్థిని భవ్యశ్రీ

హసన్‌పర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎస్.భవ్యశ్రీకి వ్యాసరచన విభాగం పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా టీసాట్, టీఎస్ జీహెచ్ఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక జిల్లా స్థాయి వ్యాసచరన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో ప్రతిభకనబర్చిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో జరిగిన విద్యార్థుల అభినందన సభలో ప్రశంసించి సర్టిఫికెట్లు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ఎస్.భవ్యశ్రీతో పాటు వక్తృత్వ పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని వి.అక్షిత జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లు చైతన్య, రమాదేవిలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

డేటాతోనే ప్రణాళికలు అమలు చేయాలి

హసన్‌పర్తి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్ డేటా ఆధారంగానే విద్యా నాణ్యతకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎల్లాపూర్ పరిధి బావుపేట క్రాసురోడ్డులోని ఎస్‌పీఆర్ ఎక్సలెన్స్ స్కూల్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాళ్లకు సోమవారం యూడైస్ ప్లస్ డేటాపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యూడైస్ ప్లస్ డేటా ఆధారంగానే ప్రభుత్వం విద్యా నాణ్యతకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. పాఠశాలల్లో మెరుగుపర్చాల్సిన మౌలిక వసతులపై అంచనావేయడానికి ఈ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ ప్రధానోపాధ్యాయుడు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని తమ పాఠశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లోని డేటా క్యాప్చర్ ఫార్మాట్ (డీసీఎఫ్) ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, సంపత్, రవీందర్, రవికుమార్, ఆర్‌పీలు, రీసోర్స్ టీచర్లు మధుకర్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో అంతర్జాతీయ

అకౌంటింగ్ దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ (కేడీసీ)లో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రపు శ్రీనివాస్ మాట్లాడారు. లూకాపాసియోలి జంట పద్దు విధానాన్ని రూపొందించి నవంబరు 10న మొట్ట మొదటిగా ప్రచురించడంతో ఈ రోజును అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ హెడ్ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, అధ్యాపకులు చిన్న, యాకూబ్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, రవికుమార్, శ్రీను, నవీన్, సునీత, వినయ్‌కుమార్, బాలచందర్, మాధవ్‌శంకర్, బంగారం తదితరుల పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

కాజీపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సోమవారం కాజీపేట తిలక్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేర్ అలేటి సుధాకర్ సూక్ష్మ, సంస్థ వ్యవస్థాపకుడు ఆజాద్ బాబు ఘంటాలు పాల్గొని మాట్లాడారు. చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమల పాత్ర, ప్రయోజనాలపై వివరించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ అదనపు డైరెక్టర్ దినేశ్ కుమార్, హనుమకొండ జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్, జిల్లా లీడ్ మేనేజర్ జన్ను మహేందర్ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా అందించే వివిధ రుణ పథకాలు, సబ్సిడీ ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక బృందాలు, పాల్గొని పథకాలగురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్దఎత్తున హాజరయ్యారు.



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇందిరా నగర్‌లో చెట్ల నరికివేత

జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు కాలనీ వాసుల ఫిర్యాదు

వడ్డేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని ఇందిరా నగర్‌లో అనుమతి లేకుండా చెట్లను నరికిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డువస్తున్నాయనే సాకుతో కాలనీకి చెందిన కొందరు చెట్లను నరికి వేశారు. పచ్చని చెట్లే ప్రగతి మెట్లు అనే బోర్డులను ఈ కాలనీలో ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. నీడనిచ్చే ఏపుగా పెరిగిన చెట్లను విచక్షణారహితంగా మిషన్‌తో కట్ చేసి తొలగించారని కాలనీకి చెందిన కొందరు సోమవారం జీడబ్ల్యూఎంసీలో కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. అంతేగాకుండా జిల్లా అటవీ శాఖ అధికారిని సైతం కలిసి చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో ఇందిరానగర్‌కు చెందిన దొంగర శ్రీనివాస్, పూరెళ్ల రవికిరణ్, సోమేశ్వర్‌రావు, సాయికుమార్ ఉన్నారు.



ఇందిరా నగర్‌లో నరికివేసిన చెట్లు

ఆంధ్రజ్యోతి
నవ్య
డాక్టర్
9
మంగళవారం • 11 నవంబరు 2025

విమెన్స్ హెల్త్



గర్భాశయం జారితే?

గర్భాశయం కిందకు జారితే అసౌకర్యంతో పాటు మూత్రాశయ, విసర్జక వ్యవస్థలకు కూడా ఆటంకం కలుగుతుంది. కాబట్టి ఈ సమస్యను సకాలంలో సరిదిద్దుకోవాలంటున్నారు గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్ డాక్టర్ పూజిత సూరనేని.

గర్భాశయం కిందకు జారే పరిస్థితికీ వయసుకూ సంబంధం లేదు. 23 ఏళ్ల యువతుల్లో కూడా ఈ పరిస్థితి తలెత్తవచ్చు. బాల్యం నుంచి కండరాల సమస్యలు ఉన్న యువతుల్లో ఈ సమ స్య తలెత్తే అవకాశాలు ఎక్కువ. సిజేరియన్ ప్రసవాలు చేయించుకున్న మహిళలతో పోలిస్తే, సాధారణ ప్రసవం జరిగిన మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. అలాగని ప్రతి మహిళా ఈ సమస్యను ఎదుర్కొంటుందని అనుకోడానికి వీల్లేదు. కండరాలు, కొల్లాజన్, కణజాలాల పటుత్వం తక్కువగా ఉన్న వాళ్లు, ప్రసవంతో కటి కండరాలు బలహీనపడిన వాళ్లలో, 50 ఏళ్లు పైబడిన తర్వాత ఈ సమస్య తలెత్తే అవకాశాలు ఎక్కువ.

వీళ్లలోనే ఎందుకంటే?

సాధారణ ప్రసవమైన మహిళల్లో ఈ సమస్య తలెత్తే అవకాశాలు కాస్త ఎక్కువ. అయితే వైద్యుల పర్యవేక్షణలో సాధారణ ప్రసవం జరిగినప్పుడు, ఎపిషాటమీ అనే కోత సహాయంతో, గర్భాశయం ఒత్తిడికి లోనవకుండా, ప్రసవం సుఖంగా జరిగిపోయేలా వైద్యులు తోడ్పడతారు. అలాగే గర్భంతో సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి కుంచించుకుపోడానికి ప్రసవానంతరం ఆరు వారాల సమయం పడుతుంది. కాబట్టి అప్పటివరకూ శరీరానికి విశ్రాంతినివ్వాలి. కానీ ఇంటి ప్రసవాలు చేయించుకున్న సందర్భాల్లో ప్రసవం కోసం తొందరపెట్టడం వల్ల గర్భాశయం ఒత్తిడికి లోనై, కండరాలు బలహీనపడతాయి. గర్భధారణతో పెరిగిన బరువును త్వరగా వదిలించుకోవాలనే ఆలోచనతో ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోకుండానే వెంటనే వ్యాయామాలు మొదలుపెట్టడం కూడా సరికాదు.

దశల ఆధారంగా...

ప్రసవంతో గర్భాశయం కొంత మేరకు కిందకు జారుతుంది. యోని ద్వారం నుంచి 8 సెంటీమీటర్ల మేరకు జారితే ఫరవాలేదు. అయితే అంతకు మించి 6, 5, 2 సెంటీమీటర్ల దూరానికి జారిపోతూ ఉంటే యుటెరస్ ప్రొలాప్స్‌గా పరిగణించాల్సి ఉంటుంది. చివరి దశలో మూత్రవిసర్జన సమయంలో, లేదా బలంగా ముక్కినప్పుడు, పొట్ట మీద ఒత్తిడి పడే వ్యాయామాలు చేసినప్పుడు గర్భాశయం యోని వరకూ జారినట్టు తెలిసిపోతుంది. అయితే మొదటి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు కాబట్టి ఎవరూ పట్టించుకోరు. కానీ రెండో దశలో పొట్ట మీద ఒత్తిడి పడినప్పుడు, మూడో దశలో ఒత్తిడి పడకుండానే గర్భాశయం జారినట్టు తెలిసిపోతుంది. నాలుగో దశలో గర్భాశయం యోనిద్వారం నుంచి బయట కొచ్చేస్తుంది. ఈ దశను గ్రేడ్ 4 యువి ప్రొలాప్స్ అంటారు. అయితే మెనోపాజ్‌కు చేరుకున్న మహిళల్లో ఈ పరిస్థితి ఎక్కువ. పైబడే వయసులో శరీరంలోని మిగతా కండరాల్లాగే గర్భాశయ కండరాలు కూడా సాగే గుణాన్ని కోల్పోయి, బలహీనపడిపోవడంతో, యుటెరస్ ప్రొలాప్స్ ఒకటి రెండు దశల నుంచి మూడు, నాలుగు దశలకు చేరుకుంటూ ఉంటుంది. యుటెరస్ ప్రొలాప్స్ వంశపారంపర్యం కూడా! కాబట్టి 50 ఏళ్లు దాటిన తర్వాత ఈ కోవకు చెందిన మహిళల్లో గర్భాశయం కిందకు జారే సమస్య తలెత్తుతూ ఉంటుంది.



నియంత్రణ ఇలా...

యుటెరస్ ప్రొలాప్స్‌ను నివారించుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. అదెలాగంటే...

- ఈ సమస్య కుటుంబంలో ఉన్నప్పుడు, కటి కండరాలను బలపరిచే వ్యాయామాలు యుక్తవయసు నుంచే మొదలుపెట్టుకోవాలి
- జన్యుపరమైన కండరాల సమస్య ఉన్నప్పుడు, ఆ వ్యాధికి చికిత్స తీసుకోవాలి
- ప్రసవానంతరం ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలి
- ప్రసవానంతరం రెండు నెలల నుంచి వ్యాయామాలు మొదలుపెట్టాలి
- నడకతో మొదలుపెట్టి క్రమేపీ వ్యాయామాల తీవ్రతను పెంచుకోవాలి
- యోగాలో పెల్విక్ ఫ్లోర్ వ్యాయామాలు ఎంచుకోవాలి

సమస్యలు ఇవే!

గర్భసంచి ముందు మూత్రాశయం, గర్భాశయం వెనక విసర్జక అవయవాలు ఉంటాయి. కాబట్టి గర్భాశయం కిందకు జారినప్పుడు, ఈ అవయవాలు కూడా స్థాన భ్రంశం చెందుతాయి. దాంతో మూత్ర విసర్జన అసంపూర్తిగా జరుగుతూ, యూరినరీ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. అలాగే మలవిసర్జన కూడా ఇబ్బందిగా మారి, మలబద్ధకం మూలంగా మొలలు, షిషర్లు వేధిస్తాయి.

సమర్థమైన చికిత్సలున్నాయి

మొదటి రెండవ దశ యుటెరస్ ప్రొలాప్స్‌తో ఇబ్బంది పడే యువతులకు సర్విక్స్‌కు రింగ్ బిగించి, సర్విక్స్‌ను వెనక్కి నెట్టి పైన కూర్చోబెట్టవచ్చు. అలాగే గర్భాశయాన్ని పైకి లేపి, లోపలి పొట్టకు తగిలించే స్లింగ్ సర్జరీ కూడా తోడ్పడుతుంది. ఈ చికిత్సతో మూత్రాశయ సమస్యను నిరోధించుకోవచ్చు. యుటెరస్ ప్రొలాప్స్ నాలుగో దశకు చేరుకున్నప్పుడు సర్జరీని ఎంచుకోక తప్పదు. వృద్ధులైన మహిళలకు నాలుగో దశ యుటెరస్ ప్రొలాప్స్ ఉన్నప్పుడు, వెజైనల్ హిస్ట్రక్టమీ ద్వారా గర్భసంచిని తొలగించి, మూత్రాశయాన్ని పైకి నెట్టి సమస్యను సరిదిద్దవచ్చు. కొందర్లో గర్భసంచి జారకపోయినా, మూత్రాశయం జారుతుంది. ఇలాంటి సందర్భాల్లో యాంటీరియర్ కాల్పొరఫీ అనే చికిత్స ద్వారా మూత్రాశయాన్ని పైకి నెట్టి, కుట్టు వేసి, దాని స్థానంలో అమర్చుతారు. పోస్టీరియర్ రెక్టోసీల్‌లో భాగంగా కిందకు జారిన విసర్జకాయవాన్ని పైకి నెట్టి కుట్టువేసి, అమరుస్తారు. ఈ రెండు చికిత్సలూ యోని ద్వారం గుండానే జరుగుతాయి. అయితే తాజా ల్యాప్రోస్కోపీ చికిత్సతో ఈ చికిత్సలు మరింత సులభతరం అయ్యాయి. గర్భాశయం పూర్తిగా కిందకు జారినప్పుడు, దానికి మెష్‌ను అమర్చి, ట్యాకర్ ద్వారా శాక్రమ్ ఎముకకు తగిలించవచ్చు. ఈ 'ల్యాప్రోస్కోపిక్ స్కాల్పోకాల్పోప్రెక్సీ' చికిత్సలో మూత్రాశయాన్నీ విసర్జకావయవాన్నీ తాకే అవసరం ఉండదు కాబట్టి అవి రెండూ ఏమాత్రం దెబ్బతినకుండా వాటి స్థానాల్లోకి చేరుకోగలుగుతాయి. ఇలా యుటెరస్ ప్రొలాప్స్ దశ ఆధారంగా చికిత్స కోసం మొదట రింగ్స్‌ను ఎంచుకుంటారు. తర్వాత వెజైనల్ హిస్ట్రక్టమీ, అంతిమంగా ల్యాప్రోస్కోపిక్ స్కాల్పోకాల్పోప్రెక్సీని వైద్యులు ఎంచుకుంటారు.



డాక్టర్ పూజిత దేవి సూరనేని
హై రిస్క్ అబ్‌స్టెట్రీషియన్,
ల్యాప్రోస్కోపిక్ అండ్ రోబోటిక్ సర్జన్,
బర్త్ రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్,
హైదరాబాద్

ఉధృతంగా పెరుగుతున్న క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధికి తాజాగా అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. క్యాన్సర్ రోగుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్న ఆ సమర్థమైన చికిత్సల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ఈ మూడు చికిత్సలతో... లంగ్ క్యాన్సర్‌కు అడ్డుకట్ట

క్యాన్సర్ కేర్



ప్రపంచవ్యాప్తంగా అధికంగా కనిపించే క్యాన్సర్లలో లంగ్ క్యాన్సర్ ఒకటి. ఈ క్యాన్సర్‌కు ధూమపానం ప్రధాన కారణం అయినప్పటికీ, వాయు కాలుష్యం, ప్యాసివ్ స్మోకింగ్, జన్యు మార్పులు, దీర్ఘకాలం పాటు రసాయనాలకు బహిర్గతమవడం వల్ల కూడా ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకుతుంది. అయితే ఇటీవలి కాలంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స విప్లవాత్మకమైన పురోగతి సాధించింది. ఈ చికిత్సలో భాగంగా ప్రధానంగా కీమో థెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ అనే మూడు చికిత్సా విధానాలను వైద్యులు ఎంచుకుంటున్నారు. రెండు, మూడు, నాల్గవ దశల్లోని లంగ్ క్యాన్సర్ రోగులకు ఈ చికిత్సలు సమర్థమైన, ప్రభావవంతమైన ఫలితాలనిస్తాయి.

కీమో థెరపీ

శస్త్రచికిత్స ద్వారా క్యాన్సర్ సోకిన భాగాన్ని తొలగించిన తర్వాత, కీమో థెరపీలో భాగంగా అందించే ఔషధాలు, క్యాన్సర్ కణాల విభజనను అడ్డుకుంటాయి. అలాగే మిగిలి ఉన్న క్యాన్సర్ కణాలను నాశనం చేయడంతో పాటు, వ్యాధి శరీరంలోని ఇతరత్రా అవయవాలకు పాకే మెటాస్టాటిక్ దశల్లో వ్యాధిని నిరోధించడానికి కీమో థెరపీ దోహదపడుతుంది. అలాగే పూర్వం కీమో థెరపీ తదనంతర దుష్ప్రభావాలు రోగులను మానసికంగా, శారీరకంగా కుంగదీసే పరిస్థితి నెలకొని ఉండేది. కానీ ప్రస్తుత ఆధునిక ఔషధాలతో వాంతులు, జుట్టు రాలడం, నిస్సత్తువ మొదలైన దుష్ప్రభావాలను 70 నుంచి 80 శాతం మేరకు తగ్గించే వీలు కలుగుతోంది. నిరంతర పర్యవేక్షణ, పోషకాహారం, సపోర్టివ్ మెడిసిన్స్‌తో కీమో థెరపీని సులభంగా భరించగలిగే వీలుంది.

టార్గెటెడ్ థెరపీ

రోగుల్లో క్యాన్సర్ భిన్న స్వభావాలను కలిగి ఉంటుంది. కొందరి క్యాన్సర్ కణాల్లో జన్యుమార్పులుంటాయి. క్యాన్సర్ కణాల మీద నిర్దిష్టమైన రిసెప్టార్స్, ప్రొటీన్స్ ఉంటాయి. వీటి లక్ష్యంగా సాగే చికిత్సే టార్గెటెడ్ థెరపీ. ఈ చికిత్సలో భాగంగా రోగులకు ఇచ్చే ఇంజెక్షన్లు, ఆ లక్ష్యాల మీద దాడి చేయడం వల్ల, ఆరోగ్యకరమైన కణాలు మినహా, క్యాన్సర్ కణాలు మాత్రమే నాశనమవుతాయి. అయితే ఈ చికిత్స అర్హతను నిర్ధారించుకోవడం కోసం రోగులకు ముందస్తు పరీక్షలు చేపడతారు. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ పరీక్ష చేసి, వాటిలో మార్పులు ఉన్న రోగులకు వైద్యులు, టార్గెటెడ్ థెరపీని ఎంచుకుంటారు. నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ పరీక్షలో భాగంగా 500 నుంచి 600 జన్యువులను పరీక్షించి, జన్యుపరమైన ఉత్పరివర్తనాలు కలిగి ఉన్న వారికి వైద్యులు టార్గెటెడ్ థెరపీని సూచిస్తారు. ఈ చికిత్స నోటి మాత్రల రూపంలోనే సాగుతుంది.

ఇమ్యునో థెరపీ

జన్యు పరివర్తన లేకుండా, పిడిఎల్1 రిసెప్టార్స్ కలిగిన క్యాన్సర్ కణాలు అధిక సంఖ్యలో ఉన్న రోగులకు ఇమ్యునోథెరపీ సత్ఫలితాన్నిస్తుంది. అయితే ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకిన రోగుల్లో ఈ పిడిఎల్1 రిసెప్టార్లు కలిగిన క్యాన్సర్ కణాలు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ ఇమ్యునో థెరపీ చికిత్సను ఆశ్రయించవచ్చు. ఇమ్యునోథెరపీ ప్రధానంగా వ్యాధినిరోధకశక్తిని బలోపేతం చేసే చికిత్స. క్యాన్సర్ కణాలతో పోరాడేలా ఈ చికిత్స వ్యాధినిరోధకశక్తిని ప్రేరేపిస్తుంది. సాధారణంగా వ్యాధికారక సూక్ష్మజీవులను మన వ్యాధి నిరోధక వ్యవస్థ సమర్థంగానే గుర్తించి, తుదముట్టిస్తుంది. కానీ క్యాన్సర్ విషయంలో ఈ కణాలు కొన్ని ప్రత్యేకమైన ప్రొటీన్ల సాయంతో, వ్యాధినిరోధక వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తాయి. కాబట్టి ఈ పొరపాటు జరగకుండా మన రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను సమర్థంగా గుర్తించగలిగేలా వాటిని ప్రేరేపించడానికి తోడ్పడే ఇంజెక్షన్లను ఈ చికిత్సలో ఇవ్వడం జరుగుతుంది. ఇమ్యునోథెరపీతో చక్కని ప్రతిస్పందన లభించడంతో పాటు, ఆ ఫలితం దీర్ఘకాలం పాటు కొనసాగుతుంది. ఈ చికిత్స తీసుకున్న ప్రతి వంద మంది రోగుల్లో 20 మందిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీలను రెండు, మూడు, నాల్గవ దశల్లోని ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సకు వాడుకోవచ్చు. అయితే కొన్నిసార్లు ఇమ్యునోథెరపీ చికిత్సను కీమోథెరపీతో కలిపి అందించవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో టార్గెటెడ్ థెరపీ, కీమెథెరపీ కలిపి ఇవ్వవలసి రావచ్చు. ఏ చికిత్స తీసుకున్నా, క్రమం తప్పక పెట్ స్కాన్స్ చేయించుకుంటూ, వైద్యుల పర్యవేక్షణలో నడుచుకుంటూ ఉండాలి.



డాక్టర్ ఎ. వేణుగోపాల్
సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్
అండ్ హెమటో ఆంకాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్, హైదరాబాద్

చక్కెర చేటే?



మీకు తెలుసా?

చక్కెర తెచ్చిపెట్టే చేటు గురించి తెలుసు కాబట్టి బదులుగా బెల్లం, తేనెలను ఎంచుకునే వాళ్లుంటారు. అయితే ఆ తీపి ఆరోగ్యకరమేనా?

చక్కెర: అత్యంత ఎక్కువగా శుద్ధి చేసిన చక్కెర 65 నుంచి 75 గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. 100 గ్రాముల చక్కెరలో 390 క్యాలరీలుంటాయి.

బెల్లం: చక్కెరతో పోల్చితే, ఇది తక్కువ శుద్ధి చేసిన పదార్థమే! దీన్లో ఇనుము, పొటాషియం పోషకాలు కూడా ఉంటాయి. అయితే ఇది కూడా 60 నుంచి 84 గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. 100 గ్రాముల బెల్లంలో 380 క్యాలరీలుంటాయి.

తేనె: దీన్లో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి కాబట్టి పేగులకు మేలు చేస్తుంది. అయితే తేనె కూడా 45 నుంచి 60 గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. వంద గ్రాముల తేనెలో 240 నుంచి 330 క్యాలరీలుంటాయి.

ఖర్జూరం: దీన్లో ఫ్రక్టోజ్, గ్లూకోజ్ మొదలైన సహజసిద్ధ చక్కెరలుంటాయి. అలాగే పీచు, ఖనిజ లవణాలు, ఇనుము కూడా ఉంటాయి. ఖర్జూరం గ్లైసెమిక్ ఇండెక్స్ 40 నుంచి 55. వంద గ్రాముల ఖర్జూరంలో 314 క్యాలరీలుంటాయి. కాబట్టి రోజుకు రెండు ఖర్జూరాలకు మించి తినకపోవడమే ఉత్తమం.

చక్కెరకు ప్రత్యామ్నాయంగా పోషకాలను కలిగి ఉండే తేనె, బెల్లం, ఖర్జూరాల మీద ఆధారపడే వాళ్లు కూడా వాటిని మితంగానే తీసుకోవాలి.

ఇదీ సంగతి

టూత్‌బ్రష్ సురక్షితమా?

ప్రతిరోజూ ఉదయాన్నే టూత్‌బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకుంటూ ఉంటాం. అయితే దంతధావనం కోసం ఉపయోగించే టూత్‌బ్రష్ శుభ్రంగానే ఉందా? అన్నది కూడా గమనించుకోవాలి.

టూత్‌బ్రష్‌ను ఉపయోగించిన ప్రతిసారీ పదార్థాలు, లాలాజలం, బ్యాక్టీరియాలు టూత్‌బ్రష్ బ్రిసిల్స్‌లోకి చేరిపోతూ ఉంటాయి. కాబట్టి టూత్‌బ్రష్‌ను తడిగానే వదిలేస్తే, ఆ తేమ వాతారణంలో ఇకొలై, స్ట్రెప్టోకోకస్, స్టాఫ్ బ్యాక్టీరియా లాంటి సూక్ష్మక్రిములు, ఫంగస్‌లు విస్తృతంగా వృద్ధి చెందుతాయి. అలాగే కొన్ని ఇళ్లలో బాత్రూమ్‌లోనే సింక్ కూడా ఉంటుంది. అలాంటప్పుడు టాయ్‌లెట్‌ను ఫ్లష్ చేసిన ప్రతిసారీ, టాయిలెట్ ప్లూమ్ అనే కంటికి కనిపించని బిందువులు గాల్లో కలుస్తూ ఉంటాయి. ఆరు అడుగుల దూరం వరకూ ప్రయాణించే ఈ బిందువుల్లో విసర్జక బ్యాక్టీరియా ఉంటుంది. కాబట్టి ఇవి కూడా టూత్‌బ్రష్‌లోకి చేరిపోయే అవకాశాలుంటాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి. టూత్‌బ్రష్ తడిగా ఉన్నా, మూసిన డబ్బాల్లో, అల్మారాల్లో ఉంటున్నా, వాటిలో మోల్డ్, ఈస్ట్ పెరిగే అవకాశాలుంటాయి. ఇవి అలర్జీలు, శ్వాసకోస సమస్యలు, నోటి ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి. కాబట్టి టూత్‌బ్రష్ రంగు మారినా, దుర్వాసన వేస్తున్నా దాన్ని వెంటనే పారేయాలి. టూత్‌బ్రష్ ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే...

- కుటుంబ సభ్యులందరి టూత్‌బ్రష్‌లనూ ఒకే డబ్బాలో ఉంచకూడదు. బ్రష్‌ల మధ్య కనీసం అంగుళం దూరమైనా పాటించాలి.
- వాడిన ప్రతిసారీ టూత్‌బ్రష్‌ను శుభ్రంగా కడిగి, పూర్తిగా ఆరిపోయేలా చూసుకోవాలి
- ప్రతి మూడు నెలలకూ టూత్‌బ్రష్ మారుస్తూ ఉండాలి
- ఫ్లష్ చేయడానికి ముందు టాయిలెట్ లిడ్ మూసేయాలి
- యువి శానిటైజర్‌ను ఉపయోగించాలి లేదా అప్పుడప్పుడూ టూత్‌బ్రష్ బ్రిసిల్స్ మౌత్‌వాష్‌లో నానబెడుతూ ఉండాలి



లంకణం పరమౌషధం అంటారు. ఈ నానుడిని నిరూపించే 'ఆటోఫజీ' సూత్రం సర్వత్రా ఊపందుకుంటోంది. ఉపవాసంతో కణ మరమ్మత్తు జరుగుతుందనీ, కొత్త కణాల పుట్టుకతో వ్యాధులు అదుపులోకొస్తాయనీ ఎంతోమంది నమ్ముతున్నారు. ఇంతకూ లంకణం పరమౌషధమేనా? ఉపవాసంతో ఆరోగ్య ప్రయోజనాలు ఒరుగుతాయా? వైద్యులేమంటున్నారు?

లంకణం పరమౌషధమేనా?



శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకునే మార్గాలు అనేకం ఉంటాయి. వాటిలో 'ఆటోఫజీ' ఒకటి. ఉపవాసంలో భాగంగా శరీరం ఒత్తిడికి లోనైనప్పుడు, దెబ్బతిన్న, క్రమం తప్పిన కణాలను తొలగించుకుని, ఆరోగ్యకరమైన, కొత్త కణాలను వృద్ధి చేసుకుంటుంది. ఈ పరిస్థితినే వైద్యపరిభాషలో 'ఆటోఫజీ' అంటారు. ఆకలేస్తే, శరీరం పోషణను కోరుకుంటోందని అర్థం చేసుకుంటాం. కానీ ఆకలి అన్నది, శరీరంలోని విషాలను హరించే అత్యంత శక్తివంతమైన ప్రకృతిసిద్ధ వ్యవస్థ. అందుకోసం ఉపవాసాన్ని మన సంప్రదాయంలో భాగం చేసుకున్నాం. కొన్ని పండుగల్లో ఉపవాసానికి చోటు కల్పించుకుని, కణ మరమ్మత్తుతో ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. అయితే ఆటోఫజీతో అందరికీ ప్రయోజనం కలుగుతుందా? ఉపవాసానికి పరిమితి ఉంటుందా? ఎవరు ఎన్ని గంటల పాటు ఉపవాసం చేస్తే, శరీరంలో ఆటోఫజీ స్థితి ఏర్పడుతుంది?

రోజుకు మూడు భోజనాలతో, శరీరానికి నిరంతర శక్తిని సమకూర్చే చక్రాన్ని ఛేదిస్తూ, సుదీర్ఘ ఉపవాసంతో శరీరాన్ని ఒత్తిడికి లోను చేసినప్పుడు, శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకుంటుంది. ఈ మరమ్మత్తు ప్రక్రియలో భాగంగా శరీరం తనంతట తాను తనలోని అనారోగ్యకరమైన కణాలను ధ్వంసం చేసుకుంటుంది. ఈ క్రమంలో విడుదలయ్యే ప్రొటీన్లు ఆరోగ్యకరమైన ప్రయోజనాలకు తోడ్పడతాయి. సెల్‌ఫోన్ మొరాయించినప్పుడు, ఎలాగైతే దాన్ని రీసెట్ చేసి, కొత్త ఫోన్‌లా మార్చేసుకుంటామో, శరీరం కూడా ఆటోఫజీ ప్రక్రియ ద్వారా తనను తాను రీసైకిల్ చేసుకుంటుంది. ఈ అవకాశానికి తావివ్వకపోతే శరీరంలో కణ వ్యర్థాలు పేరుకుపోయి, ఆరోగ్యం క్షీణిస్తుంది. శరీరంలో కొత్త కణాల పెరుగుదల ఎంత కీలకమో, పాతబడిన, దెబ్బతిన్న కణాల నిర్మూలన కూడా అంతే అవసరం. అయితే ఆటోఫజీని పూర్తి ప్రయోజనకారిగా భావించడానికి కూడా వీల్లేదు. ఇదొక రెండంచుల కత్తి లాంటిది. ఆటోఫజీతో శరీరంలో ఎలా, ఏ మేరకు ప్రయోజనం సమకూరాలన్నది నిర్దిష్టంగా తెలియదు. ఈ కోణంలో మరిన్ని పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది. కాబట్టి ఆటోఫజీతో జరిగే కణ శుద్ధి, వృద్ధి వల్ల వ్యాధులన్నీ నమయైపోతాయనుకోవడం పొరపాటు. క్యాన్సర్ రోగుల్లో క్యాన్సర్ కణాల నుంచి విడుదలయ్యే యాంటిజెన్స్ సాధారణ కణాలను ధ్వంసం చేస్తాయి. దీనికి అదనంగా ఆటోఫజీతో కణ ధ్వంసాన్ని మరింత పెంచుకోవడం వల్ల ఈ రోగులకు నష్టమే ఎక్కువగా జరుగుతుంది. కాబట్టి క్యాన్సర్ రోగులకు ఆటోఫజీతో ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

ఉపవాసంతో ప్రయోజనకరమే!

ఉపవాసం కచ్చితంగా ఆరోగ్యాన్నీ, ఆయుర్దాయాన్నీ పెంచుతుంది. అలాగని తరచూ, దీర్ఘకాలం పాటు ఉపవాసం ఉండడం వల్ల అదనంగా ఒరిగే ప్రయోజనం ఉండదు. ఇలాంటి ఉపవాసాలతో ఆటోఫజీతో ఒరిగే ప్రయోజనానికి మించి, ప్రొటీన్, కండర నష్టంతో బలహీనత ఆవరిస్తుంది. కాబట్టి ఉపవాసాలను పరిమితంగానే అనుసరించాలి. పండుగ సందర్భాల్లో అప్పుడప్పుడూ ఉపవాసం ఉండడం మంచిదే! కానీ వారంలో మూడు నుంచి నాలుగు రోజుల పాటు ఎక్కువ గంటల పాటు ఉపవాసం ఉండడం వల్ల ఆరోగ్యానికి నష్టం కలుగుతుంది. నిజానికి సరైన ఆహార, నిద్ర వేళలను అనుసరిస్తే, మన శరీరంలో ఆటోఫజీ స్వతఃసిద్ధంగానే ఏర్పడుతుంది. రాత్రి భోజనానికీ, ఉదయం అల్పాహారానికీ మధ్య 12 నుంచి 14 గంటల నిడివి పాటించడం ద్వారా మనం ప్రతి రోజూ ఉపవాస ఫలాన్ని పొందగలుగుతాం! ఇందు కోసం ప్రత్యేకించి భోజనం మానుకోవలసిన అవసరం లేదు. అలా కాకుండా రాత్రుళ్లు ఆలస్యంగా భోజనం ముగించడం, ఉదయాన్నే మళ్లీ బ్రేక్‌ఫాస్ట్ తినేయడం లాంటి అలవాట్లతో శరీరం అవిశ్రాంత స్థితికి లోనవుతుంది. శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకునే వ్యవధి దొరకదు, ఆరోగ్యం దెబ్బతినడం మొదలవుతుంది.

వేర్వేరు అంశాల ఆధారంగా...

వేలి ముద్రల్లాగే ప్రతి ఒక్కరి శరీరాలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి ఎవరికి, ఎంత ఉపవాసం, ఏ మేరకు ప్రయోజనాన్ని అందిస్తున్నది కచ్చితంగా లెక్కించి చెప్పే వీలు లేదు. కాబట్టి ఎవరికి వారు స్వయంగా ఉపవాస దీక్షలు చేసుకుంటూ, ఆటోఫజీ ప్రయోజనాన్ని పొందాలనుకోవడం పొరపాటు. ఆరోగ్య పరిస్థితి, వయసు, శరీర తత్వాల ఆధారంగా పరిమిత కాలం మేరకే ఉపవాసాలను పాటించాలి. మరీ ముఖ్యంగా మధుమేహులు, అధిక రక్తపోటు బాధితులు, ఇతరత్రా దీర్ఘకాలిక రుగ్మతలున్నవాళ్లు వైద్యుల సలహా తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఉపవాసాలు ఉండడం సరికాదు.

భారతీయ సంస్కృతిలో 'ఆటోఫజీ'

భారతీయ సంస్కృతి సహజసిద్ధ ఆటోఫజీని ప్రోత్సహించే జీవనశైలి విధానాలను నొక్కి చెప్తోంది. అవేంటంటే...

ఉపవాసం: ఏకాదశి, నవరాత్రి లాంటి పర్వదినాల్లో ఆహారం తినడం కోసం నిర్దిష్ట సమయ పరిధికే పరిమితమవుతూ ఉంటాం. ఈ ఉపవాస దీక్షలు శరీరంలోని గ్లూకోజ్, ఇన్సులిన్ మోతాదులను తగ్గించడం ద్వారా ఆటోఫజీని ప్రేరేపించి, శరీరంలో నిల్వ ఉన్న కొవ్వు నుంచి శక్తిని స్వీకరించేలా శరీరాన్ని బలవంతపెడతాయి.

యోగా, ప్రాణాయామం: యోగాసనాల్లోని కొన్ని శారీరక కదలికలు రక్తప్రసరణను మెరుగుపరిచి, లింఫ్ స్రావాల పారుదలకు తోడ్పడడంతో పాటు, కణ మరమ్మత్తును ప్రోత్సహించి, ఆటోఫజీకి మద్దతిస్తాయి. ప్రాణాయామంతో కణ మరమ్మత్తుతో ముడిపడి ఉండే ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది

ధ్యానం: ఆటోఫజీకి అడ్డుపడే కీలక అంశం ఒత్తిడి. ధ్యానంతో ఒత్తిడితో ముడిపడి ఉండే ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.

జీవ గడియారం: తెల్లవారుఝామునే నిద్రలేవడం, సూర్యాస్తమయానికి ముందే భోజనం ముగించడం మన భారతీయ సంప్రదాయం. ఈ సంప్రదాయం సహజసిద్ధ జీవగడియారానికి తగినట్టు రూపొందింది.



డాక్టర్ నవీన్ పోలవరపు
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
లివర్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్

అది 'సర్' కాదు...ఓట్‌బందీ

పీక కోసినా వ్యతిరేకిస్తూనే ఉంటా: మమత

కోల్‌కతా, నవంబరు 10: ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తప్పుపట్టారు. అది 'సర్' కాదని, ఓటర్లను తొలగించడానికి ఉద్దేశించిన ఓట్ల రద్దు ('ఓట్ బందీ') కార్యక్రమమని, 'సూపర్ ఎమర్జెన్సీ'లాంటి పరిస్థితి అని అభివర్ణించారు. దాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండు చేశారు. సోమవారం ఆమె సిలిగుడిలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో బీజేపీ ప్రభుత్వం నోట్ల రద్దు (నోట్ బందీ)తో ప్రజలను వేధించిందని, ఇప్పుడు ఓట్‌బందీని అమలు చేస్తోందని విమర్శించారు. ఇంత హడావిడిగా దీన్ని చేపట్టాల్సిన అవసరం ఏమొచ్చిందో అర్థం కావడం లేదని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ రెండు, మూడు నెలల్లో పూర్తి కాదని, అలాంటప్పుడు ఎన్నికలకు ముందు బలవంతంగా ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించారు. సర్‌ను వ్యతిరేకిస్తున్నందుకు బీజేపీ తనను జైలులో పెట్టొచ్చు, పీక కోయొచ్చు..కానీ ప్రజల ఓటింగ్ హక్కును అణచివేయకూడదని అన్నారు. జీఎస్టీకి మద్దతు ఇచ్చి పెద్ద తప్పు చేశామని మమత చెప్పారు. జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని విమర్శించారు.

అందుబాటులోకి ఆధార్ కొత్త యాప్

ఇక నుంచి డిజిటల్ రూపంలో ఆధార్ గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబరు 10: భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ(యూఐడీఏఐ-ఉడాయ్) కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మన ఆధార్ కార్డును డిజిటల్ రూపంలో మన స్మార్ట్ ఫోన్‌లో తీసుకొని వెళ్లడానికి ఈ యాప్ పనికొస్తుంది. ఏదేని వెరిఫికేషన్ సమయంలో ఆధార్ కార్డుని మనం భౌతికంగా తీసుకొని వెళ్లనవరం లేదు. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ వంటి భద్రతా ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయి. వీటివల్ల మన వ్యక్తిగత సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుంది. ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నంబరు ఒకటే అయితే మొత్తం కుటుంబ సభ్యుల కార్డులన్నింటినీ ఈ యాప్‌లో భద్రపరుచుకోవచ్చు. ఆధార్ వెరిఫికేషన్ కోసం ఎవరితోనైనా పంచుకోవలసి వచ్చినపుడు వారికి అవసరమైన వివరాలను మాత్రమే కనిపించేలా చేసి మిగిలిన వాటిని దాచుకోవచ్చు. ఉదాహరణకి మన పేరు, ఫొటో మాత్రమే సరిపోతుందనుకున్న సమయంలో మన పుట్టిన తేదీ, చిరునామా వంటి వాటిని కనిపించకుండా చేయవచ్చు.ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లో అందుబాటులో ఉంది. యాప్‌ని ఇన్‌స్టాల్ చేసే క్రమంలో మన మొబైల్ నంబరును నిర్ధారించుకుంటుంది. ఆ తరువాత ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా మన ఐడెంటిటీని నిర్ధారించుకుంటుంది. అప్పుడు మాత్రమే యాప్ ఇన్‌స్టలేషన్ పూర్తి అవుతుంది.

డిజిటల్ వైపు సహకార బ్యాంకులు

సహకార్ డిజి పే, డిజి లోన్ యాప్‌ల ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబరు 10: పట్టణ సహకార బ్యాంకు (యూసీబీ)లను ఆధునికీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా సోమవారం నాడు యూసీబీల కోసం 'సహకార్ డిజి పే', సహకార్ డిజి లోన్' అనే రెండు మొబైల్ అప్లికేషన్లను ప్రారంభించారు. పెరుగుతున్న నగదు రహిత ఆర్థిక వ్యవస్థలో ఈ డిజిటల్ చెల్లింపుల స్వీకరణ యూసీబీల మనుగడకు అత్యవసరం అని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశంలో నగదు రహిత లావాదేవీలు వేగంగా పెరుగుతున్నాయని, ఈ ధోరణికి అనుగుణంగా యూసీబీలు మారకుంటే పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. రాబోయే రెండేళ్లలో దాదాపు 1,500 బ్యాంకులను సహకార్ డిజి పే వేదికపైకి తీసుకురావాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అలాగే ఐదేళ్లలోపు రెండు లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పట్టణంలో కనీసం ఒక అదనపు యూసీబీని ఏర్పాటు చేయాలని ఎన్ఏఎఫ్‌సీయూబీ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్స్)ని అమిత్ షా కోరారు.

బిహార్లో నేడే తుది పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఓటర్లు 7.69 లక్షల మంది. సజావుగా పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లూ చేసింది. 45,399 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేసింది. వీటిలో 40,073 కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి. 8,491 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో ఒక్క గయాజీలోనే 1,084 కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు మొత్తం 122 స్థానాల్లోనూ భారీగా భద్రతాబలగాలను మోహరించారు. ఇప్పటికే 500 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ముందస్తు ఎన్నికల విధుల్లో ఉండగా.. వీటితో పాటు మరో 500 కంపెనీల సాయుధ సిబ్బందికి పోలింగ్ బాధ్యతలు అప్పటించారు. వీరుగాక 60 వేల మంది బిహార్ పోలీసులు, 30 వేల బిహార్ సాయుధ పోలీసు సిబ్బంది, 20 వేల మంది హోంగార్డులు, శిక్షణలో ఉన్న మరో 19 వేల మంది కొత్త పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 2 వేల మంది సిబ్బందిని మోహరించారు. నవాదా జిల్లా హిసువా స్థానంలో అత్యధికంగా 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చంపటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బణ్‌మన్‌ఖీ సీట్లలో 22 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకు గాను 121 స్థానాలకు ఈ నెల 6న జరిగిన మొదటి దశ ఎన్నికల్లో 65 శాతానికిపైగా పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. రెండు దశల్లో కలిపి ఈ నెల 14న ఓట్లు లెక్కించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.



సీమాంచల్‌పైనే పార్టీల దృష్టి

ఎన్నికలు జరిగే జిల్లాల్లో అత్యధికం పూర్వాంచల్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇది ముస్లిం ప్రాబల్య ప్రాంతం కావడంతో బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని పాలక ఎన్డీఏ, విపక్ష ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ముస్లిం ఓట్లు తనకేనని గఠ్‌బంధన్ భావిస్తుండగా.. చొరబాటుదార్లకు విపక్షం అండగా నిలుస్తోందని ఎన్డీఏ ఆరోపిస్తోంది. నితీశ్ కుమార్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు బ్రిజేంద్రప్రసాద్ యాదవ్ (సుపౌల్), లేశీ సింగ్ (ధమ్‌దాహా), షీలా మండల్ (ఫుల్‌పరాస్), జమాఖాన్ (ఛైన్‌పూర్)-జేడీయూ.. ప్రేమ్‌కుమార్ (గయ), రేణు దేవి(బెతియా), నీరజ్‌కుమార్ సింగ్(ఛతర్‌పూర్), మాజీ ఉపముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (కతిహార్)-బీజేపీ.. పీసీసీ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్ (కుటుంబ), కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్ (కడ్వా), సీపీఐఎంఎల్-లిబరేషన్ పక్ష నేత మెహబూబ్ ఆలం (బలరాంపూర్) బరిలో ఉన్నారు. కాగా, హెచ్ఏఎంకు కేటాయించిన ఆరు స్థానాలకు, ఆర్ఎల్ఎంకు ఇచ్చిన ఆరు స్థానాల్లో నాలుగింటికి రెండో దశలోనే పోలింగ్ జరుగుతోంది.

స్త్రీ-పురుష వారీ ఓటింగ్ వివరాలేవీ?: తేజస్వీ

బిహార్‌లో జరిగిన తొలి దశ ఎన్నికల్లో స్త్రీ-పురుషుల వారీగా ఓటింగ్ వివరాలను ఎన్నికల కమిషన్ వెల్లడించకపోవడాన్ని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. ఈ నెల ఆరో తేదీన తొలి దశ ఎన్నికలు జరిగాయని, సోమవారం నాటికి నాలుగు రోజులు పూర్తయినా ఆ వివరాలను ప్రకటించలేదని చెప్పారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, ఇంతకుముందు ఎన్నికలయిన వెంటనే ఈ సమాచారం బహిర్గతమయిదేని గుర్తు చేశారు.

అన్ని విద్యాసంస్థల్లో 'వందేమాతరం' తప్పనిసరి!

యూపీ సీఎం యోగి ఆదేశం

గోరఖ్‌పూర్, నవంబరు 10: జాతీయ గేయం 'వందేమాతరం'పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్(యూపీ) ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లోనూ వందేమాతరం గేయాన్ని తప్పనిసరిగా ఆలపించాలని పేర్కొన్నారు. గోరఖ్‌పూర్‌లో సోమవారం జరిగిన 'ఐక్యతా యాత్ర'లో పాల్గొన్న ఆయన.. 'వందేమాతరం' ఆలపించడం ద్వారా భరతమాత, మాతృభూమి పట్ల పౌరులకు మరింత గౌరవం పెరుగుతుందన్నారు. "జాతీయ గేయం పట్ల గౌరవ భావం ఉండాలి. ఈ నేపథ్యంలోని రాష్ట్రంలోని ప్రతి విద్యా సంస్థలోనూ దీనిని ఆలపించడం తప్పనిసరి చేస్తున్నాం." అని యోగి తెలిపారు. ఇదిలావుంటే, వందేమాతరంలోని కొన్ని పంక్తులను తొలగించడం... దేశ విభజనకు దారితీసిందని, అనేక సవాళ్లు కూడా ఎదురయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనికి కొనసాగింపుగా బీజేపీ కూడా మరిన్ని విమర్శలు చేసింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వందేమాతరంలోని కొన్ని పంక్తులను కుదించడం వెనుక మతపరమైన అజెండా ఉందని బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు. ఈ విమర్శలకు కాంగ్రెస్ పార్టీ గట్టిగా బదులిచ్చింది. 1937లో వందేమాతరంలోని రెండు చరణాలను మాత్రమే తీసుకోవాలని సూచించిన రవీంద్రనాథ్ ఠాకూర్‌ను, అప్పటి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని ప్రధాని మోదీ అవమానించారని దుయ్యబట్టింది. ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు.

ప్రమాణాలు పాటిస్తారా? మూసేస్తారా?

'దగ్గు సిరప్' మరణాల నేపథ్యంలో ఫార్మా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం

న్యూఢిల్లీ, నవంబరు 10: దగ్గు సిరప్ వల్ల మనదేశంతోపాటు విదేశాల్లోనూ మరణాలు సంభవించిన నేపథ్యంలో ఔషధ తయారీ సంస్థలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. అంతర్జాతీయ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, లేదంటే సంస్థలను మూసుకోవాల్సి ఉంటుందని గట్టిగా హెచ్చరించింది. వచ్చే ఏడాది జనవరి ఒకటినాటికి గ్లోబల్ గుడ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్(జీఎమ్‌పీ) విధానాలకు అనుగుణంగా సంస్థలు తయారవ్వాలని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) నిర్దేశించింది. వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల లోపు ఉండి, తక్కువస్థాయి వసతులు కలిగిన 1,470 ఫార్మా యూనిట్లకు ఈ మేరకు ఆదేశాలను జారీచేసింది. నిర్దేశిత తేదీ లోపు విధానాలను మార్చుకోని యూనిట్లు తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సి ఉంటుందని, తేదీని పొడిగించే ప్రసక్తి ఉండదని సీడీఎస్‌సీవో స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్న జెనిటిక్ ఔషధాల్లో 20% మేర మనదేశంలోని ఫార్మా సంస్థలే అందిస్తున్నాయి. దీంతో నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రభావం వాటిపై గణనీయంగానే ఉంటుందని భావిస్తున్నారు. మన ఫార్మా ఉత్పత్తులపై దేశీయంగా, అంతర్జాతీయం తిరిగి విశ్వాసం కలిగించేందుకు ఈ చర్యలు అవసరమని సీడీఎస్‌సీవో భావిస్తోంది.

ఢిల్లీ విమానాశ్రయం పరిధిలో జీపీఎస్ స్పూఫింగ్!

విమానాలకు తప్పుడు సంకేతాలు అందినట్లు పైలట్ల ఫిర్యాదు

దర్యాప్తు చేపట్టిన ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ కార్యాలయం

న్యూఢిల్లీ, నవంబరు 10: ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక లోపం కారణంగా కిందటివారం ఢిల్లీ విమానాశ్రయంలో పలు విమానాలకు అంతరాయం కలిగింది గుర్తుందా! 'జీపీఎస్ స్పూఫింగ్' కారణంగానే అలా జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ కార్యాలయం దీనిపై దర్యాప్తు ప్రారంభించింది. సాధారణంగా మనం ఒకచోటు నుంచి మరొకచోటుకు వెళ్తున్నప్పుడు జీపీఎస్ సాయంతో వెళ్తాం. విమానాలు కూడా అలా జీపీఎస్ ఆధారంగా ప్రయాణిస్తాయి. కంప్యూటర్లను హ్యాక్ చేసినట్టుగానే.. నకిలీ ఉపగ్రహ సంకేతాలను ప్రసారం చేయడం ద్వారా విమానాల్లోని నేవిగేషన్ వ్యవస్థలకు అంతరాయం కలిగించడమే జీపీఎస్ స్పూఫింగ్. దీనివల్ల విమానాలు వాస్తవంగా ఒక ప్రాంతంలో ఉంటే.. మరోచోట ఉన్నట్టుగా నేవిగేషన్ వ్యవస్థలు భావిస్తాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కిందటి గురువారం సాయంత్రం నుంచి ఏటీసీ వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తగా.. దానికి రెండు రోజుల ముందు నుంచే తమకు తప్పుడు నేవిగేషన్ సమాచారం అందిందంటూ పైలట్లు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. రాజధాని ప్రాంతానికి (ఎన్‌సీఆర్) 60 నాటికల్ మైళ్ల పరిధిలో ఈ తరహా తప్పుడు సమాచారం అందినట్టు పైలట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఎన్ఎస్ఏ కార్యాలయంలోని 'నేషనల్ సైబర్ సెక్యూరిటీ కో-ఆర్డినేటర్ (ఎన్‌సీఎస్‌సీ)' నవీన్‌కుమార్ సింగ్ ఈ కేసు దర్యాప్తును చేపట్టారు. జీపీఎస్ స్పూఫింగ్ జరిగిందా? లేక నిజంగానే సాంకేతిక లోపాలు తలెత్తాయా? సైబర్ దాడా? దీని వెనుక అంతర్జాతీయ జోక్యం ఏమైనా ఉందా? అనే అంశాలపై దర్యాప్తు బృందం దృష్టి సారించింది.

బీబీసీ చీఫ్ డేవీ రాజీనామా!

న్యూస్ సీఈవో టర్నెస్ కూడా..

ట్రంప్ ప్రసంగాన్ని తప్పుదోవ పట్టించేలా ఎడిట్ చేశారన్న ఆరోపణలతోనే



డేవీ

లండన్, నవంబరు 10: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగాన్ని తప్పుదోవ పట్టించేలా ఎడిట్ చేశారంటూ విమర్శలు రావడంతో ఏకంగా బీబీసీ హెడ్, మరో ఉన్నతాధికారి రాజీనామా చేశారు. 2021, జనవరి 6న ట్రంప్ చేసిన ప్రసంగాన్ని 'పనోరమ' పేరిట డాక్యుమెంటరీ ప్రసారం చేశారు. ఇందులో ఆయన ప్రసంగంలోని రెండు వేర్వేరు భాగాలను కలిపి ఎడిట్ చేయడంతో 2021 జనవరిలో జరిగిన క్యాపిటల్ హిల్ అల్లర్లను ట్రంప్ ప్రోత్సహించినట్లుగా చూపించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ సీఈవో డెబోరా టర్నెస్‌లు రాజీనామా చేశారు. టిమ్ డేవీ ఐదేళ్లుగా బీబీసీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. టిమ్ డేవీ తన రాజీనామాను ప్రకటిస్తూ, సిబ్బందికి లేఖ రాశారు. "మొత్తంగా బీబీసీ చాలా బాగా పనిచేస్తోంది. కానీ, కొన్ని తప్పులు జరిగాయి. డైరెక్టర్ జనరల్‌గా వాటికి నాదే బాధ్యత. రాజీనామా పూర్తిగా నా నిర్ణయమే" అని పేర్కొన్నారు. రాజీనామాకు ఇదొక్కటే కారణం కాకపోయినప్పటికీ, బీబీసీ న్యూస్ చుట్టూ నెలకొన్న వివాదం కూడా తన నిర్ణయంపై ప్రభావం చూపిందని చెప్పారు. ఇక 'పనోరమా' వివాదం తానెంతో ఇష్టపడే బీబీసీ సంస్థకు నష్టం కలిగించే దశకు చేరుకుందని టర్నెస్ పేర్కొన్నారు. జవాబుదారీగా ఉండాలి కాబట్టే తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. బీబీసీ న్యూస్ సంస్థాగతంగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని టర్నెస్ స్పష్టం చేశారు. బీబీసీ డైరెక్టర్ జనరల్, న్యూస్ హెడ్ రాజీనామాలను స్వాగతిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. "జనవరి 6న నేను చేసిన మంచి ప్రసంగాన్ని వక్రీకరించి చూపి, దొరికిపోవడంతోనే వారు వైదొలిగారు లేదా వారిని తొలగించారు" అని అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'శివ' ఓ అద్భుతం



"శివ' చిత్రం నేటికీ ఓ అద్భుతం. 4కె డాల్బీ అట్మాస్ వెర్షన్ చూస్తున్నప్పుడు కొత్త సినిమా చూసిన అనుభూతి కలిగింది. అన్నపూర్ణ స్టూడియోస్‌కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ చిత్రం రీ రిలీజ్ కావడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. ఆయన కథానాయకుడిగా రామ్ గోపాల్ వర్మ 36 ఏళ్ల క్రితం తెరకెక్కించిన చిత్రమిది. ఈనెల 14న రీ రిలీజ్ అవుతున్న సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు.

ఇట్లు మీ రామసత్యనారాయణ



రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల 'ఆర్‌టీ 76' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనేది టైటిల్. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'నా జీవితంలో ఉన్న ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, కృత్రిమ మేధని ఆశ్రయించడంతో పాటు అనుభవమున్న మగాళ్లని.. మొగుళ్లని అడిగాను.. ఆశ్చర్యపోయారే తప్ప సమాధానం చెప్పలేకపోయారు. ఇలాంటి ప్రశ్న మీకు ఎదురుకాకూడదని.. పెళ్లైన వారికి నాలాంటి పరిస్థితి ఎదురుకాకూడదని.. ఇట్లు మీ రామసత్యనారాయణ' అంటూ రవితేజ చెప్పే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

మహేశ్‌బాబు సినిమాలో పాట పాడిన శ్రుతి



మహేశ్ బాబు హీరోగా 'ఎస్ఎస్ఎంబీ29' వర్కింగ్ టైటిల్‌తో రాజమౌళి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. సినిమా తొలి వేడుకను ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలోనే ప్రకటించనున్న టైటిల్, ఇతర అప్డేట్స్ కోసం అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో నటి శ్రుతిహాసన్ అందరూ ఆశ్చర్యపోయేలా ఓ అప్డేట్‌ని పంచుకున్నారు. ఈ చిత్రంలో తాను ఓ పవర్‌ఫుల్ పాట పాడినట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. కీరవాణి సంగీత దర్శకత్వంలో పాడటం ఆనందంగా ఉందంటూ పోస్టు పెట్టారు. ఆయనతో కలసి దిగిన ఫొటోను షేర్ చేశారు.

'స్టేబుల్ కాయిన్స్'పై ప్రవాసుల మొగ్గు



▸▸ స్వదేశానికి పంపించే నగదు విధానంలో మార్పులు
▸▸ డాలర్‌కు ప్రత్యామ్నాయంగా యూఎస్‌డీటీ వినియోగం

బ్యాంకింగ్ చానల్స్‌కు ముప్పు!

న్యూఢిల్లీ: ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) స్వదేశానికి డబ్బులు పంపించే విధానం మారిపోతోంది. ఇది వరకటిలా వారు బ్యాంకింగ్ చానల్స్‌ను ఆశ్రయించడం లేదు. డాలర్ మారకంతో ముడిపడిన యూఎస్‌డీటీ వంటి స్టేబుల్ కాయిన్స్‌ను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకింగ్ చానల్స్‌తో పోలిస్తే వీటి ద్వారా పంపించే నగదు బదిలీలకు రూపాయిల్లో 4 నుంచి 5 శాతం ప్రీమియం లభించడం ఇందుకు ప్రధాన కారణం. ఉదాహరణకు దుబాయ్ లేదా అమెరికాలోని ఒక ఎన్ఆర్ఐ భారత్‌లోని తన లేదా తమ బంధువుల బ్యాంకు ఖాతాకు 1,000 డాలర్లు పంపిస్తే సోమవారం నాటి డాలర్-రూపీ మారకం రేటు ప్రకారం భారత్‌లోని వారి బ్యాంకు ఖాతాల్లో రూ.88,711 జమవుతాయి. అదే క్రిప్టో కరెన్సీకి చెందిన యూఎస్‌డీటీ అనే స్టేబుల్ కాయిన్ కొని అక్కడి స్థానిక మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ల ద్వారా భారత్‌కు పంపిస్తే దాదాపు రూ.94,000 జమవుతాయి.

బదిలీ ఇలా...

కాకపోతే ఆ మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ ఆ స్టేబుల్ కాయిన్స్‌ను మళ్లీ భారత్‌లోని మరో అనధికారిక మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌కు అమ్ముతాడు. ఇక్కడి ఏజెంట్ ఆ రోజు ఉన్న డాలర్-రూపీ మారకం రేటు ప్రకారం అమెరికా లేదా దుబాయ్ నుంచి డబ్బు పంపించే లేదా వారు చెప్పిన వ్యక్తుల చేతికి లేదా బ్యాంకులో ఈ మొత్తాన్ని జమ చేస్తాడు. అయితే ఇది అనధికారికం కావడంతో ఎక్కువ మంది దీనికి ఇష్టపడడం లేదు. అయినా ప్రస్తుతం ఎన్ఆర్ఐలు స్వదేశానికి పంపించే డబ్బుల్లో 3 నుంచి 4 శాతం ఈ మార్గంలో వస్తున్నట్టు సమాచారం.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,220 ▲	1,12,950 ▲	1,67,000 ▲
విజయవాడ	1,26,000 ▲	1,18,000 ▲	1,56,700 ▲
విశాఖపట్నం	1,26,680 ▲	1,12,950 ▲	1,67,000 ▲
రాజమండ్రి	1,23,220 ▲	1,12,950 ▲	1,51,000 ▲
ప్రొద్దుటూరు	1,22,600 ▲	1,12,790 ▲	1,55,500 ▲
ముంబై	1,22,441 ▲	1,12,156 ▲	1,51,643 ▲

2026 డిసెంబరు నాటికి నిఫ్టీ 29,000



అంతర్జాతీయ బ్రోకరేజీ సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ భారత స్టాక్ మార్కెట్‌పై సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మన మార్కెట్ రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్' స్థాయికి పెంచింది. 2024 అక్టోబరులో రేటింగ్‌ను తటస్థ స్థాయికి తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్. 13 నెలలకే మళ్లీ తన వైఖరిని మార్చుకోవడం గమనార్హం. అంతేకాదు, నిఫ్టీ-50 సూచీ 2026 డిసెంబరు నాటికి 29,000 స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేసింది. గత వారాంతం స్థాయితో పోలిస్తే ఇది 14 శాతం అధికం. ప్రభుత్వ విధానాల సడలింపు, పెరుగుతున్న ఆదాయం, ఇన్వెస్టర్లలో మెరుగైన సెంటిమెంట్ ఇందుకు దోహదపడనున్నాయని తాజా నోట్‌లో పేర్కొంది. ఆర్థిక సేవలు, వినియోగం, రక్షణ, ఇంధన విక్రయ రంగ సంస్థలు వచ్చే ఏడాది కాలంలో మెరుగైన పనితీరు కనబరచవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ ప్రస్తావించింది. దేశీయ గిరాకీ, మూలధన వ్యయాలు, కార్పొరేట్ల బలమైన బ్యాలెన్స్‌షీట్లు ఇందుకు తోడ్పడనున్నాయని అంటోంది.

3 రోజుల తర్వాత లాభాల్లోకి.. సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ మూడు రోజుల వరుస నష్టాల నుంచి కాస్త తేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో ర్యాలీతో పాటు ఐటీ, ఆర్థిక సేవల రంగాల షేర్లలో కొనుగోళ్లతో ప్రామాణిక సూచీలు సోమవారం ఒక మోస్తరుగా లాభపడ్డాయి. ఒక దశలో 538.21 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్. చివరికి 319.07 పాయింట్ల లాభంతో 83,535.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82.05 పాయింట్ల వృద్ధితో 25,574.35 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ షేరు 2.52 శాతం లాభపడి సూచీ టాప్ గెయిరన్‌గా నిలిచింది.

లెన్స్‌కార్ట్ లిస్టింగ్..ప్స్!

లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ ఐపీఓ ఏకంగా 28.26 రెట్ల సబ్‌స్ర్కిప్షన్‌ను దక్కించుకున్నప్పటికీ లిస్టింగ్ మాత్రం నిరాశపరిచింది. ఐపీఓ ధర రూ.402తో పోలిస్తే, బీఎస్ఈలో ఈ షేరు 2.98% నష్టంతో రూ.390 వద్ద లిస్టయింది. ఒక దశలో 11.52% వరకు క్షీణించినప్పటికీ, వెంటనే కోలుకుని 2.93% వరకు పెరిగింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి కేవలం 0.32 శాతం లాభంతో రూ.403.30 వద్ద స్థిరపడింది.

బిర్లా న్యూ చేతికి క్లీన్‌కోట్స్

డీల్ విలువ రూ.120 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నిర్మాణ రంగానికి అవసరమైన ప్రత్యేక రసాయనాలను ఉత్పత్తి చేసే సంస్థ క్లీన్ కోట్స్‌ను రూ.120 కోట్లకు కొనుగోలు చేసినట్టు భవన నిర్మాణ ఉత్పత్తుల రంగంలోని బిర్లా న్యూ (గతంలో హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్ఐఎల్) ప్రకటించింది. తమ నిర్మాణ రసాయనాల పోర్టుఫోలియో మరింతగా విస్తరించేందుకు, తద్వారా మౌలిక వసతులు, పారిశ్రామిక రంగాలకు ఉత్పత్తులను విస్తరించేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని తెలిపింది. 1999లో ఏర్పాటైన క్లీన్ కోట్స్ కంపెనీ 27 పైగా దేశాలకు తమ ఉత్పత్తులు ఎగుమతి చేస్తుంది. ఈ కొనుగోలుతో క్లీన్ టెక్ టెక్నికల్ నైపుణ్యాలు, ఫార్ములేషన్లతో పాటు ఎగుమతి సామర్థ్యాలు కూడా తమకు జోడవుతాయని, మార్కెట్ విస్తరణకు దోహదపడతాయని బిర్లా న్యూ ఎండీ, సీఈఓ అక్షత్ సేథ్ అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	108
కర్నూలు	100	నెల్లూరు	113
విశాఖపట్నం	108	అనంతపురం	113
గోదావరి	106		

ఫాస్ట్ ఫుడ్ విభాగంలోకి హల్దీరామ్

న్యూఢిల్లీ: హల్దీరామ్ కంపెనీ పాశ్చాత్య ఫాస్ట్ ఫుడ్ విభాగంలోకి ప్రవేశించబోతున్నట్లు తెలిసింది. ఫాస్ట్ ఫుడ్ సెగ్మెంట్లో సబ్‌వే, టిమ్ హార్టన్స్‌కు పోటీగా అమెరికాకు చెందిన శాండ్‌విచ్ విక్రయ స్టోర్ల బ్రాండ్ 'జిమ్మీ జాన్స్'ను భారత్‌కు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. జిమ్మీ జాన్స్ బ్రాండ్ యాజమాన్య సంస్థ ఇన్‌స్పైర్ బ్రాండ్స్‌తో ఫ్రాంఛైజీ ఒప్పందం కుదుర్చుకునేందుకు హల్దీరామ్స్ ఇప్పటికే చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్ ద్వారా హల్దీరామ్ జిమ్మీ జాన్స్ శాండ్‌విచ్ స్టోర్లను భారత్‌లో ప్రారంభించాలనుకుంటోంది.

మార్కెట్లోకి మరో వెయిట్‌లాస్ ఔషధం

న్యూఢిల్లీ: మార్కెట్లోకి మరో వెయిట్ లాస్ ఔషధం అందుబాటులోకి రానుంది. శరీర బరువును తగ్గించడంలో ఉపయోగపడే పోవిట్రా...సెమాగ్లుటైడ్ 2.4 ఎంజీ ఇంజెక్షన్‌ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టేందుకు నోవో నార్డిస్క్, ఎంక్యూర్ ఫార్మా భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. మార్కెట్లోకి వస్తున్న రెండో బ్రాండ్ ఇది. ఈ ఏడాది జూన్‌లో వెయిట్ లాస్ ఔషధం విగోవీని (సెమాగ్లుటైడ్ 2.4 ఎంజీ ఇంజెక్షన్) ప్రవేశపెట్టారు. పోవిట్రా... సెమాగ్లుటైడ్ 2.4 ఎంజీ ఇంజెక్షన్‌ను వాణిజ్యపరంగా పంపిణీ చేసే ప్రత్యేక హక్కులు కలిగిన తొలి భారతీయ కంపెనీ తమదే అవుతుందని ఎమ్‌క్యూర్ ఫార్మా సీఈఓ సతీష్ మెహతా అన్నారు.

నెఫ్రోప్లస్ ఐపీఓకు సెబీ ఆమోదం

నెఫ్రోప్లస్ బ్రాండ్‌నేమ్‌తో డయాలసిస్ సేవలందిస్తోన్న హైదరాబాద్ కంపెనీ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ ఐపీఓకు సెబీ ఆమోదం లభించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.353.4 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్ల వాటాకు చెందిన 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. మొత్తంగా ఐపీఓ ద్వారా కంపెనీ రూ.2,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.

జోరుగా ఇళ్ల అమ్మకాలు



మార్చి నాటికి రూ.6.65 లక్షల కోట్లకు : అనరాక్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.2.98 లక్షల కోట్ల విలువైన 1.93 లక్షల ఇళ్లు అమ్ముడయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే సంఖ్యాపరంగా ఇళ్ల అమ్మకాలు 34,000 తగ్గాయి. అయితే విలువపరంగా చూస్తే మాత్రం అమ్మకాలు 7 శాతం పెరిగాయి. అమ్ముడైన ఇళ్ల సంఖ్య తగ్గినా, సగటు అమ్మకం విలువ పెరగడంతో గత ఆరు నెలల్లో మార్కెట్ కోలుకుంది. అమ్మకాల జోరు ఇలానే కొనసాగితే మార్చి ముగిసే నాటికి అమ్మకాల విలువ రూ.6.65 లక్షల కోట్లకు చేరుతుందని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 22 శాతం ఎక్కువ. హైదరాబాద్‌లో నివాస గృహాల మార్కెట్ మరింత జోరుగా ఉందని బిల్డర్లు చెబుతున్నారు. నగరంలో పెరుగుతున్న మౌలిక సదుపాయాలు, ఇన్వెస్టర్ల నమ్మకం, మిడ్ టు హై ఎండ్ ఇళ్లకు పెరుగుతున్న గిరాకీ ఇందుకు ప్రధాన కారణం.

'డాక్టర్ రెడ్డీస్'పై సైబర్ కేటుగాళ్ల వల

రూ.2.16 కోట్లు కొట్టేసే యత్నం

బెంగళూరు: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యులనే కాదు.. బడా కంపెనీలనూ టార్గెట్ చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌పైనా కన్నేశారు. బెంగళూరు కేంద్రంగా పనిచేసే గ్రూప్ ఫార్మాస్యూటికల్స్‌కు డాక్టర్ రెడ్డీస్ చెల్లించాల్సిన రూ.2.16 కోట్లు కొట్టేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇందుకోసం ఈ నెల 3వ తేదీన సైబర్ కేటుగాళ్లు అనధికారికంగా ఈ రెండు కంపెనీల ఈ-మెయిల్స్‌లోకి జొరబడి.. గ్రూప్ ఫార్మాస్యూటికల్స్ పేరు మీద బోగస్ బ్యాంకు ఖాతాలు సృష్టించారు. తర్వాత గ్రూప్ ఫార్మాకు డాక్టర్ రెడ్డీస్ నుంచి రావలసిన రూ.2.16 కోట్ల బకాయిలను ఆ ఖాతాల్లో వేయాలని కోరారు. దీన్ని నమ్మి డాక్టర్ రెడ్డీస్ ఈ నెల నాలుగో తేదీన ఆ మొత్తాన్ని ఆ ఖాతాల్లో జమ చేసింది. అయితే గ్రూప్ ఫార్మాకు చెందిన కే మహేశ్ బాబు అనే సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెంటనే ఈ సైబర్ మోసాన్ని గుర్తించి బెంగళూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బ్యాంకులను అప్రమత్తం చేసి ఈ మొత్తం సైబర్ కేటుగాళ్ల చేతికి చిక్కకుండా స్తంభింప చేశారు. సైబర్ మోసగాళ్లు ఈ బ్యాంకు ఖాతాలను గుజరాత్‌లోని వడోదరలోని ఒక బ్యాంకులో తెరిచినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాగా ఈ సైబర్ మోసంతో కంపెనీకి ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

హైదరాబాద్‌లో సోనాటైప్ ఇన్నోవేషన్ హబ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ సప్లయ్ చెయిన్ సెక్యూరిటీ రంగంలోని సోనాటైప్ హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించినట్టు ప్రకటించింది. 200 మంది ఇంజనీర్లు, ప్రోడక్ట్ లీడర్లు, డేటా సైంటిస్టులు, ఏఐ నిపుణులు ఉండే ఈ కేంద్రం తమ ఇన్నోవేషన్ హబ్‌లలో అతి పెద్దదని, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్ అండ్ డీ హబ్ అని కంపెనీ సీఈఓ భగవత్ స్వరూప్ తెలిపారు. ఏఐ ఇన్నోవేషన్, ఓపెన్ సోర్స్ సెక్యూరిటీని పటిష్ఠం చేసేందుకు ఈ హబ్ దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 50 మంది నిపుణులు పనిచేస్తుండగా రానున్న రోజుల్లో మరో 150 మందిని నియమించుకోనున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా మేరీల్యాండ్‌లోని ఫుల్టన్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న సోనాటైప్ బ్రిటన్, ఆస్ట్రేలియా, కొలంబియాల్లో కార్యాలయాలు కలిగి ఉన్నదని, తాజాగా హైదరాబాద్ హైటెక్ సిటీలో ప్రపంచంలోనే అతిపెద్ద హబ్‌ను ప్రారంభించిందని సోనాటైప్ ఇండియా హెడ్, సీనియర్ డైరెక్టర్ అభిషేక్ చౌహాన్ తెలిపారు.

స్టార్‌రెజ్ కార్యాలయం ప్రారంభం: స్టూడెంట్ హౌసింగ్ సాఫ్ట్‌వేర్ తయారీదారు స్టార్‌రెజ్ హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించింది. ఇది ఏఐ ఆధారిత ఇన్నోవేషన్, డేటా ఇంటెలిజెన్స్ కేంద్రంగా పని చేస్తుందని కంపెనీ ప్రకటించింది. ఈ కేంద్రం అత్యాధునిక ప్రోడక్ట్ ఇంజనీరింగ్ సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా ఆధునిక సాస్ ఆర్కిటెక్చర్, ప్రపంచ శ్రేణి వ్యవస్థల్లో పని చేసే అవకాశం భారతీయ టెక్నాలజీ నిపుణులకు అందిస్తుందని స్టార్ రెజ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ట్రావిస్ నైప్ అన్నారు. రాబోయే 18 నెలల కాలంలో తమ టీమ్‌ల సంఖ్యను 40 నుంచి 200కి పెంచడం లక్ష్యమని నైప్ చెప్పారు.

స్పోర్ట్స్



ఇషా బృందానికి రజతం

● సమ్రాట్‌కు రెండు స్వర్ణాలు
● షూటింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్

కైరో: వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ సారథ్యంలోని భారత మహిళల జట్టు రజతం నెగ్గగా.. యువ ఆటగాడు సమ్రాట్ రాణా టీమ్ ఈవెంట్‌తో పాటు వ్యక్తిగత విభాగం స్వర్ణంతో డబుల్ ధమాకా సృష్టించాడు. సోమవారం జరిగిన పోటీల్లో ఇషా, మను భాకర్, సురుచిల బృందం మొత్తం 1740 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనాకు స్వర్ణం, కొరియాకు కాంస్యం దక్కాయి. 10 మీ. పురుషుల టీమ్ ఈవెంట్‌లో సమ్రాట్, వరుణ్ తోమర్, శ్రవణ్ త్రయం మొత్తం 1754 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇటలీ, జర్మనీ జట్లు రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకొన్నాయి. పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సమ్రాట్ 243.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం అందుకోగా.. వరుణ్ (221.7) కాంస్యం నెగ్గాడు. చైనా షూటర్ కై హు రజతం సాధించాడు.

హైదరాబాద్ ఆధిక్యం 293

ప్రస్తుతం 198/7 ● రాజస్థాన్ 269 ఆలౌట్

హైదరాబాద్: గ్రూప్-డిలో రాజస్థాన్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్‌కు కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఆటకు మూడో రోజు రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 198/7 స్కోరు చేసింది. సోమవారం ఆట ముగిసే సమయానికి రోహిత్ రాయుడు (19), తనయ్ త్యాగరాజన్ (3) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ రాహుల్ సింగ్ (59), హిమతేజ (41) రాణించారు. 95 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి హైదరాబాద్ 293 రన్స్ లీడ్‌లో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 221/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రాజస్థాన్ 269 పరుగులకు కుప్పకూలింది. కునాల్ సింగ్ (83), అజయ్ సింగ్ (58) హాఫ్ సెంచరీలు సాధించారు. చామా మిలింద్, తనయ్ త్యాగరాజన్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 364 పరుగులు చేసింది. కాగా, గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 4 వికెట్ల తేడాతో తమిళనాడుపై గెలిచింది.

అకాడమీలు అటే పాయె!

ఆధునీకీకరణ పేరిట హైదరాబాద్‌కు తరలింపు | తిరిగిరాని వైనం

నిరుపయోగంగా రూ. 5.5 కోట్ల సింథటిక్ ట్రాక్
● ఖాళీగా హాస్టల్ భవనం
● పట్టించుకోని సాయ్, శాట్

మెదక్ స్టేడియం కళా విహీనం





మెదక్ (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 80 మందికిపైగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే అథ్లెటిక్స్, బాక్సింగ్ అకాడమీలతో ఒక వెలుగు వెలిగిన మెదక్ అవుట్‌డోర్ స్టేడియం ఇప్పుడు కనీస సౌకర్యాలు లేక వెలవెలబోతుంది. 2000వ సంవత్సరంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు హయాంలో స్థానిక మంత్రి కరణం రామచంద్రరావు కృషితో ఈ స్టేడియం నిర్మించారు. ఇందులో తొలుత బాక్సింగ్ అకాడమీని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్), అథ్లెటిక్స్ అకాడమీని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) నిర్వహించేవి. 2003-2004లో ఇక్కడి బాక్సింగ్ అకాడమీని హైదరాబాద్‌కు తరలించారు. ఆ తర్వాత 2018 వరకు సాయ్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ అకాడమీని నడిపారు. ఖేలో ఇండియా నిధుల కింద 2018లో సింథటిక్ ట్రాక్ వేసేందుకు మెదక్ స్టేడియానికి రూ.5.5 కోట్ల నిధులను సాయ్ మంజూరు చేసింది. సింథటిక్ ట్రాక్ పనులు మొదలయ్యాక ప్రాక్టీసు చేయడానికి ఇబ్బంది అవుతోందని అకాడమీని తాత్కాలికంగా హైదరాబాద్‌కు తరలించారు. 2019లో ఎనిమిది లేన్ల సింథటిక్ ట్రాక్ పనులు పూర్తయ్యాక తిరిగి అకాడమీ కార్యకలాపాలను ప్రారంభించాలని లేఖ రాయగా, హాస్టల్ భవనంతో పాటు ఇతర్రతా సదుపాయాలు కూడా ఆధునికీకరించాలని సాయ్ నుంచి స్పందన వచ్చింది. దానికి తగ్గట్టుగా సుమారు రూ.1 కోటి 43 లక్షలు వెచ్చించి దశల వారీగా ఆధునికీకరణ పనులు చేపట్టారు. తొలుత రూ.70 లక్షలతో పెయింటింగ్, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీల ఏర్పాటుతో పనులు పూర్తి చేశారు. తర్వాత సింథటిక్ ట్రాక్ చుట్టూ రూ.18 లక్షలతో ఫెన్సింగ్ ఏర్పాటు, ట్రాక్ మధ్యలో రూ.40 లక్షలతో ఫుట్‌బాల్ మైదానం అభివృద్ధి, రూ.15 లక్షలతో క్రీడా సామగ్రి కొనుగోలు చేశారు.

'సాయ్' స్పందన ఏదీ..?

సింథటిక్ ట్రాక్ వేయకముందు అథ్లెటిక్స్ అకాడమీలో 36 మంది క్రీడాకారులు ఉండేవారు. ఓ ప్రధాన కోచ్ సహా ఏడుగురు సాయ్ సిబ్బంది విధులు నిర్వర్తించేవారు. కానీ, తాత్కాలికంగా హైదరాబాద్‌కు తరలించిన అకాడమీ.. ఆధునికీకరణ పనులు చేపట్టాక మాత్రం తిరిగి సొంతగూటికి రాలేక పోవడం గమనార్హం. అకాడమీని మళ్లీ మెదక్‌కు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ స్థాయిలో ఎన్ని లేఖలు రాసినా సాయ్ నుంచి స్పందన లేదు. 2023లో సాయ్-బెంగళూరు కేంద్రం రీజనల్ డైరెక్టర్ రీతూ పాఠక్ మెదక్ కేంద్రాన్ని సందర్శించి అథ్లెటిక్స్‌తో పాటు ఫుట్‌బాల్ అకాడమీలను ఇక్కడ ప్రారంభించడానికి అనువైన సదుపాయాలున్నాయని సంతృప్తి వ్యక్తం చేసినా, అందుకు తగ్గట్టు అడుగులు పడలేదు. ఇక్కడ ఫుట్‌బాల్ అకాడమీ కోసం మెదక్ ఫుట్‌బాల్ సంఘం.. సాయ్ పెద్దలను ఎన్నిసార్లు కలిసినా ఫలితం లేకపోయింది.

శాట్‌కు బాధ్యత లేదా?

హైదరాబాద్‌కు తరలించిన అకాడమీలను తిరిగి సొంతగూటికి తీసుకురావాల్సిన విషయంలో శాట్ కూడా బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాయ్‌తో శాట్ అధికారులు సంప్రదించి ఈ విషయంలో పరిష్కారం చూపించాల్సిన అవసరముంది. ఒకవేళ సాయ్ స్పందించకపోతే.. ఇక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలకు అనుగుణంగా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, బాక్సింగ్ అకాడమీలను శాట్ స్వయంగా ప్రారంభించాలని క్రీడాకారులు కోరుతున్నారు. తక్షణమే కోచ్‌లతో పాటు ఇతర సహాయ సిబ్బందిని నియమించి మెదక్ అవుట్‌డోర్ స్టేడియంకు పూర్వ వైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..!

ప్రస్తుతం మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో వాచ్‌మన్ కమ్ గ్రౌండ్స్‌మన్ మినహా ఎవరూ కనిపించరు. దీంతో స్టేడియం లోపల పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. సింథటిక్ ట్రాక్‌కు కొన్ని చోట్ల పగుళ్లు రాగా, మరికొన్ని ప్రదేశాల్లో ఉబ్బిపోయింది. 80 మందికి వసతి గల హాస్టల్ భవంతి నిరూపయోగంగా మారిపోయింది. స్టేడియం పూర్తిగా కళావిహీనంగా మారిందని క్రీడాకారులు, వాళ్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేడియం వాడుకలో లేకపోవడంతో రాత్రివేళ్లలో ఇక్కడ ఆకతాయిలు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఏసీబీ కేసులు కొట్టేయలేమన్న హైకోర్టు

హెచ్‌సీఏ మాజీ చీఫ్ వినోద్‌కు చుక్కెదురు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు, బెల్లంపల్లి ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు రాష్ట్ర హైకోర్టులో చుక్కెదురైంది. వినోద్ హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఏసీబీ ఆయనపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. హెచ్‌సీఏ కార్యకలాపాల నిర్వహణలో తీవ్రమైన ఆర్థిక అవకతవకలను ఎత్తి చూపిన న్యాయస్థానం అదంతా ప్రజల సొమ్ము అని గుర్తు చేసింది. బ్యాంకు గ్యారెంటీలు లేకుండా కాంట్రాక్టులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు.. ఏసీబీ కేసులను కొట్టి వేయలేమని తేల్చి చెప్పింది. కేసు దర్యాప్తు వివరాలతో పాటు చార్జిషీట్ ప్రస్తుత స్థితిగతులను తెలియజేయాలని ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను ఈనెల 25కు న్యాయస్థానం వాయిదా వేసింది. ఇక, వాదనల్లో భాగంగా విశాక పరిశ్రమకు అనుకూలంగా వ్యవహరించి, ఆ సంస్థకు లబ్ధి చేకూరేలా వినోద్ వ్యవహరించారని ఏసీబీ న్యాయవాదులు గట్టిగా వాదించారు.

ఆసియా ఆర్చరీ ఫైనల్లో సురేఖ త్రయం

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలకు అడుగు దూరంలో నిలిచారు. పురుషుల రికర్వ్ టీమ్, మహిళల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. మహిళల కాంపౌండ్‌లో తెలుగమ్మాయి జ్యోతి సురేఖ, దీప్షిక, ప్రతికా ప్రదీప్‌లతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో 234-227తో ఆతిథ్య ఢాకా జట్టును చిత్తుచేసి కొరియాతో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. ఇక, పురుషుల రికర్వ్ సెమీస్‌లో యష్‌దీప్, అతాను దాస్, రాహుల్‌లతో కూడిన భారత బృందం 5-3తో కజకిస్థాన్‌ను ఓడించింది. తుదిపోరులో కొరియాతో డిఫెండింగ్ చాంప్ భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

ఆడమంటే ఆడనన్నాడు

షమి చెప్పేవి నిజాలుకాదు.. బీసీసీఐ అధికారి



న్యూఢిల్లీ: వెటరన్ పేసర్ మహ్మద్ షమి ఈ ఏడాది మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత జరిగిన ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌తో పాటు ఆసియాకప్ టీ20 టోర్నీ, ఆస్ట్రేలియా పర్యటనకు సైతం అతడిని సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. షమికి టెస్టులు ఆడే ఫిట్‌నెస్ లేదనే ఆలోచనలో బీసీసీఐ ఉంటోంది. ఇదే విషయమై షమి, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. సెలెక్టర్లు తనను సంప్రదించడం లేదని, ఫిట్‌గా లేకపోతే తాను రంజీలు ఎలా ఆడగలనని ప్రశ్నిస్తున్నాడు. అయితే బీసీసీఐ వాదన మరోలా ఉంది. అతడిని ఇంగ్లండ్ పర్యటనకు పంపేందుకు సెలెక్షన్ ప్యానెల్ ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదని బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు. ఈ విషయమ్మై షమి చెబుతున్నవి నిజాలు కాదని ఆయన అన్నారు. 'ఇంగ్లండ్ టూర్‌లో బుమ్రా మూడు టెస్టుల్లో మాత్రమే ఆడతాడు కాబట్టి అక్కడికి షమిని పంపాలని జాతీయ సెలెక్టర్లు భావించారు. ఇందుకోసం సెలెక్టర్లు, సీఓఈ సిబ్బంది అతడిని సంప్రదించేందుకు చాలాసార్లు ఫోన్ ద్వారా ప్రయత్నించారు. ముందుగా ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడేందుకు భారత్ 'ఏ' తరఫున బరిలోకి దించాలనుకున్నాం. తద్వారా అతడి ఫిట్‌నెస్‌పై అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈ ఆఫర్‌ను షమి తిరస్కరించాడు. మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం తగినంత సమయం కావాలని చెప్పాడు. అంతేకానీ.. షమితో ఎలాంటి సంభాషణ జరగలేదనే కథనాలు నిజం కావు' అని ఆ అధికారి వివరించాడు.

స్టేడియానికి రిచా పేరు!

● ప్రకటించిన సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: సిలిగురిలో కొత్తగా నిర్మించేబోయే స్టేడియానికి ప్రపంచకప్ నెగ్గిన భారత మహిళల జట్టు సభ్యురాలు రిచా ఘోష్ పేరు పెట్టనున్నట్టు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. 'సిలిగురిలో 27 ఎకరాల స్థలం ఉంది. అక్కడ క్రికెట్ స్టేడియం నిర్మించే ఆలోచన చేయమని మేయర్‌కు సూచించా. దానికి రిచా పేరు పెడితే భవిష్యత్ తరాలకు ప్రేరణగా ఉంటుంది' అని బెనర్జీ అన్నారు.

ఎవరి ధీమా వారిదే



(మొదటిపేజీ తరువాయి)



వారు తేల్చనున్నారు. అయితే ఇన్ని రోజులుగా నిర్వహించిన ప్రచారం.. ఓటర్ల స్పందనను బట్టి ఉప ఎన్నికలో తమ పార్టీ జెండానే ఎగరడం ఖాయమంటూ అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల్లో ఎలా గెలుస్తామన్న దానిపై అంచనాలూ వేసుకుంటున్నాయి. బీజేపీ సైతం గట్టి పోటీ ఇస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తోంది. కాగా, రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లిట్మస్ టెస్టుగా మారింది. కంటోన్మెంట్ మినహా హైదరాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రాతినిధ్యం లేకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. డివిజన్‌కు ఇద్దరు చొప్పున మంత్రులను ఇన్‌చార్జులుగా నియమించడమే కాకుండా.. పార్టీ యంత్రాంగం మొత్తాన్నీ వారంరోజులుగా నియోజకవర్గంలోనే మోహరించారు. అన్ని డివిజన్లనూ చుట్టేస్తూ స్వయగా రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రచారం చేశారు. మంత్రులూ తమకు కేటాయించిన డివిజన్లలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌కు సిటింగ్ సీటు కాకపోయినా..

వాస్తవానికి జూబ్లీహిల్స్ సీటు.. కాంగ్రెస్ పార్టీకి సిటింగ్ సీటు కాదు. వరుసగా 2014, 2018, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం దక్కలేదు. కానీ, హైదరాబాద్‌లో పార్టీ ప్రాతినిధ్యం పెంచుకునేందుకు, ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూల వైఖరి ఉందని చాటుకునేందుకు ఈ ఎన్నికను కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శక్తియుక్తులన్నీ కేంద్రీకరించి పని చేసింది. నియోజకవర్గంలోని మైనారిటీ ఓటర్లను ఆకర్షించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు మంత్రి పదవి కూడా ఇచ్చారు. అలాగే ఎంఐఎం మద్దతునూ కూడగట్టారు. గతంలో ఈ నియోజకవర్గంలోని ముస్లింలలో అత్యధికులు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉండేవారని, కానీ.. లోక్‌సభ ఎన్నికల నాటికి వారిలో ఎక్కువ మంది కాంగ్రెస్‌కు మద్దతు పలికారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ గెలిచినా.. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థికే మెజారిటీ వచ్చిందని గుర్తు చేస్తున్నాయి. ఇక తమ అభ్యర్థి నవీన్‌యాదవ్ బీసీ, విద్యాధికుడు కావడం, బీసీ సంఘాలు పూర్తి మద్దతు ఇవ్వడంతో బీసీల్లోని మెజారిటీ ఓటర్లు ఆయన వైపే మొగ్గు చూపుతున్నారని అంటున్నారు.

భారీ మెజారిటీపై హస్తం పార్టీ అంచనా

క్రిస్టియన్ మైనారిటీలు, ఎస్సీ వర్గాలు కూడా కాంగ్రెస్ వైపే మొగ్గు చూపుతున్నాయని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సెటిలర్లు సైతం కాంగ్రెస్ పార్టీకే మద్దతుగా ఉన్నారని అంచనా వేస్తున్నారు. అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి చేసుకోవచ్చునన్న ప్రచారాన్ని పార్టీ విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లింది. సాధారణంగా తటస్థ ఓటర్లు ఉప ఎన్నికల్లో అధికార పార్టీ వైపే మొగ్గు చూపుతుంటారని, గతంలో పాలేరు, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు నిదర్శనమని కాంగ్రెస్ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అలాగే మజ్లిస్‌తోపాటు సీపీఐ, సీపీఎం, టీజేఎస్ పార్టీల మద్దతూ తమకు కలిసివస్తుందని చెబుతున్నాయి. ఈసారి ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని పెట్టి.. ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఓటింగ్ శాతం పెరిగితే తమ అభ్యర్థి మెజారిటీ కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నాయి. ఏది ఏమైనా ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ కచ్చితంగా గెలుస్తుందని, అన్ని సమీకరణలూ కుదిరితే భారీ మెజారిటీ కూడా రావచ్చని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పట్టు నిలుపుకొనేందుకు బీఆర్‌ఎస్ పోరాటం..

సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాక హైదరాబాద్ జిల్లాలో పట్టు నిలుపుకొనేందుకు ఈ ఉప ఎన్నికను బీఆర్‌ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మాగంటి గోపీనాథ్ సతీమణినే అభ్యర్థిగా నిలిపి.. సెంటిమెంట్ అస్త్రాన్ని సంధించింది. పార్టీ యంత్రాంగం మొత్తాన్ని మోహరించడంతో పాటు కేటీఆర్, హరీశ్‌రావు విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రచారం మధ్యలో హరీశ్‌రావు తండ్రి చనిపోవడంతో ఆయన ఇంటికే పరిమితం కావాల్సి వచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను రౌడీషీటర్‌గా ప్రచారం చేస్తూ.. కట్టడి చేసే ప్రయత్నం బీఆర్‌ఎస్ నేతలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని టార్గెట్‌గా చేసుకుని కేటీఆర్, హరీశ్ ప్రచారం సాగింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలు తమ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపిస్తాయని బీఆర్‌ఎస్ వర్గాలు అంటున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించే లక్ష్యంతో ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని, ఈ ఉప ఎన్నికలో వారు తిరిగి బీఆర్‌ఎస్‌కే మద్దతుగా ఉంటారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా పట్ల బస్తీల ప్రజల్లో వ్యతిరేకత ఉందని, బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా వారు తమ నిరసన వ్యక్తం చేస్తారని చెబుతున్నారు. అయితే గోపీనాథ్ కుటుంబంలో చెలరేగిన వివాదాన్ని ప్రజలు ఎలా తీసుకుంటారన్న ఆందోళన బీఆర్‌ఎస్ నేతల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే పార్టీ అభ్యర్థికి మద్దతుగా కేసీఆర్ ప్రచారం చేయకపోయినా.. ప్రకటన కూడా చేయకపోవడం, ఈ అంశాన్ని రేవంత్ లేవనెత్తడం బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికరంగా మారిందంటున్నారు.


బలం పెంచుకునే దిశగా బీజేపీ!

ఉప ఎన్నికలో బీజేపీ తన బలం పెంచుకుని గట్టి పోటీ ఇస్తుందన్న ఆశాబావాన్ని ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ పార్టీ జాతీయ నాయకులను దించకుండా రాష్ట్ర నాయకుల ప్రచారంపైనే ఆధారపడింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులువిస్తృతంగా ప్రచారం చేశారు. కిషన్‌రెడ్డి.. ప్రచార భారం మొత్తం తనపైనే వేసుకుని నడిపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన మార్కు ప్రచారంతో కార్యకర్తల్లో ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. బీజేపీకి డిపాజిట్ కూడా దక్కదన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరుల్లో పట్టుదల పెరిగిందని, ఎవరూ ఊహించని స్థాయిలో తమకు ఓటింగ్ పెరుగుతుందని ఆ పార్టీ నేతలు అంటున్నారు. తమ అభ్యర్థి గట్టి పోటీ ఇస్తారని అంచనా వేస్తున్నారు.

నిఘా నీడలో జూబ్లీహిల్స్

నేడే ఉప ఎన్నిక పోలింగ్.. ఉదయం 7నుంచి 6 గంటల వరకు

- అడుగడుగునా పోలీస్ బందోబస్తు
- సుమారు 800 సీసీటీవీ కెమెరాలు..
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం
- తొలిసారిగా డ్రోన్లతో పోలింగ్ పర్యవేక్షణ



పోలింగ్ సమయంలో పర్యవేక్షణకు ఈసీ అధికారులు సిద్ధం చేసిన డ్రోన్లు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. నియోజకవర్గంలో 4,01,635 ఓటర్లు ఉండగా.. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ కోసం 139 ప్రాంతాల్లో 407 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సగటున ఒక్కో పోలింగ్ కేంద్రంలో 986 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. మొత్తం 2060 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా, 2వేల మంది పోలీసులు బందోబస్తు బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 67 ప్రాంతాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించిన దృష్ట్యా.. ఎనిమిది కంపెనీల కేంద్ర బలగాలతో బందోబస్తు ఉంటుందన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా డ్రోన్ల ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించనున్నామని తెలిపారు. అదే సమయంలో ప్రైవేటు వ్యక్తులు డ్రోన్లను వినియోగించేందుకు అనుమతి లేదన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళి పర్యవేక్షించనున్నారు.

నేడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్

సోమవారం సాయంత్రం కోట్ల విజయభాస్కర్ రెడ్డి మొదటి పటాలం మైదానంలో డ్రోన్ కెమెరాల ద్వారా పోలింగ్ కేంద్రాల నిర్వహణ, పరిశీలనను ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి, ఆర్‌వీ కర్ణన్ ప్రారంభించారు. మొత్తంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గమంతా నిఘా నీడలో ఉండనుంది.

800 సీసీ కెమెరాలతో

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, మొబైల్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. ఈవీఎంలు మొరాయించినా, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు ఈసీఐఎల్‌కు చెందిన 40 మంది ఇంజనీర్లు అందుబాటులో ఉంటారు. శాంతి భద్రతల వంటి సమస్యలు తలెత్తితే డయల్ 100, 1950కు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసులతోపాటు.. కేంద్ర సాయుధ బలగాలు డేగ కళ్లతో పహారా కాస్తుంటాయని పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. 407 పోలింగ్ కేంద్రాల పరిసరాలతో పాటు.. ఇతర ప్రధాన రూట్లలో కలిపి సుమారు 800 వరకు సీసీటీవీ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం గుర్తించిన 68 సమస్యాత్మక పోలింగ్‌స్టేషన్ల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో గట్టి భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. జూబ్లీహిల్స్‌లో ఓటు హక్కు ఉన్నవారికి సెలవు ఇవ్వాలని ప్రైవేట్ సంస్థలకూ జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. 2023 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 47.58 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి ఎంత శాతం ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

టెక్నో కల్చరల్ ఫెస్టివల్‌కు 55 లక్షలు మంజూరు

- కళలకు రాష్ట్రాన్ని కేంద్ర బిందువు చేయడమే లక్ష్యం:
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ) ఈ నెలలో నిర్వహించే 'తెలంగాణ-నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్ : టెక్నో కల్చరల్ ఫెస్టివల్-కల్చరల్ సావర్నిటీ త్రూ సినిమా' కార్యక్రమానికి ప్రభుత్వం రూ.55 లక్షలు మంజూరు చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్, హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లలో ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర సినీ-సాంస్కృతిక రంగాన్ని దేశవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలోని కళలు, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాలకు తెలంగాణను కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయని తెలిపారు.

1.20 కోట్ల సీఎంఆర్ ధాన్యం దారిమళ్లింపు

- మిల్లర్‌పై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు

రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దాడులు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పలువురు మిల్లర్లపై కేసులు నమోదు చేస్తోంది. అందులో భాగంగా ఇటీవల సంగారెడ్డిలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా ముదిమాణిక్ గ్రామంలో విజయ దుర్గ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అక్రమాల్ని గుర్తించారు. 2024-25 సీజన్‌కు సంబంధించి 13,842 బస్తాల కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) నిల్వలు తక్కువగా ఉన్నట్లు తేలింది. వాటి విలువ 1.20 కోట్లకుపైగా ఉంటుంది. దీంతో మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా సంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల అధికారులకు విజిలెన్స్ నివేదిక సమర్పించింది.

విద్యుత్ సవరణ బిల్లుపై అభిప్రాయ సేకరణ గడువు పెంపు

- కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సవరణ బిల్లు ముసాయిదాపై అభిప్రాయ సేకరణ గడువును ఈనెల 30వ తేదీ దాకా పొడిగిస్తూ కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకుంది. గత నెల 10న విద్యుత్ సవరణ బిల్లు ముసాయిదాను విడుదల చేయగా, నెల రోజుల్లోపు అభ్యంతరాలు తెలిపాలని అన్ని రాష్ట్రాల ఇంధన శాఖలు, విద్యుత్ పంపిణీ సంస్థలు, ప్రభావిత వర్గాలను కోరుతూ నోటిఫికేషన్ ఇచ్చింది. తాజాగా ఆ గడువును పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్త బిల్లు ప్రకారం ఒకే ప్రాంతంలో పలు డిస్కమ్‌లకు అనుమతి ఇవ్వడమే కాకుండా ఇప్పటికే ఉన్న డిస్కమ్‌ల నెట్‌వర్క్‌ను సైతం వాడుకోవచ్చు. తెలంగాణలోని రెండు డిస్కమ్‌ల పరిధిలో 1,94,16,210 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే, వ్యవసాయ వినియోగదారులతో పాటు ఎత్తిపోతల పథకాలు, తాగునీటి పథకాలు కలిపి మొత్తం 29,93,437 కనెక్షన్లకు ప్రత్యేక డిస్కమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. తద్వారా పాత డిస్కమ్‌ల వ్యాపారం పెంచడం, తక్కువ వడ్డీకే వాటికి రుణాలు అందించడం సాధ్యమవుతుందని అంచనా వేసింది. అయితే, తాజా విద్యుత్ సవరణ బిల్లు చట్టరూపం దాల్చితే ఆదాయం తెచ్చిపెట్టే వినియోగదారులందరూ ప్రైవేట్ డిస్కమ్‌ల చెంతచేరే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా సదానందంగౌడ్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. హైదరాబాద్‌లోని ఎస్టీయూ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడిగా జి.సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్ సాబేర్ అలీ ఎన్నికయ్యారు. వారితో పాటు 8 మంది రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, 16 మంది ఉపాధ్యక్షులు, 8 మంది అదనపు ప్రధాన కార్యదర్శులు, 16 మంది కార్యదర్శులు, 8 మంది ఆర్థిక కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సంఘం పూర్వ ఆర్థిక కార్యదర్శి జగన్మోహన్ రావు, సీనియర్ నాయకులు పున్న గణేశ్, మోదిని శ్రీశైలం, వహీదుల్లా ఉస్సేని వ్యవహరించారు.

హరీశ్‌రావు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు

- ఈసీకి టీపీసీసీ ఫిర్యాదు

మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ కేంద్ర ఎన్నికల సంఘానికి టీపీసీసీ ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారపర్వం ఆదివారంతో ముగియగా.. హరీశ్‌రావు సోమవారం నియోజకవర్గం పరిధిలోని టీఎస్‌పీఏ మొదటి బెటాలియన్ పోలీసులతో కాన్ఫరెన్స్ కాల్ మాట్లాడారని, బల్క్ మెసేజ్‌లు పంపారని టీపీసీసీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ పి.రాజేశ్ కుమార్, సభ్యులు రాఘవేందర్, లింగం యాదవ్ ఆరోపించారు. దానికి సంబంధించిన ఆధారాలను ఎన్నికల సంఘానికి పంపి, హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ నేతలు లక్ష చీరలు పంచుతున్నారు!

విచ్చలవిడిగా డబ్బులు, మద్యాన్ని పారిస్తున్నారు

సీఈఓకు మాజీ మంత్రి హరీశ్ రావు ఫిర్యాదు..



హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో మహిళా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు.. లక్ష పట్టు చీరలు పంచుతున్నారు. కుక్కర్లు, మిక్సీ గ్రైండర్లను తాయిలాలుగా ఇస్తూ.. అధికార కాంగ్రెస్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తోంది. విచ్చలవిడిగా డబ్బులను పంచుతూనే.. మద్యాన్ని ఏరులై పారిస్తూ.. కాంగ్రెస్ అక్రమ మార్గంలో గెలవాలని చూస్తోంది. ఆ పార్టీ ఎన్నికల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోండి..' అని సీఈఓ సుదర్శన్‌రెడ్డికి మాజీమంత్రి హరీశ్ రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈఓను ఆయన కలిసి వినతి ప్రతంతో పాటు సాక్ష్యాలుగా పలు ఫొటోలు, వీడియో క్లిప్పింగులను సమర్పించారు. అనంతరం హరీశ్ మీడియాతో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని.. పోలీసులు, అధికారులు తొత్తులుగా మారి వారి అక్రమాలకు మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. సీ విజిల్ యాప్‌లో, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కాంగ్రెస్ లక్షకుపైగా చీరలు, మిక్సీ గ్రైండర్లు పంపిణీ చేస్తున్న సమాచారాన్ని వీడియో, ఫొటో ఆధారాలను ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు తెలిపారు. అలాగే ఫేక్ ఓటర్ ఐడీలు తయారు చేశారని, ఫేక్ ఐడీ కార్డుల వీడియోను సమర్పించామన్నారు. ఓటరు గుర్తింపు కార్డును నిర్ధారించకుండా ఎవరినీ పోలింగ్ బూత్‌లోకి పంపొద్దని.. దొంగ ఓట్లను అడ్డుకోవాలని కోరామని చెప్పారు. యూసుఫ్‌గూడలో కాంగ్రెస్ కార్యాలయానికి ఆనుకొనే పోలింగ్ బూత్ ఉందని సీఈఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై తగిన చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చినట్లు హరీశ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఓటర్లు తెలివైనవారని, అధికార కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినా.. మోసపోకుండా.. ఆ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీనిచ్చి మోసం చేసిన సీఎం రేవంత్ రెండేళ్లగా ఆరు గ్యారెంటీలపై సమీక్ష జరిపేందుకు సమయం దొరకలేదా..? అని ప్రశ్నించారు.



జూబ్లీహిల్స్ మనదే!

అయినా ఈ ఒక్కరోజు అప్రమత్తంగా ఉందాం

ఓటింగ్ శాతం పెరిగేలా చూడండి

పోలింగ్ అయ్యేదాకా అందుబాటులో ఉండండి

మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో సీఎం

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ బీఆర్‌ఎస్ బలహీనపడిందని సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర మంత్రులతో అన్నారు. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం ఖాయమని చెప్పారు. అయినా పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఆయా మంత్రులు తాము ఇన్‌చార్జులుగా ఉన్న డివిజన్ల నాయకులకు మంగళవారం మొత్తం అందుబాటులో ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించాలని నిర్దేశించారు. సోమవారం ఉదయం అందుబాటులో ఉన్న మంత్రులతో తన నివాసంలో ముఖ్యమంత్రి బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఉప ఎన్నికలో పార్టీ పరిస్థితిపై డివిజన్ల వారీగా సమీక్షించారు. పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వారికి సూచించారు. ఉదయమే కాంగ్రెస్ కార్యకర్తలు, సానుభూతి పరులతో ఓట్లు వేయించడం పూర్తి చేయాలని, ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకూ బాధ్యులు తీసుకువచ్చేలా చూసుకోవాలని అన్నారు. పోలింగ్ శాతం పెరిగితే కాంగ్రెస్ పార్టీ మెజారిటీ పెరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మంత్రులతోపాటు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

వందలో 80 మందికి నోటు!

- జూబ్లీహిల్స్‌లో 80 శాతం మంది ఓటర్లకు డబ్బు పంపిణీ
- అందులో సగం మంది అయినా ఓటేస్తారని పార్టీల వ్యూహం
- పక్కా ప్రణాళికతో ఓట్లు కొనుగోలు చేసిన రెండు ప్రధాన పార్టీలు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లు డబ్బులో తడిసి ముద్దయ్యారు. శుక్రవారం జరుగుతున్న ఉప ఎన్నిక కోసం ప్రధాన పార్టీలు సోమవారం రాత్రి వరకు డబ్బును ఏరులై పారించాయి. గతానికి భిన్నంగా ఇక్కడ మొత్తం ఓటర్లలో 80 శాతం మందికి డబ్బు ముట్టజెప్పాలన్న లక్ష్యంతో పంపిణీ చేసినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో 3.91 లక్షల మంది ఓటర్లుండగా... ఇందులో తప్పనిసరిగా 3.12 లక్షల మందికి డబ్బులు పంపిణీ చేయాలని ప్రధాన రాజకీయ పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అందులో సగం మంది అయినా తమకు ఓటేస్తారని నేతలు ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. అయితే, 80 శాతం మందికి డబ్బులిచ్చినా... పోలింగ్ శాతం ఏ మేరకు నమోదవుతుంది? ఎవరికెన్ని ఓట్లు వస్తాయి? అనేది చర్చనీయాంశంగా మారింది. 2023 సాధారణ ఎన్నికల్లో 1,83,337 ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓట్లలో ఇది 47.58 శాతమే. 2018 ఎన్నికల్లో 1,54,948 ఓట్లు, 2014 ఎన్నికల్లో 1,65,368 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 50 శాతం ఓట్లు పోలవటం కూడా కష్టంగా మారింది. అయితే, ఇది ఉప ఎన్నిక కావటం, ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో పోలింగ్ శాతం అధికంగా నమోదవుతుందని భావిస్తున్నారు.

లెక్క ప్రకారమే..

ప్రధాన రాజకీయ పార్టీలకు డబ్బు పంపిణీ కూడా ప్రహసనంగా మారింది. ఉప ఎన్నికల షెడ్యూలు విడుదల కాగానే... ఓటర్ల వివరాల సేకరణ ప్రారంభించారు. ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారు? ఉపాధికోసం ఎక్కడికి వెళ్లారు? అని ఆరాతీసి 'ఓటరు మ్యాపింగ్' పేరుతో సమగ్ర వివరాలు సేకరించారు. ఆ లెక్క ప్రకారమే డబ్బుల పంపిణీ చేశారు. అయితే, వారం, రెండు వారాల క్రితం జూబ్లీహిల్స్ పరిధిలో లేని ఓటర్లు... ఇప్పుడు అక్కడ ప్రత్యక్షమయ్యారు. తమకు కూడా ఓటు ఉందని, డబ్బులివ్వాలంటూ పార్టీల నేతలను నిలదీస్తున్న ఉదంతాలు కనిపించాయి. రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, షేక్‌పేట్ డివిజన్లలో సోమవారం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులకు ఈ దృశ్యాలు కనిపించాయి.

డబ్బులివ్వని అభ్యర్థికే మా ఓటు..

రాజకీయ పార్టీలు డబ్బు పంపిణీ కోసం టెంట్ హౌస్ షాపులు, చిన్న దుకాణాలు, కిరాణా కొట్ల వంటి వాటిని ఉపయోగించుకున్నాయి. రాజీవ్‌నగర్‌లోని ఒక టెంట్‌హౌస్ వద్ద పంపిణీ కార్యక్రమానికి మహిళలు గుంపులుగా వచ్చారు. నేతలు తమ వద్ద ఉన్న జాబితాలో వారి పేర్లు సరిచూసుకుని నగదు, పోల్ చీటీలు ఇచ్చారు. రహమత్‌నగర్ ప్రాంతంలో ఒక పార్టీ నాయకులు అంగన్‌వాడీ కేంద్రం వద్ద బహిరంగంగానే నగదు పంపిణీ చేశారు. ఒక్కో ఓటరుకు రూ.2 వేల నగదు ఇచ్చారు. ఈ సందర్భంగా డబ్బు తీసుకున్న ఒక ఓటరును ... ఓటు ఎటు అని ప్రశ్నించగా... రెండు పార్టీల అభ్యర్థుల తరఫున మాకు నగదు ఇచ్చారు. ఒకరు రూ. 2,500 ఇస్తే, మరొకరు రూ.1,000 ఇచ్చారు. నగదు తీసుకున్నందుకు ఇద్దరికీ ఓటు వేయలేం కదా? అందుకే డబ్బు ఇవ్వని మూడో వ్యక్తికి ఓటు వేస్తాం' అని కరాఖండీ చెప్పటం విశేషం.

తటస్థంగా ఉంటే అన్ని పార్టీలు డబ్బులిస్తాయి..

బోరబండలోని పలు కాలనీలలో క్షేత్రస్థాయి పరిశీలనలో కొందరు ఓటర్లను వారి మనోగతం గురించి అడిగినప్పుడు చెప్పడానికి నిరాకరించారు. 'మేము మా మనోగతం చెబితే ఒక్క పార్టీనే మాకు డబ్బులు పంచుతుంది. అదే తటస్థంగా ఉంటే అన్ని పార్టీల వారు డబ్బులు ఇస్తారు' అని సమాధానమిచ్చారు.

డబ్బు కోసం పని మానుకుని ఇంటి దగ్గరే ఉన్న..

మరికొందరు ఓటర్లు ఎన్నికల్లో డబ్బులు తీసుకోవడం తమ హక్కు అన్నట్లుగా మాట్లాడారు. పైన నుంచి డబ్బులు పంచమని ఇస్తే.. సగం మందికి ఇచ్చి.. సగం మందికి ఇవ్వడంలేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెందిన ఓ కార్యకర్త.. 'ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఏదైనా తేడా వస్తే నేరుగా రేవంత్ రెడ్డితోనే చెబుతాం.. దీనికి కారణం స్థానిక చోటా మోటా లీడర్లే.. ఒకరికిచ్చి, ఇంకొకరికి డబ్బు ఇవ్వకపోతే ఎలా?' అని ప్రశ్నించాడు. మరో ఓటరును పలకరించగా.. 'మా ఇంట్లో 5 ఓట్లున్నాయి. ఉదయం నుంచి ఎవరైనా డబ్బులు ఇస్తారేమోనని పని మానుకుని ఇంటిదగ్గరే ఉన్న.. కానీ ఏ పార్టీ సంప్రదించలేదు.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ' 25 ఏళ్లుగా ఎన్నికలు చూస్తున్నాను.. ఇంత గుడ్డిగా డబ్బు పంపిణీ చేసిన ఎన్నికలు చూడలేదు' అని వెంగళరావునగర్‌కు చెందిన ఒక ఓటరు పేర్కొన్నాడు.

జెండా ఒకరిది.. ఓటు మరొకరికి

కొన్ని చోట్ల చిత్రమైన పరిస్థితి కూడా ఎదురైంది. షేక్‌పేట్ డివిజన్‌లో ఒక రాజకీయ పార్టీ ప్రచారంలో పాల్గొన్న కొందరిని మీరు ఏ పార్టీకి ఓటేస్తారని అడగ్గా.. మా పార్టీ అభ్యర్థి గెలిచేది లేదు.. కాబట్టి ఇతర పార్టీలకు ఓటేస్తా అని చెప్పడం గమనార్హం. షేక్‌పేట్ డివిజన్‌లో కొంత మంది ఓటర్లు అభివృద్ధి కోసమే ఓటు వేస్తామని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హయాంలో తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు జరిగాయని, ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగాలంటే అధికార పార్టీకే ఓటు వేయాల్సి వస్తుందని చెప్పారు.

ధాన్యం సేకరణపై అసత్య ప్రచారాన్ని అడ్డుకోవాలి

- అధికారులు వాస్తవ లెక్కలు వెల్లడించాలి: ఉత్తమ్
- పంటల సేకరణ వేగవంతంగా జరగాలి: తుమ్మల



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణపై అసత్య ప్రచారం జరుగుతోందని, అధికారులు వాస్తవ లెక్కలు ఎప్పటికప్పుడు వెల్లడించాలని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ప్రతికూల వాతావరణంలోనూ పంట ఉత్పత్తుల కొనుగోళ్లు చేపడుతున్నామని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తే రైతులకు మేలు కలుగుతుందన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో సోమవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిరుడు ఈసమయానికి 3.94 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. ఈ సీజన్‌లో 8.54 లక్షల టన్నులు సేకరించి రికార్డు సృష్టించినట్లు ఉత్తమ్‌రెడ్డి తెలిపారు. 80 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం కాగా.. 3.95 లక్షల టన్నుల సన్నాలు, 4.59 లక్షల టన్నుల దొడ్డుధాన్యం సేకరించామన్నారు. రూ. 2,041.44 కోట్ల ధాన్యం కొనుగోలుచేసి రూ.832.90 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించినట్లు తెలిపారు. ఎప్పటి ధాన్యం అప్పుడే రైస్‌మిల్లులకు తరలించాలని, తడిసినవి కొనుగోలుచేస్తే.. నేరుగా బాయిల్డ్ మిల్లింగ్‌కు తరలించాలని, రైతులకు వాతావరణ సమాచారం చేరవేయాలని ఉత్తమ్ ఆదేశించారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోళ్లలో వేగం పెంచాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పత్తి కొనుగోళ్లలో సీసీఐ తెచ్చిన ఎల్-1, ఎల్-2 నిబంధనతో రైతులు ఇబ్బంది పడున్నారని కలెక్టర్లు వివరించారు. స్పందించిన తుమ్మల వీటి కొనుగోళ్ల పరిమితిని ఎకరాకు 7 నుంచి 12 క్వింటాళ్లకు పెంచేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. రంగుమారిన సోయాబీన్‌ను కొనుగోలు చేసేందుకు అనుమతించాలంటూ రాష్ట్ర సర్కారు ప్రతిపాదన పంపిందన్నారు. తుఫాన్‌కు 1.10 లక్షల ఎకరాల్లో ధాన్యం, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ నివేదికను కేంద్రానికి పంపామన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ధాన్యం తేమశాతం నిబంధనలను సడలించాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

ఆరేళ్ల పోరగాడిగా ఓ రైతు దగ్గర జీతానికి కుదిరి చిరిగిన అంగీ లాగుతో బర్లను మేపుతూ.. ఏ పూటా కడుపు నిండా బువ్వ దొరక్క, అడవిలో దొరికే రేగుపళ్లు, పరికిపళ్లతోనే ఆకలి తీర్చుకున్న రోజులు! ఆనందోద్వేగాలూ ప్రకృతి ఒడిలోనే సాగిన రోజులు! కాలికి ముళ్లు గుచ్చుకొని చెట్టు మొదట్లో కూర్చొని ఏడిస్తే ప్రకృతి కరిగి కన్నీరైంది.




అసువుగా పాట పాడితే 'తిన్నదరక్క రాగాలు తీస్తుండు' అంటూ సోపతోళ్లు ఎగతాళి చేసినా పారే సెలయేళ్లు మురిసి గలగలా నవ్వాయి. కొమ్మారెమ్మా ఆనంద పారవశ్యంతో ఊగాయి! కూలీ పనులకు పోయిండు... తాపీ పట్టిండు! 'జయజయహే తెలంగాణ జననీ జయ కేతనం' అంటూ మలిదశ ఉద్యమంలో ముక్కోటి గొంతుకలను ఒక్కటి చేసిన ఆ చైతన్య స్ఫూర్తి అందెశ్రీ బాల్యం కటిక పేదరికంలో గడిచిందనే విషయం ఈ తరం వారికి పెద్దగా తెలియదు!!

బతుకు బండే పాటగా అందె!



జననం: 18-7-1961 మరణం: 10-11-2025

మద్దూరు, హైదరాబాద్, సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి ఆయన సొంతూరు. అక్కడే ఆయన చిన్నతనమంతా గడిచింది. దళిత కుటుంబంలో పుట్టారు. అందె బొడ్డయ్య, ఎల్లవ్వ దంపతులకు ముగ్గురు సంతానంలో అందెశ్రీనే పెద్దవారు. పాలబుగ్గల వయసులో తల్లిదండ్రుల నుంచి ఆదరణ కరువైంది. బడిఈడు వచ్చినా కన్నవారు వెన్నుతట్టలేదు. ఎన్నడూ బడికి పోయిందే లేదు. బాలుడిగా ఉన్న అందెశ్రీని ఆ ఊర్లోనే జక్కిరెడ్డి రాధమ్మ చేరదీసింది. కొన్నాళ్లకు ఆమె కుమారుడు జక్కిరెడ్డి మల్లారెడ్డి జీతానికి కుదిరి బర్లు మేపాడు. గ్రామంలోని మునీరు సేటు, డాకూరి బాల్‌రెడ్డి వద్దా బర్లు మేపారు.



సీఎం రేవంత్ దంపతులతో అందెశ్రీ దంపతులు (ఫైల్)

అలా అందెశ్రీగా మారి..

బాల్యంలో పదేళ్లు పశువుల కాపరిగానే పనిచేశారు అందెశ్రీ. తర్వాత భవన నిర్మాణ రంగంలో కూలీ పనుల కోసం నిజామాబాద్ వెళ్లారు. అక్కడ ఆయన్ను శృంగేరీ శంకర మహరాజ్ అక్కున చేర్చుకున్నారు. అప్పటిదాకా అందె ఎల్లయ్యగా ఉన్న ఆయన పేరును అందెశ్రీగా మార్చింది ఆ మహారాజే. అడ్డుతగిలిన వారిని ధిక్కరించి అందెశ్రీకి ఉపనయనం నిర్వహించి.. గాయత్రి మంత్రాన్ని ఉపదేశించారు. 'ఎంగిలి పాటలు ఎన్నాళ్లు పాడతావు? బతుకు పాటలు రాయి' అంటూ వెన్నుతట్టారు. ఆయన ప్రోత్సాహంతోనే ఛందస్సు నేర్చుకున్నారు.

మంచి గుణమే పిల్లనిచ్చేలా చేసింది

నా అనేవాళ్లేవరూ లేని తనకు పెళ్లి కావడం కష్టమనుకున్న ఒకానొక దశలో సన్యాసం స్వీకరించాలనుకున్న అందెశ్రీకి పెళ్లి కుదరడం రసవత్తరమైన సినీసన్నివేశానికి తక్కువేమీ కాదు. ఒకరోజు ఆయన బస్సులో వెళుతుండగా పక్కన ఓ పెద్దాయన కూర్చుకున్నారు. ఇద్దరూ అవీఇవీ మాట్లాడుకున్నారు. అందెశ్రీ కవితా ధోరణితో కూడిన మాటలకు ఆవలి వ్యక్తి అబ్బురపడ్డారు. కుర్రాడికి అమ్మానాన్న ఆస్తిపాస్తులు లేకపోతేనేమి? మంచి గుణం, సాహితీ సంపద ఉంది అదే చాలు అనుకున్నారాయన. అప్పుడే అందెశ్రీని తన అల్లుడిగా ఖాయం చేసుకున్నారు. తన కుమార్తె మల్లికను అందెశ్రీకి ఇచ్చి పెళ్లి చేశారు. తాడూబొంగరం లేనివాడికి కుమార్తెను కట్టబెడుతున్నావంటూ బంధువులు దెప్పిపొడిచినా పట్టించుకోలేదు.

అప్పుడు ఆత్మహత్యే శరణ్యం అనుకున్నారు

బాల్యమంతా కష్టాలకడలిలోనే గడిపిన అందెశ్రీని పెద్దయ్యాక కూడా పేదరికం వదల్లేదు. 1994 రోజులవి! ఆయన తాపీ పనికి వెళ్లేవారు. రోజుకు 13 రూపాయలొచ్చేవి. తీవ్ర ఆర్థిక సమస్యలకు తోడు.. అనారోగ్యంతో రెండో కుమారుడు (5ఏళ్లు) మృతిచెందడం ఆయన్ను కుంగదీసింది. బాబుకు కనీసం వైద్యం కూడా చేయించలేకపోయానన్న బాధతో భార్య, పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. అయితే ఈ ఆపత్కాలంలో హోమియో వైద్యుడు రామకృష్ణ చేసిన సాయం, యలమంచలి శేఖర్‌తో పరిచయం ఆయన్ను సమస్యల సుడిగుండాల నుంచి బయటపడేలా చేశాయి. 'ఆ శోకంలో ఒక శ్లోకం చదివి..' అంటారు వాల్మీకి గురించి 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అనే పాటలో వేటూరి. అచ్చంగా ఇలానే.. 'శోకం నుంచే నా గానం పుట్టింది' అని సగర్వంగా ప్రకటించుకున్నారు అందెశ్రీ.

అసెంబ్లీ భవన ప్రాంగణంలో కూలీగా..

తాపీమేస్త్రిగా అందెశ్రీ 22 ఏళ్లు పనిచేశారు. 1979లో నిజామాబాద్ నుంచి కుటుంబంతో హైదరాబాద్‌కు మారారు. 1984లో తెలంగాణ అసెంబ్లీ భవన ప్రాంగణంలోని ఓ నిర్మాణంలో కొన్నాళ్లు కూలీగా పని పనిచేశారు. సభలోపల ప్రజాప్రతినిధులు కూర్చునే కుర్చీలను కూడా తాను బిగించానని ఆయనే స్వయంగా 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు. చిత్రంగా తర్వాత రోజుల్లో తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన రచయితగా అదే అసెంబ్లీలో చట్టసభ్యుల మన్ననలను పొందారు.

ఆ చివరి కోరిక తీరకుండానే..

అందెశ్రీ వాగ్దేవిని అమ్మగా కొలుస్తారు. అలా అని సంప్రదాయవాది కాదు. మార్క్సిజాన్ని ప్రేమిస్తారు. అలా అని వామపక్షవాది అంతకన్నా కాదు. నేను ఒక మనిషిని అని ప్రకటించుకున్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, ఉద్ధంసింగ్ వంటి మహనీయుల విగ్రహాలను ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలి. దాన్ని దేశం గర్వించదగ్గ యాత్రాస్థలిగా తీర్చిదిద్దాలన్నది తన చివరి కోరికగా అందెశ్రీ ఒక వేదికపై చెప్పారు. అది తీరకుండానే మాయమైపోయారు.

..అందెశ్రీది విశ్వం



"చదువుకుంటేనే భాష వస్తుందనుకుంటే పొరపాటు. అయితే సాంగత్యం లేకుంటే మాత్రం ఈ భాష రాదు. నా బాల్యంలో జక్కిరెడ్డి మల్లారెడ్డి నాకు గురువు. రామాయణ, మహాభారత ఇతిహాసాలన్నీ నాకు తెలియకుండానే నా మెదడులోకి పంపుచేశారాయన. తన పని చేయించుకునేందుకు ఆ కథలు చెప్పేవారు. అవి నా జీవితానికి ఇంతగా పనికొస్తాయని నేనెప్పుడూ అనుకోలేదు. నన్ను వాగ్గేయకారుడిగా ప్రజలెవ్వరూ గుర్తించకపోయినా అభ్యంతరం లేదు. నేను పాటకు ఎంత వరకు న్యాయం చేస్తాను? ఆ పాటను ప్రజల్లోకి ఎంత వరకు తీసుకెళ్తాను? అన్నవే నాకు ముఖ్యం. కాలం గొప్పది. నాకు ఎలాంటి అసంతృప్తి లేదు. బినామీ పేర్ల మీద పాటలు రాస్తున్నారు. నాకు ఆ గతి పట్టలేదు. నా కవిత్వాన్ని అమ్ముకోను. నా కవిత్వం ప్రపంచాన్ని మారుస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. ఎల్లయ్యది తెలంగాణ అయితే అందెశ్రీది విశ్వం"

-2010లో ఓపెన్ హార్ట్ విత్ ఆర్కే కార్యక్రమంలో అందెశ్రీ

వారంతా మలిచిన మనిషిని తాను అంటూ..

'మాయమైపోతున్నాడమ్మ మనిషన్నవాడు.. మచ్చుకైనా లేడు మానవత్వం ఉన్నవాడు' అంటూ సిరాతో ఆవేదనను చిలకరించిన అందెశ్రీ.. కష్టకాలంలో తనకు దన్నుగా నిలబడిన వారిని మహనీయులుగా తన గుండెల్లో పెట్టుకున్నారు. తనను ఆదుకున్న వ్యక్తులను వేదికలపై ఎన్నోసార్లు గుర్తుచేసుకున్నారు. ప్రముఖ జానపద సాహిత్య పరిశోధకుడు ఆచార్య బిరుదురాజు రామరాజు దగ్గర అందెశ్రీ 20 ఏళ్లకుపైగా శిష్యరికం చేశారు ఆ అనుబంధంతో రామరాజును ఆయన 'నాన్న' అని, ఆయన భార్య సూర్యదేవమ్మను 'అమ్మా' అని సంబోధించేవారు. సూర్యదేవమ్మ తనను అమ్మలా ఆదరించారన్న కృతజ్ఞతతోనే 'సూడ సక్కని నా తల్లి.. సుక్కల్లో జాబిల్లి" అంటూ ఆమె మాతృహృదయాన్ని కొనియాడుతూ పాట రాశారు. తర్వాత ఈ పాట.. ఆర్. నారాయణమూర్తి చిత్రం "ఊరు మనదిరా" ద్వారా శ్రోతల ఆదరణ పొందింది. తనకు ఆధ్యాత్మిక గంధాన్ని అద్దిన జక్కిరెడ్డి మల్లారెడ్డిని, తనకు మొట్టమొదటిసారి కొత్త బట్టలు కుట్టించిన మునీరుద్దీన్ సేటును, దారితెన్నూ లేక తన జీవననావ సుడిగుండంలో చిక్కుకున్న దశలో తనను అక్కున చేర్చుకొని.. తన పేరును అందెశ్రీగా మార్చి.. జ్ఞానబోధ చేసిన శృంగేరి శంకర మహరాజును, ఆపత్కాలంలో తనకు అన్నం పెట్టిన యలమంచలి శేఖర్‌ను.. ఇలా తన జీవన ప్రయాణంలో తోడ్పాటునందించిన అందర్నీ ఆయన పదే పదే తలచుకునేవారు. తాను.. వారు మలిచిన మనిషినంటూ కృతజ్ఞతా భావాన్ని చాటుకునేవారు.

అక్కడ గొంతెత్తి పాడితే.. సినిమావాళ్లు క్యూ కట్టారు

అది నాంపల్లిలోని లలితకళా తోరణం. 'వర్తమానం' పత్రిక ప్రారంభోత్సవం జరుగుతోంది. గద్దర్ వరుసగా కొన్ని పాటలు పాడారు. ఆయనకు కాస్త విశ్రాంతినివ్వాలనే ఉద్దేశంతో ఎవరైనా వచ్చి పాటలు పాడాల్సిందిగా ఆహూతులను నిర్వాహకులు కోరారు. ఆ పిలుపుతో జనంలోంచి వేదికపైకి వచ్చిన అందెశ్రీ రెండు పాటలు పాడారు. అవి విన్న సినిమా వాళ్లు పాటలు రాయాల్సిందిగా అందెశ్రీని వెతుక్కుంటూ వెళ్లారు. అనాథల జీవితం కథావస్తువుగా వచ్చిన 'మార్గదర్శి' సినిమా కోసం అందెశ్రీ తొలిసారిగా పాట రాశారు. ఆ తర్వాత వరుసగా 20 సినిమాలకు గీతాలు అందించారు. మోహన్‌బాబు 'అధిపతి' సినిమాలో 'ఆడ బతుకే పాడు బతుకని ఏడుస్తావెందుకే చెల్లెమ్మా..', ఆర్. నారాయణమూర్తి 'వేగు చుక్కలు' సినిమాలో 'కొమ్మచెక్కితే బొమ్మరా.. కలసి మొక్కితే అమ్మరా..', 'జైబోలో తెలంగాణ' సినిమాలో 'జనజాతరలో మన గీతం' వంటి పాటలు అమితాదరణ పొందాయి. 'మాయమైపోతున్నాడమ్మా' పాటను 'ఎర్ర సముద్రం' సినిమాలో వాడారు. నిజామాబాద్‌లోని జోగిని వ్యవస్థను కళ్లారా చూసి చలించిన అందెశ్రీ 'ఒడిసే చెమట చుక్కల్లోనా రాలేపొద్దులు ఎన్నమ్మో..' అంటూ ఒక గేయం రాసుకున్నారు. అది చూసిన యలమంచలి శేఖర్.. కథగా మలచాల్సిందిగా సూచించారు. 'గంగ' పేరుతో ఆ చిత్రం నిర్మితమైతే అందులో అందెశ్రీ పాటలతోపాటు మాటలూ రాశారు. అదే చిత్రంలో 'ఎల్లిపోతున్నావా నా తల్లి'కి ఉత్తమ గేయరచయితగా నంది పురస్కారాన్ని అందుకున్నారు. 'బతుకమ్మ' సినిమాకు పాటలు, మాటలు రాశారు.

'జయ జయహే..'కు ఆ పాటే స్ఫూర్తి

కామారెడ్డిలో 2002 సెప్టెంబరు 30న ధూంధాం వేదికమీదున్నప్పుడు 'జయజయహే తెలంగాణ' పాట రాయాలనే ఆలోచనకు బీజం పడిందని అందెశ్రీ ఓ సందర్భంలో చెప్పారు. కాకతీయ చరిత్ర, సంస్కృతి వైభవాన్ని వర్ణిస్తూ అంతకు మునుపు తాను రాసిన 'గలగల గజ్జల బండి చూడు...ఓరుగల్లు చూడు' అనే పాటే 'జయజయహే..'కు ప్రేరణ అని చెప్పారు. తొలిసారిగా ఈ గీతాన్ని సిద్దిపేటలో 2003 మార్చి2న జరిగిన తెలంగాణ రచయితల వేదిక వార్షికోత్సవంలో అందెశ్రీ ఆలపించారు. అది మొదలు ఆ పాట ప్రభంజనమై జనం మనస్సుల్లో శాశ్వతమైంది.

అందెశ్రీ పాటకు మెచ్చి బంగారు కంకణం

విద్యార్థిగా ఎన్నడూ పాఠశాల గుమ్మం తొక్కని అందెశ్రీ రాసిన 'జయ జయహే తెలంగాణ' పాట ఇప్పుడు స్కూళ్లలో వినిపిస్తోంది. ఆయనే రాసిన 'మాయమైపోతున్నడమ్మా..' అనే గీతాన్ని డిగ్రీ విద్యార్థులకు ఓ పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆయన్ను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మైసూరులోని గణపతి సచ్చిదానంద స్వామి అందెశ్రీ పాటకు మెచ్చి బంగారు కంకణంతో సత్కరించారు. అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డీసీ సంస్థ లోక కవి బిరుదు ప్రదానం చేసింది. గౌరవ డాక్టరేట్‌నూ అందించింది. దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ అవార్డు, సుద్దాల హనుమంతు - జానకమ్మ పురస్కారం, లోక్‌నాయక్ తదితర అవార్డులెన్నో అందెశ్రీని వరించాయి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు గాను అందెశ్రీకి రేవంత్ ప్రభుత్వం కోటి నగదు, ఇంటి స్థలం ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు ఆయన పేరును ప్రతిపాదించింది.

'నదీకావ్యం' ఆలోచన చేసి..

'ఒకేచోట కూర్చొని ఇరుకైపోతాననే భయంతో ఆరు ఖండాలను, ఏడు వింతలను చుట్టొచ్చాను' అని ఓ ఇంటర్వ్యూలో కవితాత్మకంగా చెప్పారు అందెశ్రీ. దేశవిదేశాల్లో పది నదుల పుట్టుక, ప్రవాహం, సంగమం గురించి అధ్యయనం చేశారు. ఆ యాత్రా విశేషాలు 'ఆంధ్రజ్యోతి ఆదివారం'లో ప్రచురితమయ్యాయి. ఆ నదుల విశేషాలను 'నదీకావ్యం' పేరుతో అక్షరీకరించే ప్రయత్నంలో ఉన్నట్టు ఓ సందర్భంగా చెప్పారు. తన ఆత్మకథ కూడా అక్షరబద్ధం చేసే ప్రయత్నంలో ఉన్నానని వెల్లడించారు. వాక్కులమ్మ ప్రచురణలు ద్వారా తన సంపాదకత్వంలో తెలంగాణ ఉద్యమ పాట 'నిప్పులవాగు' సంకలనాన్ని తీసుకొచ్చారు. ఆ పుస్తకాన్ని శ్రామిక మహిళలతో ఆవిష్కరింపచేశారు. బుద్ధుని జీవితం మీద 'స్వర్ణహంస'తో పాటు మరికొన్ని పుస్తకాలు తేవాలన్న ఆలోచనతో ఉన్నారు. ఇంతలోనే అందరినీ వదిలి వెళ్లారు.









అందెశ్రీ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి దామోదర, బీఆర్ఎస్ నేత కేటీఆర్

మాయమైపోయిండు..

సోమవారం ఉదయం ఇంట్లోనే కుప్పకూలిన అందెశ్రీ



హైదరాబాద్, తార్నాక, ఘట్‌కేసర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని సృజించిన అందెశ్రీ (64) ఇకలేరు. హైదరాబాద్ లాలాపేటలోని తన నివాసంలో సోమవారం ఉదయం గుండెపోటుతో ఆయన హఠాన్మరణం చెందారు. ఇంట్లోనే ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పోలీసు గౌరవ వందనంతో అంత్యక్రియలు జరుగుతాయని, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. దాంతో, ఆయన అంత్యక్రియలను మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అరెకరం వివాదాల్లేని ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి రెవెన్యూ అధికారులు అంకుషాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, కొండాపూర్ పరిధిలో ప్రభుత్వ భూములను పరిశీలించారు. చివరకు, ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీప స్థలాన్ని ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి స్థలాన్ని పరిశీలించి పనులు చేపట్టాలని ఆదేశించారు. అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. తొలుత, లాలాపేటలోని ఆయన ఇంటి నుంచి అంతిమ యాత్ర ప్రారంభం కానుంది. ఘట్‌కేసర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఆయన ఇంటి వద్ద కొద్దిసేపు ఉంచుతారు. అక్కడి నుంచి ర్యాలీగా యంనంపేట్ చౌరస్తాలోని ఔటర్ జంక్షన్‌కు చేరుకుని అక్కడ అంత్యక్రియలు పూర్తి చేస్తారు. అందెశ్రీ అంత్యక్రియల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఆయన పార్థివ దేహానికి సీఎం నివాళులర్పిస్తారు. ఆ స్థలాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దనున్నట్లు అధికారులు తెలిపారు.

తరలివచ్చిన నాయకులు, ప్రముఖులు

అందెశ్రీ మరణ వార్తతో తెలంగాణ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మట్టి మనిషి, పల్లెపదాల భావోద్వేగి ఇకలేరన్న వార్త తెలుసుకుని సాహితీప్రియులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అందెశ్రీ ఆకస్మిక మృతితో ఆయన కుటుంబ సభ్యులు రోదిస్తున్న దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టించాయి. అభిమానుల సందర్శనార్థం అధికారులు సోమవారం మధ్యాహ్నం లాలాపేట్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో అందెశ్రీ పార్థివ దేహాన్ని ఉంచారు. పెద్దఎత్తున రాజకీయ నాయకులు, అభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు తరలి వచ్చారు. అందెశ్రీ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వారిలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వెన్నెల గద్దర్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఎమ్మెల్యే మందుల సామేలు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, కోదండరాం, కల్వకుంట్ల కవిత, సీతారాంనాయక్, వి.హనుమంతరావు, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, సీపీ సజ్జనార్, తదితరులు ఉన్నారు. అందెశ్రీ అందించిన సేవలను కొనియాడారు. అందెశ్రీతో తమకున్న వ్యక్తిగత అనుబంధాన్ని, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

ఇంటి కల పూర్తిగా నెరవేరకుండానే..

అందెశ్రీ తనకు సొంత స్థలం ఉండాలని భావించారు. తాను చనిపోతే అందులోనే పూడ్చిపెట్టాలని చెబుతుండేవారు. ఇందుకు తన సొంతూరులో స్థలం కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. కానీ, వివాదంతో అది సాధ్యపడలేదు. ఇందుకు ఆయన బాధ పడేవారని ఆయన సన్నిహితులు తెలిపారు. ఇక, ప్లాట్ కొనుగోలుకు కొద్ది కాలం కిందట ఆయన ఘట్‌కేసర్ పరిసరాల్లో తిరిగారు. పలువురు రియల్ ఎస్టేట్ ఏజెంట్లను సంప్రదించారు. రేటు విషయంలో వెనకడుగు వేశారు. ఇందులో భాగంగా ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీలో తిరుగుతుండగా కొందరు ఉద్యమకారులు ఆయనను గుర్తుపట్టారు. వారు, అక్కడి రియల్టర్ల సహకారంతో 348 చదరపు గజాల ప్లాటు కొని 2023 మార్చిలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మునిసిపాలిటీ అనుమతితో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్లాబులు పూర్తయి గోడల వరకు వచ్చింది.

అశ్రద్ధే ప్రాణాలు తీసిందా?

ఆరోగ్యం విషయంలో కొద్దిపాటి అశ్రద్ధ చేయడమే అందెశ్రీ ప్రాణాలు తీసిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆదివారం ఆయన ఘట్‌కేసర్ మునిసిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న తన ఇంటి వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి ఒంటిగంట వరకూ అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. వాచ్‌మన్ పిల్లలతో ముచ్చటించి వారికి కొన్ని డబ్బులిచ్చారు. సాధారణంగా జేబులో ఎన్ని డబ్బులుంటే అన్నీ ఆయన పిల్లలకు తీసి ఇస్తారని చెబుతున్నారు. అక్కడి నుంచి ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో సమాచార శాఖ కమిషనర్ అయోధ్య రెడ్డి నిర్వహించిన అయ్యప్ప పడి పూజలో పాల్గొన్నారు. సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. అప్పుడే ఆయన తనకు ఒంట్లో బాగోలేదని, అలసటగా ఉందని, రెండు రోజులుగా కళ్లు తిరుగుతున్నాయని చెప్పినట్లు సన్నిహితులు వివరిస్తున్నారు. ఆయన తరచూ వెళ్లే హోమియో వైద్యుడి వద్దకు వెళ్లి మందులు తీసుకుని వాడినట్టు సమాచారం. అక్కడి నుంచి ఆయనను రాత్రి 7 గంటలకు ఎన్ఎఫ్‌సీ నగర్‌కు చెందిన వినయ్ అనే యువకుడు ఇంటి వద్ద దించినట్టు చెబుతున్నారు. సోమవారం ఉదయం ఆస్పత్రికి వెళ్దామని అనుకున్నారని, ఉదయం ఫోన్ చేస్తే ఆయన మృతి వార్త తెలిసిందని వినయ్ వాపోయాడు. కాగా, అందెశ్రీ హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారని, మందులు సరిగా వేసుకోలేదని గాంధీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ తెలిపారు. ఆయనను కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారని, అప్పటికే ఆయన చనిపోయారని తెలిపారు. ఆయన కొంత కాలంగా హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారని, రెండు నెలల నుంచి బీపీ మందులు సక్రమంగా వాడడం లేదని, కేవలం రెండు రోజుల నుంచే మందులు వేసుకుంటున్నారని వివరించారు. గుండెపోటుతో అందెశ్రీ మరణించారన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు బుద్ధవరపు వెంకటరత్నం కన్నుమూత

- క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర
- జాగృతి తొలి సంపాదకుడిగా సేవలు



హైదరాబాద్ సిటీ, నవంబరు10(ఆంధ్రజ్యోతి): జాగృతి పత్రిక తొలి సంపాదకుడు, ఆర్ఎస్ఎస్‌లో చురుకైన కార్యకర్త, క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న బుద్ధవరపు వెంకటరత్నం(100) ఇకలేరు. హైదరాబాద్ అల్కాపురిలోని స్వగృహంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. వారం కిందట శతవసంతాల వేడుకను కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా చేసుకున్నారు. ఆయన స్వస్థలం కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలోని ఎర్రమిల్లి గ్రామం. కాకినాడలోని పిఠాపురం మహారాజా కళాశాలలో విద్య అభ్యసించారు. ఆ విద్యాలయంలో బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు బోధనలను ప్రత్యక్షంగా విన్న అరుదైన అనుభవం వెంకటరత్నం సొంతం. ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ నండూరి రామ్మోహన్‌రావుకు రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో సహాధ్యాయి కూడా. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. గోల్వాల్కర్ ప్రేరణతో 1940వ దశకంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో చేరారు. శండిల కలంతో నవలలు, కథలు రాశారు. జాగృతి పత్రిక వ్యవస్థాపక సంపాదకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. అల్కాపురి కాలనీలోని శ్మశానవాటికలో ఆదివారం సాయంత్రం వెంకటరత్నం అంత్యక్రియలు ముగిసినట్లు ఆయన కుమారుడు శ్రీనివాసరావు తెలిపారు.

శ్రీరంగాచార్యకు తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారం



హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీరంగాచార్యను ఈ ఏడాది సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ విశిష్ట పురస్కారం వరించింది. వచ్చే నెల రెండో తేదీన జరిగే వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హనుమంతరావు సోమవారం తెలిపారు. ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు, ప్రశంసా పత్రం అందజేస్తారు. నల్లగొండ జిల్లా చందుపట్లలో జన్మించిన డాక్టర్ శ్రీరంగాచార్య.. 3 దశాబ్దాల పాటు నాగర్ కర్నూల్ జిల్లా పాలెం ఓరియంటల్ కళాశాల అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. తొలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న శ్రీరంగాచార్య.. తెలంగాణలో గుర్తింపు నోచుకోకపోయిన 6 తరాల మరింగంటి కవుల కృతులను వెలుగులోకి తెచ్చి.. వాటికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. చందుపట్లలో రాణిరుద్రమ దేవి కాలం నాటి శాసనాన్ని వెలుగులోకి తెచ్చిన శ్రీరంగాచార్య.. పలువురు నల్లగొండ జిల్లా కవులు, పండితులను సమాజానికి పరిచయం చేశారు.

చెరుకూరి సంస్థల అధినేత రామారావు కన్నుమూత


చెరుకూరి రామారావు(ఫైల్)

వనస్థలిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెరుకూరి గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామారావు(74) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. హైదరాబాద్ బీఎన్‌రెడ్డినగర్‌లోని తన నివాసంలో సోమవారం ఉదయం మృతి చెందారు. సమాచారం అందుకున్న పలువురు రాజకీయ ప్రముఖులు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కాగా, రామారావుకు ఇద్దరు కుమారులున్నారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు చెరుకూరి గోపీనాథ్ మాట్లాడుతూ.. సాధారణ బ్యాంక్ ఉద్యోగిగా వృత్తి జీవితం ప్రారంభించిన రామారావు.. చెరుకూరి గ్రూప్‌ను స్థాపించి 10 వేల మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. కొత్తగూడెం పీర్లగూడెంలోని వారి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం సాయంత్రం రామారావు అంత్యక్రియలు ముగిశాయి.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పలు క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లోని 20 ప్రాంగణాల్లో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించే జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో 294 గురుకుల పాఠశాలల నుంచి 12,570 మంది పాల్గొంటారని పేర్కొన్నారు. మూడు రోజులపాటు వారికి రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, చెస్ తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు రాష్ట్ర స్థాయిలో త్వరలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


బయో బ్యాంక్ ప్రారంభోత్సవంలో డాక్టర్ గురు ఎన్ రెడ్డి, రిషిరెడ్డి తదితరులు

రోగాలను ముందే పసిగట్టి చికిత్స!

- కాంటినెంటల్ ఆస్పత్రిలో 'నెక్స్ట్ జనరేషన్ బయో బ్యాంక్'

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో వచ్చే జబ్బులను ముందస్తుగా పసిగట్టి సరైన చికిత్స, అవసరమైన మందులను సూచించేందుకు కాంటినెంటల్ ఆస్పత్రి నెక్స్ట్ జనరేషన్ బయో బ్యాంక్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆస్పత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి, క్రానికల్ బయో సీఈవో రోహిత్ గుప్తా బయో బ్యాంక్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ బయో బ్యాంక్ కోసం వ్యక్తుల నుంచి నమూనాలు సేకరించి, వాటిపై పరిశోధనలు చేస్తామన్నారు. రక్తం, లాలాజలం, మలం, కణజాలం, క్యాన్సర్ కణాలను సేకరిస్తామని.. వాటి ఆధారంగా ఆర్ఎన్ఏ, డీఎన్ఏ, టీబీ జబ్బులపై పరిశోధనలు చేస్తామని వివరించారు. దీంతో ఏ జబ్బు వస్తుందో నిర్ధారించి ముందు దానికి అనుగుణంగా చికిత్స అందించడానికి అవకాశముంటుందన్నారు. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థల సాయంతో క్యాన్సర్, మధుమేహం, గుండె వైఫల్యం వంటి దీర్ఘకాలిక వ్యాధుల క్లినికల్ లక్షణాలను గుర్తించి అంచనా వేయొచ్చన్నారు. కొత్తగా వచ్చే జబ్బులను గుర్తించడం, చికిత్స మందులను సూచించడమే ఈ ప్రక్రియ అని తెలిపారు. క్రానికల్ బయో (యూఎస్) సహ వ్యవస్థాపకుడు, ఆస్పత్రి డైరెక్టర్ రిషిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా అందెశ్రీ!

ఆయన మరణం.. సాహితీ రంగానికి తీరని లోటు.. 'ఎక్స్' వేదికగా సంతాపం తెలిపిన ప్రధాని మోదీ

- రాష్ట్ర చరిత్రలో అందెశ్రీకి ప్రత్యేక స్థానం: కిషన్‌రెడ్డి
- ఓ సాహితీ శిఖరం నేలకూలింది: సీఎం రేవంత్ రెడ్డి
- మిత్రుడిని కోల్పోయా: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ప్రజల్లో స్ఫూర్తి నింపిన అందెశ్రీ: ఉత్తమ్, పొన్నం, వాకిటి
- ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకెళ్లిన అందెశ్రీ: కేసీఆర్


(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ప్రజల గొంతుకగా నిలిచిన అందెశ్రీ మరణం.. సాంస్కృతిక, మేధో ప్రపంచానికి తీరని లోటని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అందెశ్రీ మరణంపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. "అందెశ్రీ ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. గొప్ప కవి, మేధావి అయిన అందెశ్రీ ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, ప్రజల సాంఘిక హృదయ స్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో ఆయన మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఓం శాంతి" అని పేర్కొంటూ పోస్టు చేశారు. అందెశ్రీ మరణాన్ని తెలంగాణ సమాజం, కవులు, కళాకారులు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో కలిసి ఆయన అందెశ్రీ భౌతికకాయాన్ని సందర్శించి.. నివాళులర్పించారు. తన రచనలతో తెలంగాణ సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని రాసుకున్నారని వెల్లడించారు. అందెశ్రీ భౌతికంగా దూరమైనా ఆయన రాసిన పాటలరూపంలో సజీవంగా ఉంటారని తెలిపారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన కవి అందెశ్రీ అని రాంచందర్‌రావు కొనియాడారు. అందెశ్రీ మరణం విచారకరమని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. అందెశ్రీ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని అభివర్ణించారు. అందెశ్రీ రచించిన జయజయహే తెలంగాణ గీతం.. తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర సాధనలో ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తుచేశారు. ప్రజాప్రభుత్వం అధికారికంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతాన్ని కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామని పేర్కొన్నారు. జాతిని జాగృతం చేయడంలో అందెశ్రీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. అందెశ్రీ తనకు ఆప్త మిత్రుడని, ఆయన మరణం తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల్లో చైతన్యం రగిలించడంలో అందెశ్రీ కృషి చిరస్మరణీయమన్నారు. తెలంగాణ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఘనత అందెశ్రీకి దక్కుతుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం, ఉనికిపై ఆయన రాసిన పాటలు చరిత్రలో నిలిచిపోతాయని కొనియాడారు. 2004లో సంగారెడ్డిలో ధూంధాం కార్యక్రమంలో అందెశ్రీ తనకు పరిచయమయ్యారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గుర్తు చేసుకున్నారు. అందెశ్రీ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమాన్ని మరో స్థాయికి తీసుకెళ్లారని కొనియాడారు. అందెశ్రీ రచనలు, పాటలు, ఉద్యమకాలంలో ఆయనచేసిన సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు పేర్కొన్నారు. అందెశ్రీ భౌతికకాయాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి.. మనోధైర్యంతో ఉండాలని కోరారు. తెలుగు సాహితీలోకానికి ఇది తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. ఏపీ మంత్రి నారా లోకేశ్ కూడా అందెశ్రీ మృతికి సంతాపం తెలిపారు. తన పాటలతో ఈ ప్రాంత వైభవాన్ని చాటిచెప్పిన అందెశ్రీ మరణం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. 'ఊరు మన దిరా', 'ఎర్రసముద్రం', 'వేగు చుక్క' సినిమాలకు అందెశ్రీ అమోఘమైన పాటలు అందించారని, ఆయన ఆత్మకు దేవుడిని ప్రార్థిస్తున్నట్లు సినీ నటుడు ఆర్.నారాయణ మూర్తి పేర్కొన్నారు. కాగా, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ వి.హనుమంత రావు, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, డీజీపీ బి.శివధర్‌రెడ్డి, హైదరాబాద్ సీపీ సజ్జనార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్ తదితరులు అందెశ్రీ భౌతికకాయానికి నివాళులర్పించారు.


అందెశ్రీ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి జూపల్లి

488 రోజుల తర్వాత అప్పీల్ చేస్తారా?

- ఇలాంటి వాటిని సమర్థించలేం
- ఎన్నికల విధులు, ఇతర కారణాలు చూపే హక్కు కలెక్టర్‌కు లేదు: హైకోర్టు
- మణికొండ జాగీర్ భూసేకరణ తీర్పుపై ప్రభుత్వ అప్పీలును కొట్టేసిన న్యాయస్థానం



హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూసేకరణకు సంబంధించిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 488 రోజుల తర్వాత వేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇంత ఆలస్యంగా దాఖలు చేసిన అప్పీలును సమర్థించలేమని ద్విసభ్య ధర్మాసనం తేల్చిచెప్పింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం మణికొండ జాగీర్‌లో సిలికాన్ హైట్స్ నిర్మాణం కోసం 2001లో సేకరించిన 6.22 ఎకరాల భూమికి సంబంధించి కలెక్టర్ దాఖలు చేసిన అప్పీల్‌ను తిరస్కరించింది. ఎన్నికల విధులు, ఇతర పనులను కారణంగా చూపే హక్కు కలెక్టర్‌కు లేదని స్పష్టం చేసింది. ప్రస్తుత సాంకేతిక యుగంలో ఎన్నో వెసులుబాట్లు ఉన్నా జాప్యం చేయడాన్ని స్వాగతించలేమని పేర్కొంది. మణికొండ జాగీర్‌లోని 6.22 ఎకరాల తమ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ మల్లేశ్వరి సహా 31 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి 2023, నవంబరులో తీర్పు ఇచ్చారు. సేకరించిన భూమికి బదులుగా ప్రత్యామ్నాయ భూమిని కేటాయించడం కోసం పిటిషనర్లు మూడు వారాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని, వాటిపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ భూమిని కేటాయించడం అసాధ్యమైతే 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి స్వాధీన ప్రక్రియను చేపట్టి మూడు నెలల్లో ముగించాలన్నారు. అంటే మొత్తం ఆరు నెలల్లో ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ మౌషమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పలు కారణాలతో 488 రోజుల జాప్యం తర్వాత అప్పీల్ దాఖలు చేశామని, విచారణకు స్వీకరించాలని సర్కారు కోరగా.. ధర్మాసనం తిరస్కరించింది.

తీర్పు నచ్చకుంటే జడ్జిని నిందిస్తారా?

- రేవంత్‌రెడ్డిపై దావా వేసిన పెద్దిరాజుకు సుప్రీంకోర్టు ప్రశ్న
- ఎట్టకేలకు క్షమాపణలకు అంగీకారం

న్యూఢిల్లీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానంలో అనుకూలమైన తీర్పు రాకపోతే న్యాయమూర్తిని నిందిస్తారా? అసభ్యకరమైన రీతిలో వ్యాఖ్యానిస్తారా? అంటూ సుప్రీంకోర్టు ఓ కక్షిదారుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో దావా వేసిన పెద్దిరాజును ఉద్దేశించి ఈ వ్యాఖ్య చేసింది. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యపై ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించింది. ఇంతకుముందే దీనిపై పెద్దిరాజు క్షమాపణలు చెప్పినప్పటికీ అంగీకరించని సుప్రీంకోర్టు ఎట్టకేలకు శాంతించి కేసును ముగించింది. 2016లో రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు గచ్చిబౌలిలోని తన హౌసింగ్ సొసైటీలోకి ప్రవేశించి నిర్మాణాలను ధ్వంసం చేశారని ఆరోపిస్తూ పెద్దిరాజు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు చాలాకాలంపాటు ఎల్బీనగర్ ప్రత్యేక సెషన్స్ జడ్జి ముందు పెండింగ్‌లో ఉండిపోయింది. 2023లో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన జస్టిస్ మౌసమి భట్టాచార్య.. సంఘటన జరిగిన సమయంలో రేవంత్ రెడ్డి అక్కడ లేకపోవడంతో కేసు నుంచి ఆయనకు విముక్తి కలిగించారు. దీనిపై పెద్ది రాజు స్పందిస్తూ న్యాయమూర్తి నిర్ణయం నిష్పక్షపాతంగా లేదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. గత విచారణ సందర్భంగా పెద్దిరాజుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో పిటిషనర్ పెద్దిరాజు క్షమాపణలు చెప్పినా.. సుప్రీం కోర్టు అంగీకరించలేదు. సోమవారం ఆ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పెద్దిరాజు చెప్పిన క్షమాపణలను అంగీకరిస్తున్నట్లు చెప్పిన ధర్మాసనం.. పిటిషన్‌పై విచారణను ముగించింది.

'మీ కొడుకును లొంగిపొమ్మని చెప్పండి'

- హిడ్మా తల్లిని కోరిన ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి

చర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'మీ కొడుకు హిడ్మాను లొంగిపొమ్మని చెప్పండి. ఇందుకు మీరు కూడా చొరవ చూపాలి' అని ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి విజయ్ శర్మ హిడ్మా తల్లిని కోరారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మాద్వి హిడ్మా స్వగ్రామమైన పువర్తిలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హిడ్మా ఇంటికి వెళ్లిన హోంమంత్రి.. అక్కడ హిడ్మా తల్లితో కలిసి భోజనం చేశారు. ఆపరేషన్ కగార్ జరుగుతున్న తీరు, తదనంతర పరిణామాలను ఆమెకు వివరించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

వణికిస్తున్న చలిపులి

- ఆదిలాబాద్ జిల్లా లోకారిలో అత్యల్పంగా 10.4 డిగ్రీలు నమోదు
- ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో 10.9 డిగ్రీల ఉష్ణోగ్రత


ఆసిఫాబాద్ పట్టణంలో కమ్ముకున్న పొగమంచు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 10 : శీతల గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత బాగా పెరిగింది. వారం రోజులుగా అనేక చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో రాత్రి, పగలు తేడా లేకుండా చలి ప్రభావం చూపిస్తోంది. సోమవారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29 సెల్సియస్ డిగ్రీలుగా.. కనిష్ఠ ఉష్ణోగ్రత 12 సెల్సియస్ డిగ్రీలుగా నమోదయ్యింది. అత్యల్పంగా గాదిగూడ మండలం లోకారి(కె)లో 10.4 డిగ్రీలు, బోథ్ మండలం పొచ్చెరలో 10.8, నేరడిగొండలో 11, బజార్‌హత్నూర్‌లో 11.5, భీంపూర్ మండలం అర్లి(టి)లో 11.6, గుడిహత్నూర్‌లో 12.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుమూల గిరిజన గ్రామాల్లోని ప్రజలు చలి తీవ్రతతో వణికి పోతున్నారు. సాయంత్రం, ఉదయం వేళల్లో చలి మంటలు వేసుకుంటూ వెచ్చదనాన్ని పొందుతున్నారు. ఈ నెల 19 వరకు జిల్లాపై శీతల గాలుల ప్రభావం అధికంగా ఉంటుందని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాత్రి, ఉదయం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని పేర్కొంటున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ రోజురోజుకు చలి తీవ్రత పెరిగిపోతోంది. మూడు రోజులుగా జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం తిర్యాణి మండలంలో 10.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఉదయం శీతల గాలులతో పాటు పొగమంచు కమ్మేస్తోంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లోని గ్రామాలు చలి తీవ్రతకు గజగజలాడుతున్నాయి. సాయంత్రం అయిదు గంటల నుంచి చలి తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటినా చలి తీవ్రత తగ్గకపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు జిల్లాలో 9 నుంచి 12 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా హవేలీఘనపురంలో 12.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని నర్సాపూర్‌లో 12.8 డిగ్రీలు, అల్లాదుర్గంలో 12.9 డిగ్రీలు, కౌడిపల్లిలో 13.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా మర్కూక్‌లో 11.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



ముగింపు సదస్సులో వేదికపై మోహన్ నాయక్

తెలంగాణకే దక్కిన ఐఆర్‌సీ అధ్యక్ష పదవి

- అధ్యక్షుడిగా ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) కౌన్సిల్ అధ్యక్ష పదవి తెలంగాణకే దక్కింది. రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ జే.మోహన్‌నాయక్ ఐఆర్‌సీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో ఈ నెల 5 నుంచి 10 వరకు 84వ ఐఆర్‌సీ సదస్సు జరగ్గా.. సోమవారం ముగింపు సదస్సులో మోహన్ నాయక్‌ను అధ్యక్షుడిగా కౌన్సిల్ ప్రకటించింది. అనంతరం కౌన్సిల్ సభ్యులు నాయక్‌కు శాలువా కప్పి సన్మానించి, బాధ్యతలు అప్పగించారు. కాగా, ఈ పదవి తెలుగు రాష్ట్రాలకు దక్కడం ఇదే మొదటిసారి. రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం, రోడ్ల భద్రత తదితర అంశాలపై ఐఆర్‌సీ కీలకంగా వ్యవహరిస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో రోడ్ల భద్రత, నిర్మాణాల్లో కొత్త పద్ధతులపై నిర్వహించే, అప్పటికే చేసిన పరిశోధనలకు సంబంధించిన అనుమతులతో పాటు ఆమోదం కూడా ఐఆర్‌సీనే ఇవ్వాల్సి ఉంటుంది. కేంద్ర రోడ్డు-రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) పరిధిలోని అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ) ఐఆర్‌సీ కౌన్సిల్‌కు అధికారిగా ఉన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల తరఫునుంచి ఆయా రాష్ట్రాలు ప్రతిపాదించిన వ్యక్తులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం ఒక అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, 3-4 ఉపాధ్యక్షులు, మొత్తం 100 మంది సభ్యులతో ఐఆర్‌సీ ఉంది.

రహదారుల భద్రతకు పెద్దపీట వేస్తాం: మోహన్‌నాయక్

ఈ పదవితో తనకు మరింత బాధ్యత పెరిగిందని, రహదారుల భద్రత, కొత్త నిర్మాణ పద్ధతులపై ప్రధానంగా దృష్టి సారిస్తామని, రహదారుల భద్రతకు పెద్దపీట వేస్తామని మోహన్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. వచ్చే ఏడాది తెలంగాణలో నిర్వహించే 85వ ఐఆర్‌సీ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తామని, కేంద్రం నుంచి మరిన్ని కొత్త ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చేలా కృషి చేస్తామన్నారు.

మేడిగడ్డ పునరుద్ధరణకు సహకరిస్తాం

- డిజైనర్ ఎంపిక తర్వాత భేటీకి సిద్ధం
- నీటి పారుదలశాఖ అధికారులతో సమావేశంలో ఎల్ అండ్ టీ
- తప్పంతా తమపై మోపుతారా? అని అసహనం

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ డిజైనర్ ఎంపిక పూర్తయ్యాక సహకరించడానికి సిద్ధమని దాని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ప్రతినిధులు చెప్పారు. బ్యారేజీ మరమ్మతు/ పునరుద్ధరణపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఎల్ అండ్ టీ ప్రతినిధులతో రాష్ట్ర నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం సమావేశమయ్యారు. తొలుత మరమ్మతులు/పునరుద్ధరణ బాధ్యతలు తీసుకోవాలని నిర్మాణ సంస్థను ఆయన కోరారు. అవసరమైతే సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ)తో సమావేశం ఏర్పాటు చేస్తామని, దీనికి హాజరు కావాలన్నారు. బ్యారేజీ పరీక్షలు పూర్తయి, ఫలితాలు, డిజైనర్ ఎంపిక పూర్తయ్యాక సమావేశం ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు బదులిచ్చారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ/ మరమ్మతులకు డిజైన్లు అందించాలని ఆసక్తి వ్యక్తీకరణ నోటీసునివ్వగా పలు సంస్థలు భాగస్వాములయ్యాయని రాహుల్ బొజ్జా తెలిపారు. డిజైనర్ సంస్థను ఎంపిక చేసేలోగా ప్రాజెక్టు పునరుద్ధరణకు తగిన యంత్రాలతోపాటు సిబ్బందిని సమకూర్చుకోవాలని ఎల్ అండ్ టీ ప్రతినిధులకు చెప్పారు. ఇదిలా ఉంటే, మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి తప్పంతా తమదేనని నిందలు మోపడం సరి కాదని, దాని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. బ్యారేజీ వైఫల్యానికి సహేతుక కారణాలు వెలుగులోకి రాకుండా, సాంకేతిక సమస్యలపై చర్చించకుండా తమపై ఎలా నిందలు మోపుతారని, బ్లాక్ లిస్టులో పెడతామని ఎలా లేఖలు రాస్తారని వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. నిర్మాణ సంస్థతోనే బ్యారేజీ పునరుద్ధరణ పనులు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతోనే లేఖ రాశామని, తమకు వేరే ఉద్దేశాలు లేవని నీటి పారుదలశాఖ అధికారులు బదులిచ్చారని సమాచారం. ఈ సమావేశంలో రామగుండం చీఫ్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.